www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 14-7-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 89 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: చవితి రా.12.00 తదుపరి పంచమి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.6.49 తదుపరి శతభిషం, వర్జ్యం: మ.1.54-3.28, దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14, అమృతఘడియలు: రా.11.20-12.55, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీటెక్‌లో సీఎస్‌ఈ జోరు

ఇతర ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు బేజారు
కంప్యూటర్ సైన్స్ గ్రూపుల్లోనే 55% సీట్లు
సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై మక్కువే కారణం
ఈసీఈకి కూడా పెరిగిన డిమాండ్
సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్ బ్రాంచ్‌ల్లో క్రమంగా తగ్గుతున్న సీట్లు

ఇంజనీరింగ్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం
జీవోలు విడుదల చేయకముందే ప్రక్రియ
జాబితాలో మొత్తం 251 కాలేజీలు
అందులో కనిపించని ఎస్ఆర్ఎం, మిట్స్
ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

11

కట్టల గుట్టలు

లిక్కర్ స్కామ్‌లో వీడియోలు రికవరీ!

డెన్‌లలో నోట్ల కట్టల పంపిణీ దృశ్యాలు

టెక్నాలజీ సాయంతో ఎఫ్ఎస్ఎల్ వెలికితీత
నాడు ముడుపుల పంపిణీపై వీడియోలు
వాటిని 'పెద్దల'కు పంపిన నిందితులు
సెల్‌ఫోన్లలో డిలీట్ చేసినా 'డేటా రిట్రీవల్'
కట్టల మధ్యలో రాయలసీమ నేత అనుచరుడు
17న కోర్టుకు చార్జిషీట్ సమర్పించనున్న సిట్




గత జగన్ ప్రభుత్వంలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు కీలక ఆధారాలు కనుగొన్నారు. అధునాతన టెక్నాలజీ సాయంతో మద్యం ముడుపుల పంపిణీకి సంబంధించిన వీడియోలను సేకరించారు. డెన్‌లలో దాచిన డబ్బుల వివరాలు అప్పటి ప్రభుత్వ, అధికార పార్టీ పెద్దలకు తెలియజేసేందుకు నిందితులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన దృశ్యాలు ఆ వీడియోల్లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. కేసు విచారణలో భాగంగా నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను బయటికి తీశారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక నిందితులు ముందుజాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారు. అయితే అధికారులు సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపి డిలీట్ చేసిన వీడియోలను వెలికి తీయించారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో ముడుపుల వసూళ్ల నుంచి పంపిణీ వరకూ పక్కా పథకం ప్రకారం చేశారు. మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక 'పెద్దల'కు చేరవేసేవారు. ఇదంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగింది. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారు. డెన్‌లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ఈ వీడియోలను సంబంధిత వ్యక్తులకు పంపారు. ఎన్నికల తర్వాత ఊహించని ఫలితం రావడంతో అప్రమత్తమైన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్ వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడు. ప్రతి ఫోన్‌కూ కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా వారికి ఇచ్చేసి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడు. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారు. ఇలా సాక్ష్యాలు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంత తెలివైన దొంగ అయినా ఎక్కడో ఒక చోట

మిగతా 11వ పేజీలో...





గణేశ్ చిత్రంలో విలన్‌గా..



రెండిళ్ల పూజారి చిత్రంలో లేడీ గెటప్‌లో..

అహ నా పెళ్లంట సినిమాలో పిసినారి లక్ష్మీపతిగా కోట శ్రీనివాసరావు



కోట తెరాభినిష్క్రమణం

అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే తుది శ్వాస విడిచిన కోట శ్రీనివాసరావు

అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విలక్షణ నటుడు
4 దశాబ్దాల సినీ ప్రయాణం.. 750కి పైగా చిత్రాల్లో నటన
కడసారి చూపునకు తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు
ఆయన పార్థివదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమైన తోటి నటులు
కోట భౌతికకాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్పాంజలి
ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ సహా పలువురి నివాళులు
జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిసిన కోట అంత్యక్రియలు
కోటకు 9 నంది అవార్డులు.. 2015లో పద్మశ్రీ పురస్కారం



కోట శ్రీనివాసరావు పార్థివదేహం వద్ద రోదిస్తున్న బాబూమోహన్

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్/రాయదుర్గం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హాస్యమైనా.. హడలెత్తించే విలనీ అయినా.. భావోద్వేగమైనా.. భయపెట్టే డైలాగైనా.. పాత్ర ఏదైనా, మాండలికమేదైనా.. వెటకారం, కపటత్వం.. మంచితనం, మమకారం.. అన్నిటినీ అలవోకగా పలికించే విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు (83) ఇక లేరు! రంగస్థలంపై తన నటజీవితాన్ని ప్రారంభించిన ఆయన.. వెండితెరపై నాలుగున్నర దశాబ్దాలపాటు వెలిగి.. ఎనిమిది పదుల వయసులో జీవన రంగస్థలం నుంచి శాశ్వతంగా నిష్క్రమించారు! దాదాపు 750 సినిమాల్లో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన కోట.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే

మిగతా 10వ పేజీలో...

అడ్డగోలుగా తవ్వేస్తున్నారు!

నిబంధనలు గాలికొదిలి ఇసుక మైనింగ్
భారీ యంత్రాలతో నదీ గర్భాలు గుల్ల
గుండిమెడ, కొల్లిపర రీచ్‌లలో యథేచ్ఛగా తవ్వకాలు.. వేమూరు నియోజకవర్గానికి చెందిన వ్యక్తి దందా
మంత్రులు, నేతల పేర్లు చెప్పి తరలింపు
ఇసుక లారీలు తనిఖీలు చేయకుండా గనుల అధికారుల ద్వారా ఒత్తిళ్లు
జిల్లాల వారీగా వాస్తవ పరిస్థితిపై సీఎంకు అధికారుల నివేదిక
ఎన్‌జీటీకీ అందిన ఫిర్యాదులు
త్వరలోనే విచారణ జరిగే అవకాశం

అసలే వర్షాకాలం.. ఇసుక రీచ్‌ల్లో అక్టోబరు నెలాఖరుదాకా తవ్వకాలు చేపట్టకూడదు. దీనిని అడ్డంపెట్టుకుని కొందరు నేతలు ఇసుక రీచ్‌లపై పడిపోతున్నారు. నిల్వ ఉన్న ఇసుకనే తరలిస్తున్నామనే పేరిట కొత్తగా తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాలను ఉపయోగించి నదీగర్భాలను తోడేస్తున్నారు. రాత్రీ పగలూ తేడా లేకుండా వేల లారీల్లో తరలించేస్తున్నారు. కొందరు నేతలే దగ్గరుండి ఈ చీకటి దందాను ప్రోత్సహిస్తుండడంతో అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేందుకు ఉద్దేశించిన నిఘా, నియంత్రణ, పర్యవేక్షణ వ్యవస్థలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో విపత్కర పరిస్థితులు వస్తాయని.. ఉన్నతాధికారులు జిల్లాల వారీగా వాస్తవ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. ఇప్పటికే ఈ అంశంపై జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)కు రెండు ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై విచారణ మొదలైతే ప్రభుత్వం సమాధానం చెప్పుకోకతప్పదు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చింది. కొన్ని రీచ్‌ల్లో ఇసుకను తవ్వితీసి ప్రభుత్వానికి అందించే బాధ్యతను స్వయంసహాయ సంఘాలు, ఇతర ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. అయితే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ

మిగతా 12వ పేజీలో...



బోల్తా పడ్డ మామిడికాయల లారీ

మామిడి లారీ బోల్తా

9 మంది మృతి.. 9 మందికి గాయాలు
అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం 12

అమరావతిలో బిట్స్ క్యాంపస్

35 ఎకరాల్లో రూ.1,000 కోట్లతో ఏర్పాటు
2027 నుంచి అందుబాటులోకి: బిర్లా

రైలు బోగీల్లో సీసీ కెమెరాలు

ఒక్కో కోచ్‌లో 4 చొప్పున ఏర్పాటు 2
నార్తర్న్ రైల్వే పరిధిలో పైలట్ ప్రాజెక్టు

పేర్ని మైండ్ గేమ్!

గుడివాడ హైడ్రామా వెనుక పక్కా వ్యూహం

మాజీ మంత్రి పథక రచనతోనే జడ్పీ చైర్‌పర్సన్, ఆమె భర్త గుడివాడ రాక
ఉద్దేశపూర్వకంగానే కారాపి హైడ్రామా
పోలీసులు చెప్పినా వెళ్లకుండా.. టీడీపీ శ్రేణులపై అసభ్య దూషణలు 12
ఎస్ఐ వచ్చి బతిమాలినా కదలని వైనం
దాడి తర్వాత స్టేషన్‌కెళ్లి హారిక కన్నీరు
బీసీ మహిళా జడ్పీ చైర్‌పర్సన్‌పై లోకేశ్ దాడి చేయించారంటూ పేర్ని హడావుడి
ఆందోళనలకు జగన్ పిలుపివ్వాలంటూ వైసీపీ పెద్దలతో ఫోన్ సంభాషణ



వీడియో సాక్షిగా బట్టబయలు

పగలే చంపండని చెబుతా!

బాబూ.. 76 ఏళ్లు వచ్చాయ్.. ఇంకా ఎంత కాలం ఉంటావ్
ఏరా పీకే.. సిగ్గుపెట్టలేదా దేవుడు
సీఎం, డిప్యూటీ సీఎంపై పేర్ని నాని అసభ్య వ్యాఖ్యలు
పెడనలో మళ్లీ పేట్రేగిన మాజీ మంత్రి
అమలాపురంలో సీఐపై విశ్వరూప్ చిందులు

పదవితో అహంకారం 2

ఇతరులపై ఆధిపత్యానికి యత్నం
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు
బీజేపీ అధిష్ఠానం గురించే: విపక్షాలు

'రియల్'కు నూతనోత్తేజం!

నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పథకం
మార్గదర్శకాలు జారీ చేసిన పట్టణాభివృద్ధి శాఖ
అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభించే చాన్స్
ఆమోదించిన ప్లాన్‌కు కట్టుబడాల్సింది యజమానే
తప్పుడు సమాచారం ఇస్తే ఎల్‌టీపీల లైసెన్స్ రద్దు 11

రేపటి నుంచి యూకే ఈ-వీసా 2

పాస్‌పోర్టుతో డిజిటల్‌గా వీసా లింక్
యూకేవీఐ ఖాతా, అప్‌డేట్లు తప్పనిసరి
వృత్తి నిపుణుల వీసాల్లో కఠిన షరతులు
సోషల్ కేర్ వీసాలు ఇకపై ఉండవు

67వ జయంతి



కీ॥శే॥ శ్రీమతి వేమూరి కనకదుర్గ గారు
(డైరెక్టర్ -ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి)
జననం : 14.07.1958 - మరణం : 27.04.2021

నీవు లేవన్న వేదనలో
నీ జ్ఞాపకాలే మాకు ఊరట..
నీవు లేకున్న చీకటిలో
నీ అడుగుజాడే మాకు వెలుగు..

- వేమూరి రాధాకృష్ణ
మరియు కుటుంబ సభ్యులు

దేశమంతటా ఓటర్ల జాబితాల తనిఖీ



బిహార్ తరహాలో వచ్చే నెలలో చేపట్టనున్న ఈసీ!

» రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయి యంత్రాంగం క్రియాశీలం

» బిహార్ జాబితాల్లో భారీగా విదేశీయులు

న్యూఢిల్లీ/పట్నా, జూలై 13: బిహార్లో మాదిరిగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత తనిఖీ చేపట్టాలని ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయించింది. ఈ ఏడాది అక్టోబరు-నవంబరుల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అనర్హులైన ఓటర్లను తొలగించేందుకు తనిఖీలు చేపట్టే అధికారం ఈసీకి ఉందని, అది దాని రాజ్యాంగ కర్తవ్యమని సుప్రీంకోర్టు స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమీక్ష, తనిఖీ రాజ్యాంగవిరుద్ధమని, ఓటర్ల ఓటుహక్కును హరించేదిగా ఉందంటూ వివిధ ప్రతిపక్షాలు వేసిన పిటిషన్‌పై ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ నెల 28న ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ జరుగనుంది. ఆ తర్వాత వచ్చే నెలలోనే దేశవ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహణకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసే వీలుంది. ముందుగా వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన అసోం, కేరళ, బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో ఈ ప్రక్రియ చేపడతారు. విపక్షాలు పిటిషన్ వేసిన మర్నాడే.. అంటే ఈ నెల 5న జాబితాల సమీక్షకు సన్నాహాలు మొదలుపెట్టాలని ఆదేశిస్తూ ఈసీ అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారు(సీఈవో)లకు లేఖ రాసింది. వచ్చే ఏడాది జనవరి 1కల్లా ఈ ప్రక్రియ పూర్తిచేయాలని.. 18 ఏళ్లు నిండినవారికి ఓటు హక్కు కల్పించాలని స్పష్టంచేసిందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించింది.

బంగ్లా, మయన్మార్, నేపాలీలకు ఓట్లు

బిహార్లో చేపట్టిన ప్రత్యేక విస్తృత తనిఖీల్లో.. పెద్దసంఖ్యలో విదేశీయులు ఉన్నట్లు తేలింది. నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ జాతీయుల పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉన్నాయని.. తనిఖీలు పూర్తయ్యాక తొలగిస్తామని ఈసీ వర్గాలు తెలిపాయి. గత నెల 25 నుంచి ఈ రాష్ట్రంలో తనిఖీలు మొదలయ్యాయి. 77 వేల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు).. 7.8 కోట్ల మంది ఓటర్లున్న జాబితాలను ఆగస్టు 1 నుంచి లోతుగా పరిశీలించనున్నారు. తనిఖీల అనంతరం వారి పేర్లు తొలగించి తుది జాబితాలను సెప్టెంబరు 30న ప్రచురిస్తారు. ఓటర్లు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే డాక్యుమెంట్లు సమర్పించాలని ఈసీ ఇప్పటికే ఆదేశించింది. డాక్యుమెంట్లు చూపలేకపోతే ఓట్లు తీసేస్తారని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేయడంతో ఇందుకోసం ఆధార్, ఈసీ జారీచేసిన ఫొటో ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

లోకం తీరు



రాజ్యసభకు ఉజ్వల్ నికమ్


26/11 ఉగ్ర దాడి కేసులో ఈయనే పీపీ.. పెద్దల సభకు నామినేట్ చేసిన రాష్ట్రపతి

» విదేశాంగ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శృంగ్లాకూ చాన్సు

» కేరళ బీజేపీ నేత సదానందన్ మాస్టర్, చరిత్రకారిణి మీనాక్షి జైన్‌కు కూడా..


ఉజ్వల్ దేవరావ్ నికమ్


హర్షవర్ధన్ శృంగ్లా


సి.సదానందన్


మీనాక్షి జైన్

న్యూఢిల్లీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నలుగురు ప్రముఖులను నామినేట్ చేశారు. వీరిలో ముంబైపై ఉగ్రవాద దాడి (26/11) కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా ఉన్న ఉజ్వల్ దేవరావ్ నికమ్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శృంగ్లా, ఢిల్లీకి చెందిన చరిత్రకారిణి 'పద్మశ్రీ' మీనాక్షి జైన్, కేరళ బీజేపీ నేత సి.సదానందన్ మాస్టర్ ఉన్నారు. వీరికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. రాజ్యాంగంలోని 80వ అధికరణలోని 1ఏ, 3 క్లాజుల కింద తనకు సంక్రమించిన అధికారాలతో రాష్ట్రపతి రాజ్యసభకు 12 మందిని ఎంపిక చేసే అవకాశముంది. ఈ జాబితాలో ప్రస్తుతం నాలుగు ఖాళీలు ఉండగా.. వాటిని ఆదివారం భర్తీచేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహారాష్ట్రలోని జల్గావ్‌లో జన్మించిన నికమ్ (73).. ప్రముఖ న్యాయవాది. ఆ రాష్ట్రంలో పలు కీలక కేసుల్లో న్యాయవాదిగా ఉన్నారు. ముంబైపై ఉగ్రదాడిలో పట్టుబడిన అజ్మల్ కసబ్‌కు ఉరిశిక్ష పడడంలో ముఖ్యపాత్ర పోషించారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓడిపోయారు. శృంగ్లా 2020-22 నడుమ విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. 2023లో జరిగిన జి-20 సదస్సు సమన్వయకర్తగా వ్యవహరించారు. బీజేపీలో చేరారు. మీనాక్షి జైన్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' మాజీ సంపాదకుడు గిరిలాల్ జైన్ కుమార్తె. చరిత్రకారిణి అయిన ఈమె మధ్యయుగాల భారతంపై పుస్తకం రాశారు. వాజపేయి ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్‌సీఈఆర్‌టీ ఈ పుస్తకాన్ని పాఠ్యగ్రంథంగా చేసింది. 2004లో యూపీఏ సర్కారు రాగానే ఆమె పుస్తకాన్ని తొలగించింది. ఢిల్లీలోని గార్గి కాలేజీలో చరిత్ర బోధించే మీనాక్షి.. మోదీ ప్రభుత్వ హయాంలో 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్'లో సభ్యురాలిగా నియమితులయ్యారు. 2020లో ఆమెకు పద్మశ్రీ కూడా లభించింది. అయోధ్యలో రామజన్మభూమిపై కూడా ఆమె పుస్తకం రాశారు. ఇక సదానందన్ మాస్టర్ కేరళలోని కన్నూర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. వామపక్ష నేపథ్యం ఉన్న ఈయన ఆర్ఎస్ఎస్‌లో చేరడంతో సీపీఎం కార్యకర్తలు 1994లో ఆయన కాళ్లు నరికేశారు. 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కూత్తుపరంబలో బీజేపీ తరఫున పోటీ చేసిన మాస్టర్‌ను గెలిపించేందుకు ప్రధాని మోదీ స్వయంగా ప్రచారం చేయడం విశేషం. వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రీత్యా సదానందన్ ఎంపికకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన్ను రాజ్యసభకు నామినేట్ చేయడం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపుతుందని భావిస్తున్నారు. ఈ నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి సభలో అధికార ఎన్డీఏ బలం 133కి పెరిగింది. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలకమైన ఆర్థిక బిల్లులను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇది మోదీ ప్రభుత్వానికి లాభిస్తుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

ప్రధాని ఏమన్నారంటే..

న్యాయరంగంలో, రాజ్యాంగానికి నికమ్ సేవలు ఆదర్శప్రాయమని.. విజయవంతమైన న్యాయవాది మాత్రమే కాదని.. ముఖ్యమైన కేసుల్లో న్యాయం కోసం ముందువరుసలో నిలుస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శృంగ్లా దౌత్యవేత్తగా, మేధావిగా, వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా పేరుగాంచారని.. భారత విదేశాంగ విధానానికి, జి-20 సదస్సు విజయవంతానికి కృషిచేశారని తెలిపారు. మీనాక్షి జైన్ మేధావి, పరిశోధకురాలు, చరిత్రకారిణిగా ప్రసిద్ధి చెందారని.. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజనీతి శాస్త్రంలో ఆమె రచనలు చేశారన్నారు. సదానందన్ మాస్టర్ జీవితం సాహసం, అన్యాయానికి తలొగ్గని వ్యక్తిత్వాన్ని చాటుతోందని తెలిపారు. ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగానూ ప్రశంసాత్మక పాత్ర పోషించారని ఆయన కొనియాడారు.

రాజ్యసభలో ప్రస్తుత బలాబలాలు..

మొత్తం సభ్యులు	: 245
ఎన్డీఏ (10 మంది నామినేటెడ్ సభ్యులతో కలిపి)	: 133
ఇండీ కూటమి	: 78
ఇతర విపక్షాలు	: 29
ఖాళీలు	: 5

వచ్చే జూన్‌లో రిటైర్ కానున్న ఖర్గే

» దేవెగౌడ, దిగ్విజయ్‌తో పాటు కొందరు కేంద్ర మంత్రులు కూడా..

» ఆంధ్ర నుంచి నలుగురు.. తెలంగాణ నుంచి ఇద్దరు

న్యూఢిల్లీ, జూలై 13: రాజ్యసభలో ఏకంగా 72 స్థానాలకు 2026 ఏప్రిల్, జూన్, నవంబరుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. పలువురు కీలక నేతలు, కొందరు కేంద్ర మంత్రుల పదవీకాలం వచ్చే ఏడాది ముగియనుంది. వీరిలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ (కర్ణాటక), కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్, కేంద్ర మంత్రి జార్జి కురియన్ (మధ్యప్రదేశ్), కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టూ (రాజస్థాన్), జేఎంఎం వ్యవస్థాపకుడు శిబూ సోరెన్ (జార్ఖండ్), కాంగ్రెస్ నేత శక్తిసింగ్ గోహిల్ (గుజరాత్), వైసీపీ ఎంపీలు పరిమళ్ నత్వానీ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, టీడీపీ ఎంపీ సానా సతీశ్ (ఆంధ్రప్రదేశ్) కూడా జూన్‌లో రిటైర్ కానున్నారు. వీరికి ముందే ఏప్రిల్‌లో ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అఠవాలే (ఆర్పీఐ) సహా మహారాష్ట్ర నుంచి ఏడుగురు పదవీ విరమణ చేయనున్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీఆర్ఎస్‌కు చెందిన కేఆర్ సురేశ్‌రెడ్డి కూడా అదే నెలలో రిటైర్ కానున్నారు. మహారాష్ట్ర-7, తమిళనాడు-6, బెంగాల్-5, బిహార్-5, ఒడిసా-4, అసోం-3, తెలంగాణ-2, ఛత్తీస్‌గఢ్-2, హరియాణా-2, హిమాచల్ నుంచి ఒక్కరు చొప్పున ఏప్రిల్‌లో రిటైరవుతారు. ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది, ఉత్తరాఖండ్ నుంచి ఒకరు నవంబరులో పదవీవిరమణ చేస్తారు.

భారత్‌కు సౌదీ అరేబియా ఎరువులు

» సౌదీలో పర్యటించిన కేంద్ర మంత్రి నడ్డా

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కొరతను తీర్చేందుకు సౌదీ అరేబియా.. భారత్‌కు ఎరువులు సరఫరా చేయనుంది. కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డా ఆదివారం సౌదీ అరేబియాలో పర్యటించారు. అత్యధికంగా యూరియాతోపాటు ఇతర ఎరువులను ఉత్పత్తి చేసే క్రిబ్కో, ఇతర సంస్థల ప్రతినిధి బృందం, భారతీయ రాయబారి సోహైల్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రాస్ అల్ ఖైర్ ప్రాంతంలో ఉన్న గనులు, ఎరువుల సంస్థ మాడెన్‌కు చెందిన ఫ్యాక్టరీని సందర్శించారు. శుక్రవారం రాత్రి సౌదీకి వచ్చిన మంత్రి ఇక్కడి అధికారులు, వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. ఎరువుల ఉత్పత్తి, సరఫరాల తదితరాలపై వారితో చర్చించారు. యూరియా, ఇతర ఎరువులను మాడెన్.. భారత్‌కు ఎగుమతి చేస్తుంది. భారత్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కేంద్రం 52లక్షల టన్నుల యూరియా వినియోగాన్ని అంచనావేయగా, ఇంకా నాట్లు పూర్తవకముందే 48లక్షల టన్నుల విక్రయం జరిగిందని, పంట చేతికొచ్చే సరికి యూరియా ఇంకా అవసరమవుతుందని ప్రభుత్వం అంచనావేస్తోంది. ప్రతి సీజన్‌లో రాష్ట్రాల నుంచి ఎరువులకు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడడంతో ఎరువులు ప్రత్యేకించి.. యూరియా, పొటాష్ సమస్యను పరిష్కరించే దశగా మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ సౌదీ అరేబియాతో అనేకసార్లు చర్చలు జరిపి వెళ్లారు కూడా. రష్యా, మొరాకో, జోర్డాన్, ఈజిప్టు, చైనా దేశాలు భారతీయ ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకును అందిస్తున్నా భౌగోళికరీత్యా ధర, సమయం కారణాన భారత్.. సౌదీ వైపు మొగ్గు చూపుతోంది. సౌదీ, ఇతర అరబ్బు దేశాల నుంచి ఎగుమతయ్యే ఎరువుల్లో అత్యధిక భాగం కాకినాడ, విశాఖపట్టణం, పారాదీప్ నౌకాశ్రయాలకు చేరుకుంటాయి.

పదవితో అహంకారం పెరుగుతుంది: గడ్కరీ

ముంబై, జూలై 13: పదవులు, సంపద, విజ్ఞానం, అందం లభించినప్పుడు వ్యక్తుల్లో అహంకారం పెరిగిపోతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. శనివారం ఆయన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు అంగీకరించిన నాయకులు ఎన్నడూ ఆధిపత్య ధోరణిని ప్రదర్శించరని గడ్కరీ పేర్కొన్నారు. "అధికారంతో తాము అత్యంత తెలివైన వాళ్లుగా మారామని భావించడం మొదలయ్యాక.. ఇతరులపై ఆధిపత్యానికి ప్రయత్నిస్తారు. వినయాన్ని చూపే నాయకులు సహచరుల్లో గౌరవభావంతో ఉంటారు. ఈ చర్య బృంద సహకారానికి దోహదపడుతుంది. విభిన్న ఆలోచనలకు అవకాశమిస్తుంది"అన్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుల నియామకాల కోసం కొందరు లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అయితే గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. విపక్షాలు ఆ వ్యాఖ్యలను బీజేపీ అధిష్ఠానంపై గురిపెట్టిన మాటలుగా పేర్కొంటున్నాయి.

డిసెంబరులో 'గగన్‌యాన్'

» మానవరహిత రాకెట్ ప్రయోగం : ఇస్రో చైర్మన్ నారాయణన్

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా వచ్చే డిసెంబరులో మానవరహిత రాకెట్ ప్రయోగం జరపనున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రకటించారు. తమిళనాడులోని కన్నియాకుమారి జిల్లా కులశేఖర పట్టణంలో యువ శాస్త్రవేత్తల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ.. 'గగన్‌యాన్' మిషన్ ద్వారా ఒక భారతీయుడిని ఏవోజీ పద్ధతి ప్రకారం రాకెట్‌లో అంతరిక్షానికి పంపి.. అక్కడ పరిశోధనల అనంతరం మళ్లీ భూమి మీదకు తీసుకురానున్నామని చెప్పారు. వచ్చే డిసెంబరులో మానవరహిత రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపుతామని, ఆ తర్వాత మరో రెండు రాకెట్లను పంపి పరిశోధనలు పూర్తి చేశాక.. 2027లో అంతరిక్షంలోకి మనిషిని పంపే గగన్‌యాన్ మిషన్‌ను చేపడతామని నారాయణన్ తెలిపారు. 2040లో చంద్రుడిపై భారతీయులు అడుగుపెట్టేలా మిషన్‌ను రూపొందించే ప్రయత్నాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.



రైలు బోగీల్లో సీసీ కెమెరాలు

» రైల్వేశాఖ నిర్ణయం.. కేంద్ర మంత్రి ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 13: ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా రేల్వే శాఖ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 74 వేల ప్యాసింజర్ కోచ్‌లతో పాటు 15 వేల లోకోమోటివ్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆమోదం తెలిపారు. నార్తర్న్ రైల్వే పరిధిలో లోకో ఇంజన్లు, కోచ్‌లలో ప్రయోగాత్మకంగా సీసీటీవీ కెమెరాలను అమర్చి, వాటి పనితీరును పరిశీలించిన తరువాత ఈ వ్యవస్థను దేశవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో రైళ్లలో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని రైల్వే శాఖ భావిస్తోంది.

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఇలా..

ప్రతి ప్యాసింజర్ కోచ్‌లో నాలుగు డోమ్- రకం సీసీటీవీ కెమెరాలు (ప్రతి ప్రవేశ మార్గంలో రెండు) ఉంటాయి. ప్రతి లోకోమోటివ్ కోచ్‌లలో ముందు, వెనుక, రెండు వైపులా ఒక్కో కెమెరా ఉంటుంది. ప్రతి లోకోమోటివ్ క్యాబ్‌లో (ముందు, వెనుక) ఒక డోమ్ సీసీటీవీ కెమెరా, రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమరుస్తారు. గంటకు 100 కి.మీ వేగంతో వెళ్తున్న రైలులో, తక్కువ వెలుతురులోనూ స్పష్టమైన, అధిక నాణ్యత గల ఫుటేజీని అందించేలా కెమెరాలు ఉండాలని అధికారులను రైల్వేశాఖ ఆదేశించింది. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో ప్రయాణికుల గోప్యతకు భంగం కలగకుండా తలుపుల వద్ద మాత్రమే వాటిని అమర్చనున్నారు. ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికే ఈ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ ఆధునికీకరణ ప్రయత్నాలు భారతీయ రైల్వే ప్రయాణికులకు సురక్షితమైన, పటిష్ఠమైన ప్రయాణ అనుభవాన్ని అందించాలనే నిబద్ధతకు నిదర్శనం అని అధికారులు పేర్కొన్నారు.

రైల్వే రిక్రూట్‌మెంట్‌లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు

ఉద్యోగ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా రూపొందించాలని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయించింది. రాబోయే నాలుగు నెలల్లో రైల్వేలోని అన్ని నియామక కేంద్రా ల్లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాంకేతికతను ప్రవేశపెట్టనుంది. దీంతో రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో మోసాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థ ఆధార్ ఈ-కేవైసీని ఉపయోగించుకుని, అభ్యర్థుల గుర్తింపును పలు దశల్లో ధ్రువీకరిస్తుంది. దరఖాస్తుల సమర్పణ సమయంలో, పరీక్ష రోజున, చివరికి పరీక్ష పూర్తయ్యాక కూడా.. పరీక్షకు హాజరైన వ్యక్తి, దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఒకరేనా, కాదా అని దీని ద్వారా నిర్ధారిస్తారు.


ప్రమాద స్థలంలో కాలిపోతున్న డీజిల్ ట్యాంకర్లు

పట్టాలు తప్పి అగ్గి రేగి.. 18 డీజిల్ ట్యాంకర్లు దగ్ధం

రూ.12 కోట్ల ఆస్తి నష్టం.. తమిళనాడులోని తిరువళ్లూరు వద్ద ఘటన

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీజిల్ ట్యాంకర్ల లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పటంతో ట్యాంకర్లు ఒకదానినొకటి ఢీకొని నిప్పంటుకుని భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 18 ట్యాంకర్లలో ఉన్న 900 టన్నుల డీజిల్ కాలిపోయింది. రూ.12కోట్ల మేరకు ఆస్తినష్టం సంభవించింది. తమిళనాడులోని తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. చెన్నై శివారు ప్రాంతం మనలిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సంస్థ నుంచి 52 ట్యాంకర్లలో డీజిల్‌ను నింపుకుని గూడ్స్ రైలు ఆదివారం వేకువజామున కర్ణాటకలోని మైసూరుకు బయలుదేరింది. తిరువళ్లూరు రైల్వేస్టేషన్ దాటగానే రైలింజన్, దాని వెనుకనున్న మూడవ ట్యాంకర్, దాని తర్వాత మరో రెండు ట్యాంకర్లు పట్టాలు తప్పాయి. 70 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన డీజిల్ ట్యాంకర్లు ఒకదానినొకటి ఢీకొనడంతో ఆ రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వెలువడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని సుమారు ఏడు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం కారణంగా ఆ రైలు మార్గంలోని సిగ్నల్ బోర్డులు, విద్యుత్ వైర్లు దెబ్బతిన్నాయి.

రేపటి నుంచి యూకే ఈ-వీసా

పాస్‌పోర్టుతో డిజిటల్‌గా వీసా అనుసంధానం.. యూకేవీఐ ఖాతా, అప్‌డేట్లు తప్పనిసరి

» వృత్తి నిపుణుల వీసాల్లో కఠిన షరతులు

» సోషల్ కేర్ వీసాలు ఇకపై ఉండవు

» పదేళ్ల తర్వాతే శాశ్వత నివాసానికి చాన్స్



లండన్, జూలై 13: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో ఈ నెల 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈ-వీసాలు అమల్లోకి వస్తాయి. వీసాల జారీ ప్రక్రియలో యూకే ఇమిగ్రేషన్ చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ-వీసాలను పరిచయం చేస్తారు. అంటే.. ఈ నెల 15 నుంచి అన్ని రకాల వీసాలు పొందేవారి పాస్‌పోర్టులతో ఈ-వీసాలు లింక్ అయ్యి.. డిజిటల్ రూపంలో కొనసాగుతాయి. బ్రిటన్ తన వలస విధానంలో భాగంగా ఈ ఏడాది మే నెలలో 'రీస్టోరింగ్ కంట్రోల్ ఓవర్ ఇమిగ్రేషన్ సిస్టమ్' పేరుతో శ్వేతపత్రాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే..! ఆ విధానంలో భాగంగా ఈ నెల 15 నుంచి దశల వారీగా వీసా విధానంలో కీలక మార్పులు అమల్లోకి వస్తాయి. ఇమిగ్రేషన్ ప్రక్రియను గాడిన పెట్టేందుకు ఈ విధానాన్ని తీసుకువస్తున్నట్లు అధికారులు వివరించారు. భారత్ నుంచి విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో యూకే వీసాలు తీసుకుంటుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇకపై వీసా విగ్నెట్‌ను జారీ చేయరని, దాని బదులు ఈ-వీసా జారీ అవుతుందని పేర్కొన్నారు. ఈ-వీసా అనేది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుందని.. కొత్త విధానంలో విద్యార్థులు తమ పాస్‌పోర్టు అప్‌డేట్స్‌ని ఎప్పటికప్పుడు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. "ప్రస్తుతం ఫిజికల్ వీసా స్టిక్కర్లు ఇస్తున్నారు. ఈనెల 15 నుంచి దీన్ని రద్దు చేస్తారు. ప్రయాణికుల పాస్‌పోర్టు నంబర్లకు అనుసంధానించిన సురక్షిత వీసా ఆన్‌లైన్ రికార్డులను పరిచయం చేస్తారు. ఇది బార్డర్ కంట్రోల్(సరిహద్దు నియంత్రణ)ను సులభతరం చేస్తుంది. పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది" అని స్పష్టం చేశారు.

యూకేవీఐ ఖాతా తప్పనిసరి

విద్యార్థులు యూకేవీఐ ఖాతాను తెరిచి, ఈ-వీసాను నిర్వహించుకోవాల్సి ఉంటుందని ఇమిగ్రేషన్ అధికారులు తెలిపారు. వీసా వివరాలు, ఇతర అప్‌డేట్లు, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, కంపెనీలకు చేరవేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు యూకేలో బస చేసేందుకు, కోర్సుల్లో చేరే సమయాల్లో ఆయా కంపెనీలు, ఇళ్లను అద్దెకిచ్చేవారు, విశ్వవిద్యాలయాలు కూడా యూకేవీఐ ఖాతాను తనిఖీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఉల్ఫాపై భారత్ సర్జికల్ దాడులు!

» మయన్మార్‌లోని శిబిరాలే లక్ష్యంగా డ్రోన్ దాడులు

» ముగ్గురు సీనియర్లను కోల్పోయిన ఉల్ఫా-ఐ

» 19 మందికి గాయాలైనట్టు ప్రకటన.. ఖండించిన భారత సైన్యం

న్యూఢిల్లీ, గువాహటి, జూలై 13: ఈశాన్య ప్రాంతంలోని వేర్పాటువాద గ్రూపులపై భారత సైన్యం సర్జికల్ దాడులకు దిగింది. మయన్మార్‌లోని తమ శిబిరాలపై భారత సైన్యం డ్రోన్, క్షిపణి దాడులు చేసినట్టు నిషేధిత ఉల్ఫా-ఐ (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం-ఇండిపెండెంట్) ఆదివారం ప్రకటించింది. ఈ దాడుల్లో ముగ్గురు సీనియర్ నాయకులను కోల్పోయామని, దాదాపు 19 మంది గాయపడ్డారని వెల్లడించింది. మయన్మార్ సైన్యం సహకారంతో ఉల్ఫా-ఐ, ఎన్ఎస్‌సీఎన్-కే (నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్-ఖప్లాంగ్) స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున భారత సైన్యం డ్రోన్ దాడు లు చేసినట్టు సమాచారం. భారత సరిహద్దులోని మయన్మార్‌లో నాగా స్వయం పాలిత ప్రాంతమైన హోయత్ బస్తీలోని ఉల్ఫా-ఐ తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం, వక్తం బస్తీలోని 779 శిబిరంతోపాటు మరో రెండు శిబిరాలు లక్ష్యంగా రెండు గంటలకు పైగా దాడులు జరిగాయి. ఈ దాడులకు 300కుపైగా డ్రోన్లను వినియోగించినట్టు తెలిసింది. ఈ దాడుల్లో ఉల్ఫా-ఐ అగ్ర కమాండర్ నయన్ మేధి అలియాస్ నయన్ అసోం మరణించినట్టు ఉల్ఫా-ఐ తెలిపింది. పరేశ్ బారువా నేతృత్వంలోని నిషేధిత ఉల్ఫా-ఐ సంస్థకు ఆయన కీలక వ్యూహకర్తగా, సైనిక శిక్షకుడిగా ఉన్నాడు. అలాగే.. ఈ డ్రోన్ దాడుల్లో ఎన్ఎస్‌సీఎన్-కేకు చెందిన శిబిరాలూ దెబ్బతిన్నాయి. కాగా, నయన్ అసోం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా తమ శిబిరంపై మరోసారి క్షిపణి దాడి జరిగిందని ఉల్ఫా-ఐ పేర్కొంది. ఆ సమయంలో బ్రిగేడియర్ గణేశ్ అసోం, కల్నల్ ప్రదీప్ అసోం మ రణించారని ప్రకటించింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. మయన్మార్‌లోని కచిన్ ఇండిపెండెంట్ ఆర్మీ, నాగా తిరుగుబాటుదారు లు, పాక్ గూఢాచార సంస్థ ఐఎస్ఐ, అఫ్గాన్‌లోని ముజాహిదీన్‌లతో ఉల్ఫా-ఐకి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, మయన్మార్‌లోని నిషేధిత ఉల్ఫా-ఐ శిబిరాలపై డ్రోన్ దాడులు చేయలేదని భారత సైన్యం ఆదివారం స్పష్టం చే సింది. ఉల్ఫా-ఐ చేసిన ప్రకటనను భారత సైన్యం ఓ ప్రకటనలో ఖండించింది.

హిందూ వ్యాపారిని కొట్టి చంపి శవంపై చిందులు!


» బంగ్లాదేశ్‌లో దారుణం

ఢాకా, జూలై 13: బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారిని షాపు నుంచి లాక్కెళ్లిన ఓ పార్టీకి చెందిన యూత్ వింగ్ కార్యకర్తలు.. దారుణంగా దాడి చేసి చంపి అతడి మృతదేహంపై డ్యాన్స్ చేశారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంతో బంగ్లాదేశ్ వ్యాప్తంగా మైనారిటీలు ఆందోళనలు చేపట్టారు. అక్కడి తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీల్లో విద్యార్థులు నిరసనలతో హోరెత్తించారు. పాత ఢాకా ప్రాంతంలోని మిట్‌ఫోర్డ్ ఆస్పత్రి సమీపంలో హిందువైన లాల్‌చంద్ సోహగ్ తుక్కు వ్యాపారం చేసేవారు. ఈ నెల 9వ తేదీన అటుగా ర్యాలీగా వచ్చిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యూత్ ఫ్రంట్‌కు చెందిన కార్యకర్తలు.. షాపు నుంచి అతడిని బయటకు ఈడ్చుకెళ్లి కాంక్రీట్ దిమ్మెలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం అతడు చనిపోయాడని నిర్ధారించుకున్నాక మృతదేహంపై ఉన్మాదుల్లా చిందులు వేశారు. దీనిపై లాల్‌చంద్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితుల పేర్లు నమోదు కాగా.. 20 మంది వరకు గుర్తు తెలియని అనుమానితులు కూడా ఉన్నారు. ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

అంతరిక్షం నుంచి భారత్ 'సారే జహా సే అచ్ఛా..'

» వీడ్కోలు సమావేశంలో శుభాంశు శుక్లా వ్యాఖ్య

» నేడు భూమికి తిరుగు ప్రయాణం



న్యూఢిల్లీ, జూలై 13: అంతరిక్షం నుంచి భారత్ ఆశావాదం, నిర్భయత్వం విశ్వాసంతో సగర్వంగా కనిపిస్తోందని ప్రస్తుతం రోదసీ యాత్ర చేస్తున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అన్నారు. యాక్సియం-4 మిషన్ ద్వారా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో రెండు వారాల పాటు ప్రయోగాలు చేసిన ఆ మిషన్ సభ్యులు సోమవారం భూమికి తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన వీడ్కోలు సమావేశంలో శుభాంశు మాట్లాడారు. అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపిస్తోందన్న ప్రశ్నకు 'సారే జహా సే అచ్ఛా' అని సమాధానం ఇచ్చారు. 1984లో తొలిసారిగా అంతరిక్ష యాత్ర చేసిన రాకేశ్ శర్మ అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపిస్తోందన్న ప్రశ్నకు సారే జహా సే అచ్ఛా అని జవాబిచ్చారు. దానినే ప్రస్తుతం శుభాంశు గుర్తు చేశారు. 'ఆజ్ కా భారత్ స్పేస్ సే నిడార్, గర్వ్ సే పూర్ణ్ దిక్తా హై'..భారత్ గర్వకారణంగా కనిపిస్తోందని తెలిపారు. ఐఎస్ఎస్‌లో ప్రస్తుతం 11 మంది ఉన్నారు. వారిలో ఏడుగురు ఎక్స్‌పెడిషన్-73 ద్వారా వెళ్లిన వారు కాగా, శుభాంశు సహా మరో ముగ్గురు యాక్సియం-4 ద్వారా వెళ్లారు. తిరుగు ప్రయాణంపై నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ అమెరికాలో మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 7.05 గంటలకు ఐఎస్ఎస్‌లోని హార్మోనీ మాడ్యూల్ ద్వారా ఆ నలుగురు బయటకు వచ్చి స్పేస్ ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను అధిరోహిస్తారని తెలిపారు. కాలిఫోర్నియా సముద్ర తీరంలో దిగుతారని చెప్పారు. భారత కాలమానం ప్రకారమయితే మంగళవారం సాయంత్రం 3.00 గంటలకు భూమి మీదకు వస్తారని కేంద్ర శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి జితేందర్ సింగ్ తెలిపారు.



హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి

అహోబిలంలో హైకోర్టు జడ్జి పూజలు

ఆళ్లగడ్డ, జూలై 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి కుటుంబ సభ్యులు ఎగువ అహోబిలంలోని నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను, దిగువ అహోబిలంలోని ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకుడు న్యాయమూర్తి కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్



కుటుంబ సభ్యులతో తిరుమలలో కమలాకర్‌రెడ్డి

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్) కమలాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

» రెండు రోజులు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నందున రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు టీటీడీ రద్దు చేసింది. 14, 15వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుమల ఆలయంలో టీడీపీ ఎమ్మెల్యే థామస్ తిట్లదండకం

» తన అనుచరులందరినీ ప్రొటోకాల్‌లో అనుమతించాల్సిందేనని డిమాండ్



ఆలయం ముందు అనుచరులతో ఎమ్మెల్యే థామస్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): చిత్తూరుజిల్లా గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్ తిరుమలలో ఆదివారం హల్‌చల్ చేశారు. ఆయన శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుమలకు చేరుకున్నారు. నిబంధనల ప్రకారం ఈయనతోపాటూ మరో 9మందికి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ జారీ చేసింది. అలాగే తనతో వచ్చిన మరో ఆరుగురికి వేరే రిఫరెన్స్‌లో సాధారణ వీఐపీ బ్రేక్ టికెట్లు పొందారు. అయితే వీరిని కూడా తనతో పాటూ క్యూకాంప్లెక్స్ 1లోని ప్రొటోకాల్ లైన్‌లోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించడంతో టీటీడీ సిబ్బంది అనుమతించలేదు. వారితో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే ఆగ్రహంతో తిట్లకు దిగడమే గాక బలవంతంగా తన అనుచరులను నేరుగా ఆలయంలోకి తీసుకువెళ్లినట్టు తెలిసింది. సిబ్బంది సమాచారం ఇవ్వడంతో డిప్యూటీఈవో, విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేకి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారి మీద కూడా ఎమ్మెల్యే థామస్ విరుచుకుపడినట్టు తెలిసింది. వివాదం పెద్దదవడంతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేకి సర్దిచెప్పి పంపారు.

పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హజరత్తయ్య

» ఉపాధ్యక్షుడిగా తిరుపతిస్వామి

ఒంగోలు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకాశం జిల్లా సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఇదే జిల్లాలోని ఏఆర్ ఎస్సై వి.తిరుపతి స్వామి ఎన్నికయ్యారు. ఒంగోలులోని కేబీ రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాలులో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అలాగే ఐదుగురు సభ్యులను కోఆప్షన్ మెంబర్లుగా ఎన్నుకున్నారు.

పుష్కలంగా ఎరువులు

» మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ కూడా..
» ఇప్పటికే 5.06లక్షల టన్నుల అమ్మకం
» ప్రస్తుతం 8.64లక్షల టన్నుల నిల్వలు రెడీ
» అన్నిరకాలపైనా రైతులకు సబ్సిడీ
» కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

సీఎం ఆదేశాలతో అన్నిచోట్లా అందుబాటులో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వర్షాలు ఆలస్యమై రాష్ట్రంలో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతున్నా ఎరువుల విషయం రైతులు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. సీజన్‌కు అవసరమైన మేరకు అంచనా వేసి, కేంద్రప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చించి, రాష్ట్రానికి రావాల్సిన కోటా ప్రకారం వ్యవసాయశాఖ ఎరువుల్ని తెప్పిస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎరువుల కోసం రైతులు ఎక్కడా బారులు తీరకుండా ఎప్పటికప్పుడు తీసుకెళ్లేలా అన్ని రకాల ఎరువుల్ని రైతులకు అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకే ఎక్కువగా ఎరువులు కేటాయించి, సహకార సంఘాలు, రిటైల్ డీలర్లకు నామమాత్రంగా సరఫరా చేసింది. కానీ ఇప్పుడు ఎరువులు అందుబాటులో లేవన్న మాట రాకుండా రిటైల్ డీలర్లు, సహకార సంఘాలకు సాధ్యమైనంత వరకు ఎరువులు సరఫరా చేస్తోంది. అత్యవసర సమయంలో లభ్యత కోసం మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ కూడా సిద్ధం చేసింది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం నెలకొనగా, మరికొన్ని ప్రాంతాల్లో చెదురు మదురుగా వర్షాలు పడుతుండటంతో ప్రస్తుతం ఎరువుల అవసరం పెద్దగా రాలేదు. కానీ వానలు పడి, విత్తనాలు నాటుతున్న ప్రాంతాలు, కాలువల కింద ఆయకట్టులో వరి నారుమళ్లు పోస్తున్న రైతులకు ఎరువుల అవసరం ఏర్పడుతోంది.



కొన్ని జిల్లాల్లో ముమ్మరంగా కొనుగోళ్లు

ప్రస్తుతం కర్నూలు, శ్రీకాకుళం, మన్యం, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎరువుల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ జిల్లాల రైతులు ఎరువుల కోసం సహకార మార్కెటింగ్ సొసైటీకి వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో సహకార సంఘాలకు ఎరువులు పెద్దగా ఇవ్వకపోవడం, ఇప్పుడు సహకార సంఘాలకూ తగినన్ని ఎరువులు సరఫరా చేస్తుండటంతో రైతులు నేరుగా వెళ్లి తీసుకుంటున్నారు. ఈ సీజన్‌లో అన్ని రకాల పంటలకు కలిపి రాష్ట్రానికి 16.76లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఏప్రిల్ నాటికే 7.13లక్షల టన్నుల ప్రారంభనిల్వ ఉండగా, ఇప్పటి వరకు 6.56లక్షల టన్నుల ఎరువులు రాష్ట్రానికి వచ్చాయి. మొత్తం 13.70లక్షల టన్నుల లభ్యతలో 5.06లక్షల టన్నుల ఎరువులు ఇప్పటికే అమ్ముడుపోయాయి. ప్రస్తుతం 8.64లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఆదివారం చెప్పారు.

డీలర్లకు ఉచిత రవాణా

యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ వంటి ఎరువులకు కొన్ని కంపెనీలు ఇతర ఉత్పత్తులతో లింక్ పెట్టి సరఫరా చేస్తుండటంతో డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ వైపు రవాణా ఖర్చులు పెరిగి, మరోవైపు లింక్ ప్రొడక్ట్స్ అమ్ముడు పోక వ్యాపారులు నష్టపోతే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో యూరియా అమ్మలేమని రిటైల్ డీలర్లు చేతులెత్తేయడంతో అధికారులు స్పందించారు. ఎరువుల తయారీ కంపెనీలు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లతో అధికారులు చర్చలు జరిపారు. ఫలితంగా రైల్వే గూడ్స్ ర్యాక్ పాయింట్ల నుంచి రిటైల్ డీలర్లకు ఉచితంగా లారీల్లో రవాణా చేసేందుకు పలు కంపెనీలు అంగీకరించాయి. కానీ ఎరువులు ఉచిత రవాణా అంశం జాతీయ స్థాయి విధానం అయినందున కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు ఇటీవలే కేంద్రానికి లేఖ రాశారు. కాగా, రాష్ట్రంలో ఎరువుల ర్యాక్ పాయింట్లు 22 ఉండగా, కొత్తగా అనకాపల్లిలో ఏర్పాటుకు డైరెక్టర్ డిల్లీరావు చొరవతో అనుమతి వచ్చింది. మదనపల్లి/ పీలేరు, హిందూపురం/పెనుగొండలో ర్యాక్ పాయింట్ల ఏర్పాటు అంశం కేంద్రం పరిశీలనలో ఉంది.

రాష్ట్రంలో ఎరువుల లభ్యత వివరాలు (జూలై 11 నాటికి.. టన్నుల్లో)

రకం	కేటాయింపు	ప్రారంభనిల్వ	వచ్చినది	మొత్తం	అమ్మకం	లభ్యత
యూరియా	6,22,000	2,97,865	2,18,719	5,16,584	2,20,578	2,96,007
కాంప్లెక్స్	6,30,000	2,59,469	2,64,808	5,24,277	1,62,153	3,62,124
డీఏపీ	2,60,000	46,321	97,710	1,44,031	52,482	91,548
ఎస్ఎస్‌పీ	94,000	44,762	55,590	1,00,352	40,194	60,158
ఎంవోపీ	70,000	65,436	20,038	85,474	30,617	54,857
మొత్తం	16,76,000	7,13,853	6,56,865	13,70,718	5,06,023	8,64,695

ఎరువుల లభ్యత.. ధరలు.. సబ్సిడీ

ప్రస్తుతం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 50,838 లక్షల టన్నుల యూరియా కంపెనీల గోదాముల్లో ఉండగా, హోల్‌సేల్ డీలర్ల వద్ద 19,994 లక్షల టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 81,494లక్షల టన్నులు, రిటైలర్ల వద్ద 1,02,473 టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 13,626లక్షల టన్నులు, సహకార సంఘాల్లో 27,582లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 45కిలోల బస్తా రూ.2,270 కాగా, రూ.2,004 సబ్సిడీ పోను రూ.267 ఎమ్మార్పీగా ప్రభుత్వం నిర్ణయించింది. 50కిలోల డీఏపీ బస్తా రూ.3,772కాగా సబ్సిడీపై రూ.1,350కు, 50కిలోల కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.3,009 కాగా, సబ్సిడీపై రూ.1,400కు, 50కిలోల ఎంవోపీ రూ.2,409 కాగా రూ.1,700కు, 50కిలోల ఎస్ఎస్‌పీ రూ.878 కాగా సబ్సిడీపై రూ.535కు అమ్మాలని వ్యవసాయశాఖ పేర్కొంది. ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే.. కఠిన చర్యలుంటాయని డైరెక్టర్ డిల్లీరావు హెచ్చరించారు. కాగా, రాష్ట్రానికి కేటాయించే ఎరువులపై సబ్సిడీ కింద కేంద్రం ఏటా రూ.12 వేల కోట్లు భరిస్తోంది.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే మరో బషీర్‌బాగ్ ఉద్యమం

» ప్రజలపై రూ.1500 కోట్ల భారాన్ని మోపిన జగన్
» వైసీపీ విధానాలనే అవలంబిస్తున్న కూటమి సర్కారు
» మీటర్లు బిగించడానికి వస్తే వాటిని పగలగొట్టండి
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
» ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన ప్రజావేదిక సదస్సు

విజయవాడ(గాంధీనగర్), జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని తక్షణమే ఆపకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమానికి ప్రజలు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ 'స్మార్ట్‌మీటర్లు వద్దు- ట్రూ అప్ చార్జీలు రద్దు' అంశంపై నగరంలోని దాసరిభవన్‌లో ఆదివారం ప్రజావేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటు తదితర చార్జీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాకాదని విద్యుత సిబ్బంది స్మార్ట్‌మీటర్లు బిగించడానికి వస్తే వాటిని వినియోగదారులు వాటిని పగలగొట్టాలన్నారు. జగన్ ప్రభుత్వంలో అదానీ నుంచి ముడుపులు తీసుకుని 25 సంవత్సరాల ఒప్పందంతో ప్రజలపై రూ.1500 కోట్ల భారాన్ని మోపారని ఆరోపించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు.. స్మార్ట్‌మీటర్లు బిగించడానికి వస్తే పగులగొట్టాలని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత బిగించాలంటూ ద్వంద్వ వైఖరి అవలంబించడాన్ని తప్పుబట్టారు. స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని రద్దు చేస్తామంటూ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన టీడీపీ, జనసేన నాయకత్వం.. ఇప్పుడు ఒప్పందాన్ని రద్దు చేయకుండా అదానీ సంస్థను అనుమతించడం ప్రజలను మోసగించడమేనన్నారు. మరోవైపు విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపుతున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఇచ్చిన పిలుపుకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఆయన ప్రకటించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యుత్ సంస్కరణలు, స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు నుంచి పోరాటం ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న స్మార్ట్‌మీటర్ల బిగింపు, విద్యుత్ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధమైనవని, ఈ సంస్కరణలు పార్లమెంటులో ఆమోదం కాకుండా ఎలా అమలు చేస్తారని మండిపడ్డారు. మరో బషీరాబాగ్ ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను ప్రజావేదిక సదస్సు ప్రకటించింది. ఈ నెల 15, 16న జిల్లాలో రౌండ్ టేబుల్ సమావేశాలు, 17 నుంచి 22 వరకు పట్టణ, మండల సదస్సులు, 23 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, జూలై 30 నుంచి ఆగస్టు 4 వరకు వీధి/కాలనీ సమావేశాలు, ప్రదర్శనలు, 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు ఉంటాయని పేర్కొంది. సీఐటీయూ నేత నరసింగరావు, ఇఫ్టూ, ఏఐటీయూసీ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన ప్రజావేదిక సదస్సులో అభివాదం చేస్తున్న వామపక్ష నేతలు రామకృష్ణ, శ్రీనివాసరావు, నరసింగరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు



సదస్సులో ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్

సమష్టి కృషితో తెలుగు భాషను కాపాడుకుందాం

» రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో తెలుగు భాషను కాపాడుకుందామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆడిటోరియంలో రెండు రోజులుగా కొనసాగిన రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తెలుగు మాట్లాడేవారంతా పెద్ద సంఖ్యలో సదస్సుకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అందుకు తగిన సహకారం అందిస్తామని అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల్లో తమ మాతృభాషను ఎలా కాపాడుకుంటున్నారో గుర్తించి ఆ దిశగా మాతృభాషను ఉద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో చెన్నపురి తెలుగు అకాడమీ అధ్యక్షుడు తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు - దిగ్దర్శనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

చేనేత, హస్తకళలకు అవార్డుల పంట

» 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి'లో ఏపీకి పది జాతీయ అవార్డులు
» నేడు ఢిల్లీలో స్వీకరించనున్న కలెక్టర్లు: మంత్రి సవిత



జాతీయ అవార్డు పొందిన బొబ్బిలి వీణ

అమరావతి, పెనుకొండ టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ఓడీవోపీ) కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు పది ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయని, ఇందులో చేనేత, హస్తకళలకు ఏకంగా ఏడు అవార్డులు రావడం హర్షణీయమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. మరో రెండు అవార్డులు వ్యవసాయ రంగానికి వచ్చాయని. మరో అవార్డు అంతర్రాష్ట్ర విభాగంలో దక్కిందని చెప్పారు. ఈ అవార్డులను సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆయా జిల్లాల కలెక్టర్లు అందుకుంటారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మంత్రి సవిత ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఓడీవోపీకి జాతీయ స్థాయిలో మూడు రాష్ట్రాలు ఎంపిక కాగా.. అందులో ఏపీ కూడా ఉందన్నారు. విజయనగరం జిల్లా నుంచి బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లా ఏటి కొప్పాక బొమ్మలు, కాకినాడ నుంచి పెద్దాపురం సిల్క్‌శారీ, బాపట్ల నుంచి చీరాల సిల్క్‌శారీ, తిరుపతి నుంచి వెంకటగిరి చీర, నర్సాపురం అల్లికల కుట్టు, శ్రీసత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం పట్టు.. అవార్డులకు ఎంపికయ్యాయన్నారు. వ్యవసాయ రంగంలో గుంటూరు మిర్చి, శ్రీకాకుళం జీడిపప్పు చోటు సంపాదించాయని తెలిపారు.

ఆగస్టు 7 నుంచి చేనేతకు ఉచిత విద్యుత్ పథకం: సిసోడియా

సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వ ప్రోత్సాహం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో దక్కిన అవార్డులు నిదర్శనమని చేనేత, జౌళి శాఖ ప్రత్యేక సీఎస్ సిసోడియా తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లానూ ఓడీవోపీ కింద గుర్తింపు పొందేలా సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డుల ఫలితంగా చేనేత, హస్తకళా ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. కళాకారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించే అవకాశం ఉంటుందని వివరించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు సిసోడియా వెల్లడించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

» కమ్మ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమ్మ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, తదితరులు

విజయవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కమ్మ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు కమ్మ సామాజిక మేధావులు, పెద్దలు ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్స్ రిక్రియేషన్ సెంటర్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కమ్మ సేవాసమాఖ్య రాష్ట్ర స్థాయి ప్రతినిధులు సమావేశం జరిగింది. కమ్మసేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ... కమ్మకులంలో ఐక్యత లేకపోవడం వల్ల అనేక కార్యక్రమాలు చేయడానికి సాధ్యపడడం లేదన్నారు. పెద్దలు, సభ్యుల సహకారంతో ఆర్థికంగా నిధులు సేకరించి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేవలం కమ్మ కులానికే కాకుండా ఇతర వర్గాలలోని పేదలను గుర్తించి వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిలో రాష్ట్రస్థాయి కమ్మ భవన్ కార్యాలయ నిర్మాణం, డిజిటల్, భౌతిక గ్రంథాలయాలు ఏర్పాటుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మురళీకృష్ణ పిలుపునిచ్చారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గన్ని భాస్కరరావు, గూడూరు సత్యనారాయణ, సూరపనేని స్వరూప రాణి, మండలపు జగదీష్, గుమ్మడి రామకృష్ణ, కనమేడల శ్రీనివాస, బొర్రా గాంధీ, జీవీ రాయుడు, సామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

8 మరియు 9 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹3,600 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద 15 జూలై, 2025 (మంగళవారం)న నిర్వహించబడుతుంది. పోటీ లేని స్కీమ్ ప్రకారం రిటైల్ డైరెక్ట్ పోర్టల్ (https://rbiretaildirect.org.in) ద్వారా కూడా వ్యక్తిగత ఇన్వెస్టర్‌లు బిడ్‌లు దాఖలు చేయవచ్చు

మరింత సమాచారం కొరకు 11 జూలై, 2025 (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్‌సైట్ (www.rbi.org.in)ను చూడండి.

"మీకు డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఇ-మెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
సీల్డు టెండరు, ఇ-టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన షార్ట్ టెండర్ Computer No: 89289/2025, Dt: 11-07-2025

శ్రీ అమ్మవారి దేవస్థానం, విజయవాడకు చెందిన కృష్ణా జిల్లాలోని పెనమలూరు మండలం, గోసాల గ్రామములో గల సర్వే నెం.89/5 మరియు 92/3 లో గల య.4.72 సెంట్ల మెరక భూమిలో పంట సాగు చేసుకొను కౌలు హక్కును 3 సంవత్సరముల కాలపరిమితికి జారీ చేయుటకు గాను గోసాల గ్రామ పంచాయితీ కార్యాలయము నందు తేది:21-07-2025 న సీల్డు టెండర్ మరియు బహిరంగవేలం పాటలు నిర్వహించబడును. ఆసక్తిగల వారు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ఫోన్: 7901261634, 9966003456.

సీల్డు టెండరు, ఇ-టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన (షార్ట్ టెండర్) Computer No: 82349, Dt: 12-07-2025

శ్రీ అమ్మవారి దేవస్థానం, విజయవాడ నందు ఈ దిగువ చూపిన ఐటం లకు మహామండపం 4వ అంతస్థు నందు సీల్డు టెండరు, ఇ-టెండరు మరియు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. 1. మహామండపము 5వ అంతస్థులోని 19 షాపులలో మిగిలిన 11 షాపులకు 3వ పర్యాయం సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం తేది:22-07-2025, ఉదయం 10.00 గం॥ల నుండి నిర్వహించబడును. ప్రథమ ధరావత్తు రూ.2,00,000/-. 2. దేవస్థానం నందు ఉన్న ఎరుపు రంగు అట్ట చీర ముక్కలు, ఎర్రముక్కల స్టాకును కాజి 1కి చొప్పున విక్రయించు నిమిత్తం 3వ పర్యాయం సీల్డు టెండర్, ఇ-టెండర్ మరియు బహిరంగ వేలం తేది:22-07-2025 మధ్యాహ్నం 2.00 గం॥ల నుండి నిర్వహించబడును. ప్రథమ ధరావత్తు రూ.2,00,000/-. ఇతర వివరముల కొరకు మరియు సమర్పించవలసిన డాక్యుమెంట్లు కొరకు kanakadurgamma.org website నందు మరియు కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. ఫోన్: 7901261634, 9966003456.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.

ఆంధ్రజ్యోతి
JOB OPPORTUNITIES
Andhra Jyothy Daily Newspaper VIJAYAWADA UNIT.
Electrical Department has Vacant Position as per given below.

Jr. ENGINEER :
Work Experience in Printing Industry, Generators, U.P.S. Min. 3 Years Experience.
Qualification : Diploma in EEE or B.Tech EEE
Interested Candidates can attend to Interview on Dt. 14-07-2025, Time : 10 AM to 2 PM with original Qualification & Experience Certificates.

ELECTRICIANS:
Work Experience in Industrial Electrical or Printing Industry Electrical Maintenance, House Wiring Min. 2 Years Experience.
Qualification : I.T.I. Electrical Wireman
Fresh Candidates who have passed ITI & Diploma or B.E can also attend as Trainee.
Candidates who were Selected has to work in Electrical Dept. Candidates cans send their Biodata to the given Mail.

ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సితార టవర్స్, (యూనియన్ బ్యాంక్ బిల్డింగ్), ఫ్లాట్ నెం. 102, బెంజిసర్కిల్, విజయవాడ - 520 010.
సెల్: 99854 10969, Email : ajvenurmele@gmail.com

కోసిగి తిమ్మప్ప కొండపై క్రీస్తుపూర్వం ఆనవాళ్లు

» శిలాయుగం నాటి సమాధులుగా గుర్తింపు
» పరిశీలించిన పురావస్తు శాఖ అధికారులు



తిమ్మప్పకొండపై క్రీస్తుపూర్వం సమాధుల ఆనవాళ్లు

కోసిగి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): క్రీస్తుపూర్వం శిలాయుగం నాటి సమాధులను కర్నూలు జిల్లాలో గుర్తించారు. కోసిగి మండలం తిమ్మప్ప కొండపై ఉన్న ఈ సమాధులను పురావస్తు, ప్రదర్శన శాలల సహాయకులు బి మహేంద్రనాయుడు ఆదివారం తన బృందంతో కలిసి పరిశీలించారు. తిమ్మప్ప కొండపై కొన్ని పురావస్తు ప్రాధాన్యత కలిగిన సమాధులను.. ఆవుల రాఘవేంద్ర, కానిస్టేబుల్ నాగన్న, కోసిగి వాసులు రాముడు, ఈరన్న బృందం గుర్తించి పురావస్తు శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతపురం ప్రాంతీయ సహాయ సంచాలకుడు ఎం.స్వామినాయక్ ఆదేశాల మేరకు తిమ్మప్ప కొండపై ఉన్న ఈ సమాధులను పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. ఒక కిలోమీటరు పరిధిలో ఉన్నవాటిని పరిశీలించి.. ఇవి బహుశా క్రీస్తు పూర్వం 600 నుంచి 1000 సంవత్సరాలకు చెందినవిగా గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా మహేంద్రనాయుడు మాట్లాడుతూ.. తిమ్మప్ప కొండపై ఉన్న సమాధులు పురావస్తు పరంగా అత్యంత ప్రాధాన్యత కలిగినవని చెప్పారు. చారిత్రక స్పృహ లేకపోవడం వల్ల.. గొర్రెలు, పశువుల కాపరులు, ప్రజలు కొన్నింటిని ధ్వంసం చేశారని, మిగిలి ఉన్న ఆనాటి సమాధులు, మనుషుల పాద ముద్రలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

గెయిల్, అంబికాకు భూ కేటాయింపుల రద్దు

» రాజధానిలో కొత్తగా కొన్ని సంస్థలకు భూముల కేటాయింపు
» మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో సీఆర్‌డీఏ పరిధిలో పలు సంస్థలకు భూములను కేటాయిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 23న నిర్వహించిన 18వ మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో చేసిన సిఫారసుల మేరకు ఈ ఆదేశాలిచ్చారు. గతంలో చేసిన కొన్ని కేటాయింపులను రద్దు చేయడంతోపాటు కొన్ని కొత్త ప్రతిపాదనలను ఆమోదిస్తూ ఈ సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. ఆరు సంస్థలకు గతంలో భూ కేటాయింపులు చేయగా, వాటిని రివైజ్ చేస్తూ 33.495 ఎకరాలను తాజాగా కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీబీఐకి గతంలో రాయపూడి వద్ద 3.50 ఎకరాలు కేటాయించగా, తాజాగా దానిని సవరించి 2 ఎకరాలకు కుదించారు. 60 ఏళ్ల లీజు కింద ఈ కేటాయింపు చేయనున్నారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు గతంలో ఎకరా కేటాయించగా, ప్రస్తుతం దానికి రెండెకరాలు 60 ఏళ్ల లీజు కింద కేటాయించనున్నారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు తుళ్లూరులో గతంలో 3 ఎకరాలు కేటాయించగా, తాజాగా 5 ఎకరాలను ఏడాదికి చదరపు మీటర్‌కు రూ.1 చొప్పున 11 ఏళ్లకు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఆపరేషన్ రైట్స్ కింద అప్పగిస్తారు. ఆప్కాబ్‌కు గతంలో 3.095 ఎకరాలు కేటాయించగా, తాజాగా ఆఫీసు స్థలం కోసం 0.495 ఎకరాలు ఫ్రీహోల్డ్ కింద అప్పగించనున్నారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి గతంలో 12 ఎకరాలు కేటాయించగా, ఇప్పుడు కూడా అదే 12 ఎకరాలను ఫ్రీహోల్డ్ కింద అప్పగిస్తారు. అంతర్జాతీయ క్రికెట్ అకాడమీకి గతంలో 12 ఎకరాలు కేటాయించగా, ఇప్పుడు కూడా పిచ్చుకలపాలెంలో ఫ్రీహోల్డ్ కింద ఇవ్వనున్నారు. గెయిల్‌కు 0.40 ఎకరాలు, అంబికా అగర్‌బత్తి సంస్థకు ఎకరా గతంలో కేటాయించగా, తాజాగా ఆ కేటాయింపులను రద్దు చేశారు. కొత్తగా భూముల కోసం 7 ప్రతిపాదనలు రాగా, 32.40 ఎకరాలు కేటాయించారు. ఆదాయపన్ను శాఖకు 2ఎకరాలు, ఏపీ గ్రామీణ బ్యాంకుకు 2 ఎకరాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 0.40 ఎకరాలు, సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)కి 0.50 ఎకరా, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్‌కు 0.50 ఎకరా, కిమ్స్ మెడికల్ కళాశాలకు 25 ఎకరాలు, బీజేపీ కార్యాలయానికి 2 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

అమరావతిలో భూమిలేని పేదలకు పింఛన్ల పునరుద్ధరణ

» 1575 మందికి మళ్లీ పింఛన్లు

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో భూమిలేని 1575 మంది పేదలకు పింఛన్లను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. సీఆర్‌డీఏ పరిధిలో నివశిస్తున్న భూమిలేని పేదలకు గతంలో టీడీపీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరుచేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరంచెల తనిఖీలు చేపట్టి వారిలో 1575 మంది అర్హులు కారని తేల్చి పెన్షన్ రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 40వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో వారందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని నిర్ణయించింది. అమరావతి రాజధాని తర్వాత పలువురు ఉపాధి కోల్పోయినందున పెన్షన్లు పునరుద్ధరించాలని నిర్ణయించడంతో ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

బొమ్మలు: అక్బర్

ఇంద్రగంటి శ్రీకాంత శర్మ పురస్కారం

2025వ సంవత్సరానికి 'ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం' ప్రముఖ కవి విన్నకోట రవి శంకర్‌కి ఇస్తున్నాం. 2020లో ప్రారంభమైన ఈ పురస్కారానికి రవి శంకర్ ఆరవ గ్రహీత. అవార్డు ప్రదానోత్సవ తేదీ, వేదికల వివరాలను త్వరలో తెలియజేస్తాం.

పురస్కార కమిటీ

ముంజూరు కళింగాంధ్ర కవితా వార్షిక

సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక 2024 గ్రంథాన్ని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం హరిపురం గ్రామంలో జులై 18న ఆవిష్కరించనున్నారు. నల్లి ధర్మారావు, దుప్పల రవికుమార్, వినోద్ కుత్తుం, సాంబమూర్తి లండ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 99892 65444.

సిక్కోలు బుక్స్

'కున్నెమ్మ, మరికొన్ని కథలు'

రాజాం రచయితల వేదిక 126వ సాహిత్య సభ జూలై 20న శ్రీవిద్యానికేతన్ పాఠశాల, రాజాం, విజయనగరం జిల్లాలో జరుగుతుంది. ఈ సభలో ప్రొ.కాశీం 'సమాజం–సాహిత్యం–సాంస్కృతిక చైతన్యం' అంశంపై ఉపన్యాసం ఇస్తారు. ఇదే సభలో బాలసుధాకర్ మౌళి కథా సంపుటి 'కున్నెమ్మ – మరికొన్ని కథలు' పుస్తకాన్ని గార రవిప్రసాద్, గార సూర్య శైలజ ఆవిష్కరిస్తారు. సభలో అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు పాల్గొంటారు.

పిల్లా తిరుపతిరావు

చోడగిరి చంద్రరావు కవిత్వం

కోయి కోటేశ్వరరావు సంపాదకత్వం వహించిన 'భీమకవి' చోడగిరిచంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ జూలై 20 ఉ.10 గంటలకు యూ.టి.ఎఫ్ బిల్డింగ్, కాకినాడలో జరుగుతుంది. అధ్యక్షత నేలపూడి బాలరాజు, ఆవిష్కర్త పొనుగుమట్ల విష్ణుమూర్తి, ముఖ్య అతిథి కోరుకొండ బాబ్జీ, విశిష్ట అతిథులు శిఖామణి, జి లక్ష్మీనరసయ్య, చోడగిరి లలితాదేవి, బండి సత్యనారాయణ, కొబ్బరాకు సుధాకర్, అద్దేపల్లి ప్రభు, మాకివీడి సూర్యభాస్కర్ తదితరులు.

సవిలే రాజేష్

'ప్రణామం' కవి సమ్మేళనం

మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జులై 20ఉ.10 గంటలకు విజయవాడ బందర్ రోడ్డులో అంబేడ్కర్ స్మృతివనం ఆవరణలో జరుగుతుంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు భాష, సామాజిక న్యాయం, దేశభక్తి, శాంతి, పర్యావరణం అంశాలపై తమ కవితల్ని వినిపిస్తారు. వివరాలకు 92464 15150.

కలిమిశ్రీ

'విరిజల్లులు' కార్టూన్ల సంకలనం

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీలలో వచ్చిన కార్టూన్లతో రూపొందించిన 'విరిజల్లులు' కార్టూన్ సంకలనం ఆవిష్కరణ జూలై 20న నెల్లూరు టౌన్ హాల్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త మండలి బుద్ధప్రసాద్. ఇదే సభలో వివిధ రంగాలలో సాహితీ కృషి చేస్తున్న జీవి పూర్ణచంద్, సంధ్యా శర్మ, ఆత్మకూరు రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, వడలి రాధాకృష్ణ, రాయసం దామోదర్‌లను విశాలాక్షి పురస్కారాలతో సత్కరిస్తారు.

ఈతకోట సుబ్బారావు



మళ్లీ కొలువు

అవ్వా! గౌండ్లోల్ల భాగవ్వా!
కాయిపాయి కమ్మగ తింటనని
ఇల్లిడిసి ఊరిడిసి ఎగేసుకొచ్చిన్నని
అలిగి అరుగంచుకు కూసున్నవా!
బతుకు మెతుకు తల్లీ! అతుకు బతుకు

మామా! మాసుల్దారి మైసయ్యా!
కడుపు సలసల మసల్తుందిరా అయ్యా
ఇల్లిడిసి పల్లిడిసి శేనిడిసి శెల్కిడిసి
పిడికెడంటే పిడికెడే మెతుకులురా మామా
వందలు వందలు మందలు మందలు
లొందల బొందల బొందల లొందల
బతుకు బందీల వడ్డది మామా

బావా! నీరటి బాల్‌నర్సూ!
వరి కర్రలకు నీళ్ళు తాపుతున్నవా
వట వట కన్నీళ్ళు వడుపుతున్నవా
కట్ట కొమ్ముకు కూసోని
రాయిని చెర్వు మీద భగభగ మండుతున్నవా
మండకు తండ్రీ! పిండకు నాయినా!
కట్ట మైసమ్మ కన్ను తెరిచే ఉంది

పెద్దవ్వా! లేకి రాజవ్వా!
కల్లం అడుగులు మాయమాయెనని
మనాదిల పడకు పునాదిల పడకు
దిగులు పడకు మొగులు అయితది
లేకి బతుకు లేని మెతుకు
ఫికరు తప్ప ఫకరు కాదు
గోదుమకుంట ముత్యాలమ్మ పెద్ద పెద్ద జంగలతోని
సర్రాసుగ నీ ఇంట్లకే నడిచొస్తున్నది

బాపూ! పాండవ కతోల్ల పరందాములూ!
నీ జీర గొంతు బీరి పోనియ్యకు నాయినా!
పంచ పాండవులు ఏమడుగుతున్నరు?
అయిదూళ్ళడుగుతున్నరా! అయిదు వేళ్ళడుగుతున్నరా!

చిచ్చా! మొల్ల సయ్యదూ!
మర్రి చెట్టెక్కిన దూది పీరి
మల్ల మసీదు ముందట దుంకిందట నిజమేనా!
ఎన్నడు కలువని పాత పీరి కొత్త పీరి
కలిసి సవారీ చేస్తున్నయట నువద్దిగనేనా!
కొంచెమంత ఊదు పొగేసి
నెమలీకల కట్టతోని నెత్తిమీద కొట్టురా అయ్యా!

అల్లుడా! మాదిగ కనుకయ్యా!
'లందల దాగున్న ఎల్లవ్వతల్లి ఏమంటున్నది
బైండ్ల మల్లన్న జమిడిక ఏం పాడుతున్నది
మత్త కొలిపిన మేకపిల్ల ఏమనుకుంటున్నది
సిద్ధులు యోగమడుగుతున్నరా! భోగమడుగుతున్నరా!

బామ్మర్దీ! పసులకాడి బాలయ్యా!
కాళ్ళకు బలపాలు కట్టినవా
కాటగలిసిన కైలిది మూటిల కలిసిందా!
పక్క పక్కలు నడిసే పయ్యెది తొవ్వల వడ్డదా!
పసురాలకు పసరిక కంటెవడ్డదా
కంచెల తోలి పరాకత్‌గ కన్నుమలుపకురా అయ్యా!
బాహుబలులు బలి కోరుతై.

■ మద్దికుంట లక్ష్మణ్
✆ 94416 77373

శతజయంతి ఉత్సవాల సందడేదీ!

తెలుగు మాట వినిపిస్తేనే ఒంటిపై తేళ్ళు పాకినట్లుగా వ్యవహరించిన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ముక్కుసూటిగా "ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని" అని ధిక్కరించినవాడు దాశరథి! "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ చెప్పిన స్థాయిలో– "ఘోర గహనాటడవులన్ వడగొట్టి, మంచి మాగాణములన్ సృజించి, యముకల్ నుసి చేసి, పొలాలు దున్ని, భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణ రైతుదే" అన్నాడు. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ముష్కర నవాబును ఎదిరించిన కవికి ఎన్ని గుండెలు ఉండాలి.

అలాంటి ప్రజాకవి దాశరథి శతజయంతి ఈ నెల 22వ తేదీన జరగనున్నది. హైదరాబాద్ రాజ్యాన్ని పాలించిన కుటిలమైన రాజుపై క్షేత్రంలో నిలబడి, సామాజిక ఆర్థిక అంశాలు ప్రస్తావిస్తూ, జనసామాన్యాన్ని చైతన్యపరుస్తూ, విప్లవాత్మకంగా పోరాటం చేసిన కవులు తెలుగు సాహితీలోకంలో దాశరథి మినహా మరొకరు లేరు. నిజాం రాజు దుష్టపాలనను ఎత్తిచూపుతూ కవితలు చెప్పటం ఏదో ఒక ఎయిర్ కండీషన్డ్ గదిలో కూర్చుని సినిమా పాటలు రాసినంత, కార్యాచరణ చేతగానివారు శ్రీరంగనీతులు బోధించినంత సులభం కాదు.

దాశరథి కవితలోని చరణం – "నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అన్నది తెలంగాణ రాష్ట్ర పోరాటవీరులకు నినాదమైందన్న విషయం విస్మరించరానిది. అది ఏకవాక్యమైనా ప్రత్యేకమైనది, పసందైనది, పండిన కవితకు పరాకాష్ఠ అయింది. కాబట్టి గత ప్రభుత్వం ఆయన స్మృతిని గౌరవించక తప్పలేదు. అయితే ఏటేటా ఆయన స్మారకార్థం ఒక వర్ధమాన కవికి పురస్కారం ప్రదానం చేసినంత మాత్రాన ఆయన టిఆర్ఎస్ పార్టీ చెందినవాడైపోడు! పైగా కేసీఆర్ నిజాంను దేవుడులా కొలిస్తే, దాశరథి నిజాంను 'పిశాచి'గా అభివర్ణిస్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన దేశాభిమాని, ఆత్మాభిమాని మరి.

వాస్తవానికి దాశరథి ఒక జాతీయకవి. కాబట్టే జలగం వెంగళరావు హయాంలో వారిని ఆస్థానకవిగా నియమించి గౌరవించారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్.టి. రామారావు అర్థాంతరంగా ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. అసలు దాశరథి ఎవరో, ఏమిటో ప్రభుత్వాధినేత అర్థం చేసుకుని ఉంటే, ఆయనకు మరొక పదవి కట్టబెట్టి ఆస్థాన కవి పదవి రద్దు చేసేవాడు. ఇలా ఆస్థాన పదవులను నియమించే సంప్రదాయం బ్రిటన్‌లో మూడు వందల సంవత్సరాలుగా కొనసాగుతున్నది. అక్కడ రాజరికం ఉన్నప్పుడూ ఉంది, ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాతా ఉంది. ఆస్థాన కవి పదవి ప్రజాస్వామ్య విరుద్ధమని, రాచమర్యాద అని ఎవరైనా అంటే అంతకన్నా అజ్ఞానం ఉండదు. రెండు వందల సంవత్సరాల పైచిలుకుగా ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో– దాశరథి ఆస్థానకవిగా కొనసాగిన సమయంలోనే– 19 రాష్ట్రాలలో ఆస్థానకవులు ఉన్నారు. సోషలిస్టు దేశాలలో చూస్తే– తజికిస్తాన్ రాష్ట్రానికి మిర్జో తుర్సునజోదా ఆస్థానకవి. ఇలా ఎన్నో ఉదాహరణలను చూపించవచ్చు.

జాతీయ కవి స్థాయికి అర్హత గల కవిత్వం ఎంతో రాశారు దాశరథి. స్వాతంత్ర్య సమరగీతాలు, జయభారతీ అంటూ దేశభక్తి పొంగిపొర్లే పద్యాలు రాసారు. "జండా ఒక్కటె మూడు వన్నెలది; దేశంబొక్కటే భారతాఖండాసేతు హిమాచలోర్వర; కవీట్కాండమ్ములోనన్ రవీంద్రుండొక్కండె కవీంద్రుండు; ఊర్జిత జగద్యుద్ధాలలో



శాంతికోదండోద్యద్విజయుండు గాంధి ఒకడే, తల్లీ! మహాభారతీ!" అని శిలాక్షరాల్లాంటి పద్యాలెన్నో పాడారు. అందుకే ఆ రోజుల్లో విజ్ఞులైన రాజకీయవేత్తలు – సర్వేపల్లి రాధాకృష్ణన్, బూర్గుల రామకృష్ణరావు, పి.వి. నరసింహారావు, బెజవాడ గోపాలరెడ్డి, మర్రి చెన్నారెడ్డి లాంటి వారు మహానుభావులు దాశరథిని ఎంతో అభిమానించారు, గౌరవించారు.

పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో మంత్రులకే కాదు శాసనసభ్యులకు కూడా వారి మాతృభాష పట్ల, సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల అపారమైన అభిమానం. బెంగాలీలు జాతీయకవిగా గౌరవించే రవీంద్రనాథ్ ఠాగూర్‌కు, తమిళులు దేశీ కవిగా నెత్తిన పెట్టుకొనే సుబ్రహ్మణ్యభారతికి, కన్నడిగులు రాష్ట్రకవిగా కొలిచే కె.వి. పుట్టప్పలకు ఏమాత్రం తీసిపోకుండా జగత్ కళ్యాణం కోసం అచంచల విశ్వాసంతో దేశభక్తి గీతాలను, అక్షర లక్షలు చేసే అభ్యుదయ కవితలను, ఏ ఇజాల జోలికి పోకుండా మానవతా దృష్టితో పలికిన వైతాళికుడు దాశరథి. అదేమి విచిత్రమోగాని తెలంగాణ లోని రాజకీయనాయకులకు ఆ పరంపర సంక్రమించలేదు.

దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణలోని ప్రతిజిల్లాలో ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించవలసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతికశాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాహిత్య అకాడమీకి రాష్ట్రమంతా వెతికినా సరైన అధ్యక్షుడు దొరకకపోవడం గమనించదగినది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి కనీసం సాంస్కృతిక సలహాదారు ఒకరు ఉన్నా గుడ్డికన్నా మెల్లలా ఉండేది.

దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణ లోని ప్రతి జిల్లాలో ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించవలసిన తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతిక శాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి.


ఈమధ్యే దక్షిణ భారత దేశంలోనే తొలుదొలుత జానపద సాహిత్యంపై పరిశోధన చేసి విశ్వవిద్యాలయాల్లో జానపద వాఙ్మయ, కళల ప్రవేశానికి ఆద్యుడైన బిరుదురాజు రామరాజు శతజయంతి జరిగింది. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఎంతగానో కృషిచేసిన దివాకర్ల వెంకట అవధాని శతజయంతి జరిగింది. ఇప్పుడు తెలంగాణ మహాకవి దాశరథి శతజయంతి వచ్చింది. శతజయంతి ఉత్సవాలను ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్టు మీనమేషాలు లెక్కిస్తే కేంద్రసాహిత్య అకాడమీ రంగంలోకి దిగడం సంతోషమే. కానీ, వారు ఈ జయంతి ఉత్సవాలను "క్లాస్‌రూమ్" స్థాయి కార్యక్రమాలుగా చేసేసి, చేతులు దులుపుకోవడం తెలుగువారిని ఒకసారి ఆలోచించుకోవడానికి దోహదం చేసింది. ఈ దశ లోనూ మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశూన్యంగా వ్యవహరిస్తున్నది. ఇంతకూ మన కాలం మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు ప్రభుత్వం జరపకుంటే జరగవా?

■ టి. ఉడయవర్లు
98856 86415

"శిల్పం ఎలా ఉన్నా, చదివించే లక్షణం ముఖ్యం!"

– వేమూరి సత్యనారాయణ

వేమూరి సత్యనారాయణ (వేమూరి సత్యం) కథారచయితగా, సినీ రచయితగా ఎన్నదగిన కథలు రాశారు. 'జ్యోతి' మాసపత్రికకు ఎడిటర్‌గా పని చేస్తూ కొన్ని వందల కథలను ఎంపిక చేసి ప్రచురించారు. ఒకప్పుడు ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించిన 'మీరా' నవలా రచయిత్రి సత్యంగారి డిస్కవరీనే! అలాంటి సత్యంగారు ఇటీవల ఒక అరుదైన ఫీట్ చేశారు. తన ఎనభయ్ ఏళ్ళ వయసులో 'ఎనభయ్‌లో ఇరవై' అంటూ మొదటి కథాసంపుటిని ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయనతో చిన్న సంభాషణ!



ఎనభయ్ ఏళ్ళ వయసులో మొదటి కథా సంపుటి! ఎలా ఉంది మీ అనుభూతి?

అనుభూతి ఆశించి పుస్తకం తీసుకురాలేదు. ఒక స్నేహితుడి ఆలోచన, నా శ్రీమతి ప్రోత్సాహంతో యాంత్రికంగానే మొదలుపెట్టి పుస్తకం తెచ్చాను. పుస్తకం వచ్చి మంచి అనుభూతిని మిగిల్చింది. చివరలో నా ఎనభై ఏళ్ళ ప్రయాణం పేరుతో రాసిన ఒక చిన్న వ్యాసం నా జీవితాన్ని క్లుప్తంగా రికార్డ్ చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. పుస్తకం మొదటి పరిచయ కార్యక్రమం కూడా నా 80వ పుట్టినరోజు వేడుకతో కలిపి కుటుంబ సభ్యుల మధ్య సాహితీ మిత్రుల మధ్య జరగడం దాదాపు ఆనందాశ్రువులు తెచ్చేంత అనుభూతినే మిగిల్చింది. ఐ యామ్ హాపీ!

ఈ పుస్తకంలో మొదటి కథను డెబ్బయ్యవ దశకంలో రాశారు. దాన్ని మళ్ళీ యాభయ్ ఏళ్ళ తరువాత 2024లో తిరగ రాశారు? ఈ కాలంలో రచయితగా మీలోను, మీ దృక్పథంలోను వచ్చిన మార్పును కథ తిరగ రాసినప్పుడు కథలో చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డారు. దీని వలన మీరు సాధించిన అదనపు ప్రయోజనం ఏదయినా ఉన్నదా?

ఈ సంపుటి ప్రచురించే క్రమంలో నా మొదటి కథ గురించి ఆలోచించినప్పుడు నేను గ్రహించినది ఏమిటంటే, ఒక అనూహ్య సంఘటన నన్ను స్పందింప చేసి ఆ కథగా ఎవాల్వ్ అయింది అని. ఆ కథను రాసినప్పటి ప్రతి ఇప్పుడు లేకపోయినా నాకు స్పష్టంగా గుర్తుండటం వలన తిరగ రాయగలిగాను. ఆ కథ ఎలా వుండి ఉంటుందో జ్ఞాపకం చేసుకుని రాసాను. ఇలా ఎందుకు రాసాను అంటే అప్పటి నా స్పందనను, సంఘర్షణను శాశ్వతం చేసుకోవడానికే. బహుశా మొదటగా రాసి జాగ్రత్త పరచని ఆ కథ ఇప్పటి కథకి దగ్గర గానే ఉంటుంది అనుకుంటున్నాను. ఎందుకంటే నా స్వభావంలో ఎలాంటి మార్పు లేదు గనుక.

మీ కథలు కొన్ని ఓపెన్ ఎండెడ్‌గా ఉంటాయి. అలా ఉంచడం వలన పాఠకుడు తనకు కావలసిన ముగింపు ఏదో తాను వెతుక్కునే సౌలభ్యం ఉంటుంది. కానీ అలా ఓపెన్ ఎండెడ్‌గా వదిలేయడం రచయిత బలహీనత కాదా? తానేం చెప్పదలచుకున్నాడో అది స్పష్టంగా కథలో చెప్పాలి కదా?

ఓపెన్ ఎండెడ్‌గా ఉంచడం ఉంచకపోవడం అనేది ఒక కథ ముగింపుకి రచయిత ఎన్నుకునే వ్యూహం మీద ఆధారపడి ఉంటుంది. ఓపెన్ ఎండెడ్‌గా ఉంచకుండా రచయిత ముగింపు చెప్పినా ఆ ముగింపు నచ్చకపోతే పాఠకుడు తనకు నచ్చిన ముగింపు తాను రాసుకుంటాడు. మరెందుకు అలా ఓపెన్ ఎండెడ్‌గా ఉంచడం అంటే అది రచయిత నిర్ణయం.

మీరు కథ రాసే పద్ధతి?

కథకి సంబంధించిన ఆలోచన అనే మొలక మనసులో పడ్డాక నెమ్మది నెమ్మదిగా ఆకులు తొడుగుతూ, రెమ్మలుగా పెరుగుతూ వస్తుంది వస్తువు. అయితే నాకున్న ఒక ప్రత్యేకమైన అలవాటు వలన, అనుకున్న కథని రాయడానికి ముందే స్నేహితులకి, ఇంట్లో సభ్యులకి కథగా చెప్తాను. ఇలా ఒక నేరేషన్ నుంచి మరొక నేరేషన్ లోకి ప్రయాణించడంలో వాక్యాలు అలవోకగా వచ్చి చేరతాయి, పాత్రలు పుడతాయి, వస్తువు చివరకు ఒక కథగా ఎవాల్వ్ అవుతుంది. అలా ఎవాల్వ్ అయిన కథని రాసి పక్కన పడేసి మరో వారం తరువాత తీరికగా చదువుకుంటాను. లోపాలు సరి చేసుకుంటాను. ఆ తరువాత ఒకరికో ఇద్దరికో చూపించి అభిప్రాయం తీసుకుని మళ్ళీ తిరగ రాస్తాను. మూడోసారి రాసే వెర్షన్ ఫైనల్ కథగా పాఠకుడి ముందుకు వస్తుంది




కథలు సరే, నవల రాసే ఉద్దేశం ఉందా?

అంతకుముందు లేదు. ఇప్పుడు వుంది. యెస్! నా జీవితం, నా అనుభవాలు, నా పోరాటాలు, నా ఆనందాలు, దుఃఖాలు, వీటితో పాటుగా నా జీవితం లోని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులు, అందరినీ తలచుకుని, ఆ బంధాల మధ్య ఉన్న ఆరోహణా అవరోహణలు అన్నీ గుదిగుచ్చి ఒక నవలగా తేవచ్చేమో! కొంత వాస్తవమూ, కొంత కల్పనా కలిపి నవల రాయగలనేమో! చూడాలి.

ఈ తరానికి మీరిచ్చే సలహా?

ప్రత్యేకంగా ఏమీ లేదు. రాయాలనుకున్నపుడు రాయండి. రాసిన వాటి గురించి మిత్రుల తోనూ, మీ ముందుతరం రచయితలతోనూ చర్చించండి. శిల్పం ఎలా ఉన్నా కథకి చదివించే లక్షణం ముఖ్యం అని నేను నమ్మి చెపుతున్నాను. అలా కాకుండా మరోలా రాసి మెప్పించగల ప్రతిభ మీలో ఉంటే రాయండి. అంతా మీ ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది. ఎంత రాసినా, ఎలా రాసినా చదవడం మాత్రం ఆపొద్దు. నిరంతర పఠనం మిమ్మల్ని పుటం పెడుతుంది.

ఇంటర్వ్యూ ■ వంశీకృష్ణ



మంచు కరుగుతున్నపుడు...

విగత కాంతి స్ఫురణలా
పాత పరిచయమొకటి

ఉండుండి వీచే
వెక్కిళ్ళ, నిట్టూర్పుల గాలి

కాకి ఎంగిలిగా పంచుకున్న
కొన్ని ఇష్ట క్షణాల రుచి

శీతల శ్యామవర్ణపు జర
దేహానికి కొత్తశత్రువు

మేఘమల్హారానికి అశ్రువృష్టి
ఇదో నిస్తంత్రీ సంవాదం

సవరణల సంక్లిష్ట జీవితం,
వాకిలి అంచున బేలగా


చపల చెమరింతతో
ఉప్పు పట్టిన వాక్యమొకటి

■ మల్లారెడ్డి మురళీమోహన్
✆ 88611 84899

కల్లోల దశాబ్దపు కవిత్వ కలల మేఘం

నా మొదటి పుస్తకం

నారాయణస్వామి వెంకటయోగి




1991 సంవత్సరం అక్టోబర్‌లో, ఒక సాయంత్రం ఖైరతాబాద్ ద్వారకా హోటల్‌లో కలిసినప్పుడు శివారెడ్డి గారు "స్వామీ మొత్తం ఎన్ని పోయెమ్స్ ఉంటాయి?" అని అడిగారు. "వందకు పైనే ఉండొచ్చు సర్. కానీ అన్నీ ఒక చోట లేవు" అని నసిగాను. "ఇప్పటి దాకా నువ్వు రాసినవన్నీ ఒక చోట చేర్చి వాటిలో నీకు నచ్చిన యాభై పోయెమ్స్ తీసుకురా. పదేళ్లు కావస్తోంది. ఇక పుస్తకం రావాల్సిందే" అన్నారు. వెతికితే కొన్ని డైరీలో, కొన్ని అప్పటికే విద్య అందంగా తెలుగులో టైప్ చేసి ఇచ్చిన కాగితాల్లో, కొన్ని అజాగ్రత్తగా 'భద్రపరిచిన' చిత్తు కాగితాల్లో దొరికాయి. అట్లా చాలా వరకు సంపాదించి శివారెడ్డి గారి దగ్గరికి తీసికెళ్లాను. వాటిని వడపోసి నలభై దాకా ఎంపిక చేసి "ఇది బ్రహ్మాండమైన సంపుటి అవుతుంది స్వామీ," అన్నారు ఉత్సాహంగా.

అప్పటికే విరసంలో చురుకైన సభ్యునిగా, కార్యవర్గంలో ఉన్నాను. ఈ పుస్తకాన్ని విరసం సిటీ యూనిట్ ప్రచురణగా తెద్దామని నిర్ణయించుకున్నాను. కరీంనగర్ రైతాంగ పోరాటాలపై నిర్బంధం గురించి రాసిన 'కల్లోల కలల మేఘం' కవిత శీర్షికను సంపుటికి పేరుగా బాగుంటుందనీ, శివారెడ్డి, వరవరరావు గార్లతో ముందుమాట రాయించాలనీ అనుకున్నాను. మిత్రులు విమల, సుధాకిరణ్, సురేష్‌లు కూడా ఏకీభవించి తోడు నిలిచారు. నన్నూ, నా కవిత్వాన్నీ 1983 నుంచి దగ్గరగా చూస్తున్న అప్పలు రమా మెల్కోటే మేడమ్ "కవర్ మీద కె. లక్ష్మాగౌడ్ గారితో బొమ్మ వేయిస్తే బాగుంటుంది," అన్నారు. బెరుకు బెరుగ్గా లక్ష్మాగౌడ్ గారి దగ్గరికి కవిత్వం తీసుకుని వెళ్లాను. ఆయన ఆప్యాయంగా పలకరించి, కవిత్వం మొత్తం చదివినంక, వారం రోజులకు ఒక అద్భుతమైన రేఖాచిత్రాన్ని గీసిచ్చారు. నా ఆనందానికి అవధుల్లేవు. లక్ష్మా గౌడ్ గారికి బోలెడన్ని ధన్యవాదాలు చెప్పుకుని, సరాసరి శీలా వీర్రాజు గారి దగ్గరికి వెళ్లాను. ఆయన అద్భుతంగా కవర్ డిజైన్ చేశారు. తన అక్షరాలు కాకుండా కంప్యూటర్ ఫాంటే బాగుంటుందని తానే సూచించిన ఉదాత్త స్వభావుడు శీలావీ గారు.

వరవరరావు సర్, శివారెడ్డి గారు ముందుమాటలు ఇవ్వగానే పుస్తకం ప్రెస్ కాపీ సిద్ధమైంది. లక్ష్మాగౌడ్ గారి బొమ్మ చూసాక రాసిన మరో కవిత కూడా చేరింది. మిత్రుడు శేఖర్ కంపోజ్ చేసి, నాని ప్రింటర్స్ గాంధీనగర్‌లో పుస్తకం ప్రింట్ చేయించాడు. కవర్‌ని నలుపు తెలుపుల్లో (అక్షరాలు జేగురు రంగులో) ప్రగతి ప్రింటర్స్ హనుమంతరావు ప్రేమతో అందంగా ముద్రించి ఇచ్చారు. కవర్ వెనుక అట్ట మీద కొత్తగా రాసిన కవితను వేశాను. అది నా కవిత్వానికి మేనిఫెస్టో లాంటి కవిత. నాకు జీవితాన్నిచ్చి అర్థాంతరంగా వెళ్ళిపోయిన బాపుకు, నా కవిత్వానికి చూపునిచ్చిన విప్లవోద్యమం కోసం అమరులైన కృష్ణారెడ్డి, కవి నూతన్‌లకూ అంకితం ఇచ్చాను.

చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగిన ఆవిష్కరణలో శివారెడ్డి ఆవిష్కర్త. విరసం సభ్యులు రామ్మోహన్ సర్, విమల, జనసాహితి కొత్తపల్లి రవిబాబు వక్తలు. విప్లవ కవిత్వం నినాదప్రాయమని, మూస పద్ధతిలో విప్లవం గురించి రాయడం తప్ప శిల్పం గురించి, జీవితంలోని భిన్న పార్శ్వాలను, పట్టించుకోలేదనే అపవాదు బలంగా ప్రచారంలో ఉండేది. ఆ అపవాదుని, 1990ల్లో వచ్చిన విప్లవ కవిత్వంలో భాగంగా 'కల్లోల కలల మేఘం' కొంతైనా పూర్వపక్షం చేసిందనే అనుకుంటాను. విప్లవోద్యమంతో మమేకమై, విరసం సభ్యునిగా కవిత్వం రాస్తున్నప్పుడు నిబద్ధత, నిమగ్నత ఉండడం సహజం. అవసరం కూడా. అది ఒక ప్రాపంచిక దృక్పథంగా మలుచుకుని అనుభవాలను, మానవ సంబంధాలను, వైరుధ్యాలను కవిత్వీకరించడం వల్ల 'కల్లోల కలల మేఘం' బలమైన సంకలనంగా వచ్చింది. ఒక దశాబ్ద కాలం తెలుగు సమాజపు చరిత్రను సమర్థవంతంగా రికార్డ్ చేసింది.



'అరుణతార'లో ఎన్. వేణుగోపాల్, నా కవిత్వంలోని బలాన్నీ బలహీనతలనూ చాలా ప్రేమతో అయినా, ఆబ్జెక్టివ్‌గా అద్భుతంగా సమీక్షించాడు. హరనాథ్ అనే ఒకాయన మాత్రం, 'విశాలాంధ్ర'లో సమీక్ష చేస్తూ శివారెడ్డి మీద, దేవిప్రియ మీద ఉన్న అక్కసునంతా నా కవిత్వం మీద వెళ్లగక్కాడు. అయితే దానికి జవాబుగా 'నారాయణస్వామి కవిత్వం పావు కాదు పావురమే' అని అఫ్సర్ దీటైన జవాబు ఇచ్చాడు. నా 'వానొస్తద' కవిత్వ సంపుటి వచ్చేంతవరకు 'కల్లోల కలల మేఘం' నాకు ఇంటి పేరులా మారిపోయింది.

ఒక ఆదివారం ఉదయాన్నే శీలా వీర్రాజు, నాళేశ్వరం శంకరం వచ్చి 'కల్లోల కలల మేఘం'కు 1994 ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు ఇవ్వాలనుకున్నాం అని చెప్పారు. ఎటువంటి ప్రలోభాలు కానీ రాజ్య సంబంధాలు కానీ లేకుండా, కవిత్వం మీద అవ్యాజ్యమైన ప్రేమతో ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన ఫ్రీ వర్స్ ఫ్రంట్ అవార్డు నాకు రావడం గొప్ప విషయంగా భావించాను. ఈ విషయాన్ని విరసం సిటీ యూనిట్‌లో చర్చకు పెట్టాను. భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చివరికి తీసుకోవడం సరైందే అని నిర్ణయమయ్యాక, వీర్రాజు గారికి ఆ విషయం తెలియ జేసాక అవార్డు ప్రకటించారు. 'కల్లోల కలల మేఘం' కవిగా నా సాహిత్య ప్రయాణంలో ఒక గొప్ప మైలు రాయిగా భావిస్తాను. ఆదరించిన తెలుగు సాహిత్య లోకానికి ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను. ■



సినీ మేరు పర్వతం కరిగిపోయింది. విలక్షణ నటనా నిధి నింగికెగసింది. వైవిధ్యభరిత హావభావాలు.. విసూత్న మేనరిజానికి ప్రతిబింబంగా నిలిచిన 83 ఏళ్ల మహానటుడు ఇక సెలవంటూ అస్తమించారు. తెలుగు సినీ సౌరభాలను తనదైనశైలిలో పండించి, పాత్రకు ప్రాణం పోసిన సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు హైదరాబాద్‌లో కన్నుమూయడంతో అటు సినీలోకంతో పాటు ఇటు కృష్ణాతీరం కూడా కంటతడి పెట్టింది. మహానటులు ఎస్వీ రంగారావు, కైకాల సత్యనారాయణ సరసన చేరి, అంతటి విలక్షణ పాత్రలతో చెరగని ముద్ర వేసిన అనుబంధాల 'కోట' మన కృష్ణాజిల్లాకు చెందినవారు కావడం విశేషం. 1943లో కంకిపాడులో జన్మించిన ఆయన కాలక్రమంలో సినీరంగంలో ప్రవేశించారు. దాదాపు 750 చిత్రాల్లో నటించిన కోట 2015లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 1999 నుంచి 2004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలందించారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే, నాటి ఎంపీ గద్దె రామ్మోహన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కళ్లు రెండూ పెద్దవి చేసి విలనిజం పండించినా.. చిలిపిగా చూస్తూ కామెడీని రక్తి కట్టించినా.. తండ్రిగా ఒదిగినా.. భర్తగా హింసించినా.. తాగుబోతుగా తూలినా.. సహోదరుడిగా ఏడ్పించినా.. ఆయన హావభావాలు ఎప్పటికీ మన మదిలో మెదులుతూనే ఉంటాయి. మనిషి మాయమైతేనేం.. చెదరని ఎన్నో పాత్రలు ఆయన్ను మనకు మననం చేస్తూనే ఉంటాయి.

- కథనాలు 6లో

అనుబంధాల కోట

సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు స్వస్థలం కంకిపాడు



18 ఏళ్ల కిందట తిరువూరులో కోటకు సత్కారం (ఫైల్)

- డాక్టర్ కాబోయి యాక్టర్‌గా సినీరంగంలోకి
- 750 చిత్రాల్లో నటించిన విలక్షణ నటుడు
- 2015లో పద్మశ్రీ అవార్డు
- 1999-2004లో విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలు
- సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, బీఆర్‌టీఎస్ రోడ్డు పూర్తి చేయించారు
- ఆ తర్వాత రాజకీయాలకు తాను సరిపోనంటూ గుడ్‌బై
- ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో సత్సంబంధాలు

హైటెన్షన్



పేర్ని నాని ఇంటి వద్ద పోలీసులు

మచిలీపట్నం, పెడనలో ఉద్రిక్తత



పేర్ని ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు

గుడివాడ ఘటన నేపథ్యంలో పెడన వెళ్లవద్దన్న పోలీసులు

- పోలీసుల మాటలు లెక్క చేయకుండా వెళ్లి రెచ్చగొట్టే ప్రసంగాలు
- చంద్రబాబు నుంచి కొల్లు రవీంద్ర వరకూ ఇష్టానుసారం వ్యాఖ్యలు

బందరులో రాజకీయం వేడెక్కుతోంది. వైసీపీ 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' పేరుతో నిర్వహిస్తున్న సమావేశాల్లో పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాజకీయ దుమారం మొదలైంది. పామర్రులో చేసిన నరుకుడు భాషను మించి పెడనలో రెచ్చిపోయారు. 'నేను చెబితే పట్టపగలే చేయాలని చెబుతానంటూ' వీరవీగారు. శనివారం గుడివాడలో జరిగిన ఘటనలతో పామర్రు వెళ్లవద్దన్న పోలీసుల హెచ్చరికలను పెడచెవినపెట్టి టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి పవన్ కల్యాణ్, లోకేష్, మంత్రి కొల్లు రవీంద్రలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వైసీపీ నియోజకవర్గ సమావేశాల్లో మాజీ మంత్రి పేర్ని నాని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా చేసిన వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారం రేపాయి. అధికార, ప్రతిపక్షాలు విమర్శలతో హోరెత్తిస్తు న్నాయి. ఆదివారం పెడన నియోజకవర్గ వైసీపీ సమావేశం నేపథ్యంలో పెడన పట్టణంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు. మచిలీపట్నంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులను రప్పించి ఎక్కడికక్కడ పహారా పెట్టారు.

- గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను అడ్డగించి, ఆమె కారు అద్దాలను పగులకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఎస్పీ గంగాధరరావును కలిసి వినతిపత్రం అందించారు.

పేర్ని ఇంటి వద్ద ఉద్రిక్తత

వైసీపీ సమావేశాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి పేర్ని నానిపై పలు పోలీస్ స్టేషన్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదులు చేయడంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేస్తారనే ప్రచారం ఆదివారం విస్తృతంగా జరిగింది. ఈ క్రమంలో శనివారం గుడివాడలో బీసీ మహిళా అయిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేశారని, ఈ అంశాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలని పేర్ని నాని ఫోన్‌లో మాట్లాడుతున్న వీడియో వైరల్ అయ్యింది. దీంతో ఈ అంశంపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఏఎస్పీ సత్యనారాయణ, బందరు డీఎస్పీ సీహెచ్ రాజా, పలువురు సీఐలు, ప్రత్యేక పోలీస్ బలగాలతో పేర్నినాని ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో పేర్నిని అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. దీంతో వైసీపీ శ్రేణులు పేర్ని ఇంటి వద్దకు చేరుకున్నారు. పెడన నియోజకవర్గంలో జరిగే వైసీపీ సమావేశానికి వెళ్ల వద్దని, పరిస్థితులు అదుపుతప్పేలా ఉన్నాయని, తమకు సహకరించాలని పోలీసులు పేర్ని నానికి వివరించారు. అయినప్పటికీ తాను పెడనలో జరిగే కార్యక్రమానికి వెళతానని చెప్పిన ఆయన, అన్నట్టుగానే పెడనలో జరిగిన వైసీపీ సమావేశానికి హాజరయ్యారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్ని ఇంటికి వచ్చి మంతనాలు జరిపారు. మిగతా 6లో..

అవినీతి.. అరాచకాలు

వైసీపీ నేత ఉప్పాల రాము తీరిది

- జెడ్పీ అనధికారిక చైర్మన్‌గా అక్రమాలు
- అధికారులు, ఉద్యోగులపై తీవ్ర వేధింపులు
- సొంత అవసరాలకు జెడ్పీ కార్లు వినియోగం
- హైదరాబాద్-బందరుకు మద్యం తరలింపు
- గుడివాడలో టీడీపీ శ్రేణులను దూషించడంతో మళ్లీ వార్తల్లోకి..

- కథనం 6లో



మాయల మంగ

అలియాస్ అనూష



- ఎన్టీఆర్ కాలనీ హత్య కేసులో నిందితురాలి లీలలు
- ఇప్పటి వరకు మూడు పెళ్లిళ్లు చేసుకున్న కిలాడీ
- కేర్‌టేకర్ కోసం క్వికర్ యాప్‌లో సంప్రదించిన రిటైర్డ్ ఏఈ
- విధుల్లో చేరిన పది రోజులకే యజమాని దారుణ హత్య

ఒకరికి తెలియకుండా మరొకరితో సంబంధం సాగిస్తుంది. ఒకరిని పెళ్లి చేసుకున్నాక ఎంతో కొంత లాగేసి గుడ్‌బై చెప్పేస్తుంది. ఇలా ఒక్కొక్కరితో పరిచయాలు పెంచుకుని భార్యగా చెలామణీ కావడానికి రకరకాల యాప్‌లను ఉపయోగిస్తుంది. ఎన్టీఆర్ కాలనీ రెండో రోడ్డులో ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఇంజనీర్ రామారావు హత్య కేసులో ప్రధాన నిందితురాలు పల్లపు మంగ అలియాస్ అనూష చేసిన మాయలు ఇవన్నీ. ఆమెతో పాటు సహజీవనం చేస్తున్న వేమిరెడ్డి ఉపేందర్‌రెడ్డిని పోలీసులు శ్రీకాళహస్తిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇద్దరినీ ఆదివారం ఉదయం నగరానికి తీసుకొచ్చారు. మాచవరం పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు విచారిస్తున్నారు. ఈ విచారణలో అనూష గురించి కీలక విషయాలు బయటపడ్డాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎన్టీఆర్ కాలనీ రెండో రోడ్డులో ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఇంజనీర్ రామారావు హత్య కేసులో ప్రధాన నిందితురాలు పల్లపు మంగ అలియాస్ అనూష ఒకరికి తెలియకుండా మరొకరిని.. ఇలా మూడు మిగతా 6లో..





●కిటకిట

ఆషాఢ మాసోత్సవాలు, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిక్కిరిసిపోగా, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విజయవాడ నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖరబాబు ఆదివారం అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. 6





●కళకళ

జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బెరంపార్కులో డ్రాయింగ్, ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు జరిగాయి. కలెక్టర్ లక్ష్మీశ కుటుంబం, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కూడా ఈ పోటీల్లో పాల్గొని పెయింటింగ్ వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. 6

సంస్కరణల సురక్ష



- సీపీ ఏడాది పాలనలో మారిన రూపురేఖలు
- జిల్లాలో 6 వేల సీసీ కెమెరాల ఏర్పాటు
- అస్త్రం ఏఐ టూల్‌తో ట్రాఫిక్ క్లియరెన్స్
- డ్రోన్లతో ప్రతి అంశానికి సత్వర పరిష్కారం

'సురక్ష'గా ప్రారంభమైన ఓ కార్యక్రమం 'సురక్ష 360 డిగ్రీలు'గా మారింది. దీని అనుబంధంగా 'సురక్ష డివైస్' రూపొందింది. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఉంటున్న వారికి ఇది రక్షగా మారింది. అస్త్రం అనే ఏఐ టూల్ ట్రాఫిక్ చిక్కుముడులను విప్పింది. కీలకమైన సమయాల్లో డ్రోన్ పోలీసింగ్ అండగా నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆలోచనల నుంచి ఈ ప్రాజెక్టులు పుట్టుకొచ్చాయి. ఆయన బాధ్యతలు చేపట్టి సోమవారం నాటికి ఏడాది పూర్తికాగా, సరికొత్త టెక్నాలజీతో తీసుకొచ్చిన సంస్కరణలు నేరాల అదుపులో కీలకంగా మారుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సాంకేతిక పరిజ్ఞానాన్ని కేసులకు జోడించి, వాటిని తేలిగ్గా పరిష్కరించడంలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ముందు వరుసలో ఉంది. జిల్లాలోని ప్రాంతాలు నిఘా నేత్రాల్లో ఉండాలని సురక్ష 360 డిగ్రీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా సురక్ష కమిటీలను ఏర్పాటు చేసి కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఉంటున్న వారికి భద్రతపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. దాతలను సంప్రదించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే వారికి ఒక సీసీ కెమెరాను ఉచితంగా ఇచ్చారు. ఈ ప్రయత్నాల ఫలితంగా జిల్లాలో ఇప్పటి వరకు 6 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిన్నింటినీ అనుసంధానం చేయడానికి బందరు రోడ్డులో ఉన్న ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆధునికీకరించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలను ఇక్కడి నుంచి పరిశీలించేలా ముస్తాబు చేశారు. ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారికి సంకెళ్లు వేస్తున్నారు.

డ్రోన్ల నిఘా

రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ పోలీసింగ్ ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో ప్రారంభమైంది. గత సెప్టెంబరులో విజయవాడను బుడమేరు వరదలు ముంచేసినప్పుడు పోలీసులు డ్రోన్‌ను ఉపయోగించారు. దసరా ఉత్సవాల్లోనూ భక్తుల రాకను గుర్తించడానికి డ్రోన్లకు పని చెప్పారు. తర్వాత దాతల ద్వారా డ్రోన్లు సేకరించి కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లకు ఒక్కో డ్రోన్‌ను అందజేశారు. ట్రాఫిక్ చిక్కుముడులను విప్పడానికి అస్త్రం అనే ఏఐ టూల్‌ను తీసుకొచ్చారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్ ఆగిపోయిందో అలెర్ట్ రాగానే, అక్కడికి డ్రోన్‌ను పంపి పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

క్వారీలపై విజిలెన్స్

- రెండు రోజులుగా జగ్గయ్యపేటలో మెరుపు దాడులు
- సంతలో జరుగుతున్న అక్రమాలపై వివరాల సేకరణ
- ప్రభుత్వ ఖజానాకు జమ కావాల్సిన నిధులు పక్కదారి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు వాటాలు
- అక్రమ క్వారీలపై దాడులు.. సర్దుకుంటున్న అక్రమార్కులు

జగ్గయ్యపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో రెండు రోజులుగా విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో జగ్గయ్యపేట మండలంలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు జమ కావాల్సిన నిధులను అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, ఆయా శాఖాధికారులకు అందుతున్నట్లు తెలిసింది. వేదాద్రి, జయంతి, తక్కెళ్లపాడు గ్రామాల పరిధిలోని అనధికారిక గ్రావెల్ క్వారీలను కూడా అధికారులు పరిశీలించారు. చిల్లకల్లులోని జగ్గయ్యపేట మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ప్రతి శనివారం వారాంతపు సంత జరుగుతుండగా, దీనిద్వారా ప్రభుత్వానికి జమ చేయాల్సిన నిధుల్లో సింహభాగం అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నట్లు మిగతా 6లో..



● కిరణాభిషేకం

వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సమీపంలో, కృష్ణానదిలో ఉన్న సాలగ్రామ నరసింహస్వామిని ఆదివారం సూర్యకిరణాలు అభిషేకించాయి. సువర్ణ కాంతితో వెదజల్లిన కిరణాలు స్వామిని మరింత దేదీప్యమానం చేయగా, ఒడ్డున ఉండి తిలకించిన భక్తులు పరమానందభరితులై పూజలు చేశారు. - జగ్గయ్యపేట రూరల్

అయ్యో బాల్యం

- నగరంలో పెరుగుతున్న బెగ్గింగ్ మాఫియా
- భిక్షాటన ముసుగులో చీకటి వ్యాపారం
- నగరంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ దాడులు
- ఇద్దరు చిన్నారులను ఓపెన్ షెల్టర్‌కు తరలింపు



దాడుల్లో పట్టుబడిన చిన్నారులు, యాచకురాళ్లు

గుణదల/కృష్ణలంక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ కేంద్రంగా బెగ్గింగ్ మాఫియా పెచ్చుమీరుతోంది. ధనాపేక్షతో కొందరు తల్లిదండ్రులని చెప్పుకొనేవారు, దళారులు బాల్యాన్ని చిదిమేస్తూ చిన్నారుల భవిష్యత్తును ప్రశ్నార్థకం మిగతా 6లో..

మహారాజశ్రీ కోర్టు-1 ప్రిన్సిపల్ సివిల్ జడ్జీ (సీనియర్ డివిజన్) వారి నాయస్థానము గాజువాక

S.O.P. No.1/2025

1. వెలగా యమున
2. వెలగా మౌనిశ్వర్
3. వెలగా సుస్మిత వాదులు.

మరియు

డివిజనల్ రైల్వే మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వేస్, వర్క్స్ బ్రాంచ్, విజయవాడ. ప్రతివాది.

SUMMONS/నోటీసు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన వాదులు తమను వారసులుగా డిక్లేర్ చేయమని కోరుచూ (SUCCESSION CERTIFICATE) పొందుటకు గాను రెస్పాండెంట్ వారిపై కేసు దాఖలు చేసినారు. ఇందున వాయిదా తేది.31-07-2025 రెస్పాండెంట్ కొరకు శ్రీ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. ఇందు నిమిత్తం మీరు స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై ఏ విధమైన ఆక్షేపణలు గాని అభ్యంతరములు ఉన్న యెడల తేది 31-07-2025 దీన ఉ॥గ॥10.30ని॥లకు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి దగ్గర హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు సమాచారం లేదని భావించి పరోక్షంగా తీర్మానం చేయబడును.

By Order
గాజువాక
తేది.

P.G.BHAVANI
K.PADMA
ADVOCATE
D.No. 22-1-87, Tummalapallivari Veedhi, Panja Jn., Visakhapatnam



ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు

» దుర్గమ్మను లక్ష మంది దర్శించుకున్నారని అంచనా

» మధ్యాహ్నం సమయానికే 50 వేల మందికి పైగా రాక

ఇంద్రకీలాద్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాస సారె సమర్పణలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం కావటంతో వేకువజాము నుంచే భక్తులు సారె సమర్పించుకోవటానికి భక్తులు సమూహాలుగా తరలి వచ్చారు. ఈవో శీనానాయక్ భక్తులకు సౌకర్యాల పట్ల పర్యవేక్షణ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. టిక్కెట్ దర్శనాలన్నింటినీ రద్దు చేసి, అన్ని లైన్లను ఉచిత దర్శనం కోసం వీలు కల్పించారు. వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఉచిత ప్రసాద పంపిణీ, అన్నప్రసాద వితరణ కొనసాగాయి. ఎండ ఎక్కువగా ఉండటంతో ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో షామియానాలు ఏర్పాటు చేయించారు.

కనకదుర్గమ్మకు పోలీసు శాఖ ఆషాఢ సారె

విజయవాడ నగర పోలీసు శాఖ తరఫున కనకదుర్గమ్మకు ఆషాఢ మాస సారె సమర్పించారు. డప్పులు, వేషధారణలు, పోలీసు సిబ్బంది కోలాహలం మధ్య ఊరేగింపుగా ఘాట్ రోడ్డుమీదుగా అమ్మవారి ఆలయానికి నగరపోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు, పోలీసు అధికారులు వెంట రాగా అమ్మవారికి సారె సమర్పించారు.

ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ అవశ్యకత

గాంధీనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఫోటో జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న భౌతిక దాడులపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ ఆవశ్యకత అని ఉద్ఘాటించారు. యూనియన్ అనుబంధ ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) సర్వసభ్య సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి కంచల జయరాజ్, మాజీ ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్‌లు మాట్లాడారు. ఏపీపీజేఏకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఫోటో జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏపీపీజేఏ గౌరవాధ్యక్షుడిగా జీవీ నారాయణ, అధ్యక్షుడిగా సీహెచ్.వీఎస్ విజయభాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రూబెన్ బెసాలియల్, ప్రధానకార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా సీహెచ్ నారాయణరావు తదితరులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

హైటెన్షన్

(5వ పేజీ తరువాయి)

హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు : ఎమ్మెల్యే కాగిత

మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. జగన్ కళ్లలో ఆనందం చూడాలనే ఆకాంక్షతో పేర్ని నాని ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

నేను చెబితే పట్టపగలే చేసేయాలని చెబుతా : పేర్ని నాని

పెడనలో జరిగిన వైసీపీ సమావేశంలో పేర్ని నాని మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చీకట్లో ఎవరినీ చంపేయాలని తాను చెప్పలేదని, చెబితే మాత్రం పట్టపగలే చేయాలని చెబుతానని అన్నారు. ఎవరిపై విమర్శలు చేయని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను ఇబ్బంది పెట్టారని, ఆమె కళ్ల నుంచి వచ్చిన ప్రతి కన్నీటి బొట్టు మీకు శాపంగా మారుతుందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర బందరులో స్థలాలు ఆక్రమించుకుని పెద్ద భవంతిని నిర్మిస్తున్నారని, మద్యం దుకాణాల నుంచి, ఇసుక రేవుల నుంచి వచ్చే ముడుపులు తింటున్నారని విమర్శించారు. బందరు కోటలో తొమ్మిది ఎకరాలు ఆక్రమించుకుని ఐస్ ఫ్యాక్టరీ కడుతున్నారని ఆరోపించారు. కృత్తివెన్నులో 45 ఎకరాల భూమిని ఆక్రమించేశారని విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ మహిళను అయిన తనను గుడివాడలో టీడీపీ కార్యకర్తలు అవమానించినా, తనపై దాడి చేసినా హోంమంత్రి ఇంత వరకు స్పందించలేదన్నారు.

టీడీపీ శ్రేణులపై కేసు నమోదు

గుడివాడ: గుడివాడలో వైసీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న తనను స్థానిక నాగవరప్పాడు సెంటర్‌లో టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డగించి, అసభ్యపదజాలంతో దూషించారంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 126(2), 292, 324(4), 351(2) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

అయ్యో బాల్యం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ప్రభుత్వం.. శిశు సంరక్షణ చట్టాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పనితీరులో లోపాలు బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. తాజాగా బెగ్గింగ్ మాఫియా ఆగడాలపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా శిశు సంరక్షణ శాఖ అధికారి రాజేశ్వరరావు ఆదేశాలతో, మాచవరం పోలీసుల సహకారంతో, సోషల్ వర్కర్ లత నేతృత్వంలో పీబీ సిద్ధార్థ కళాశాల సమీపంలో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న పలువురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కొందరు పరారు కాగా, ఇద్దరిని మాత్రం కృష్ణలంకలోని 'ప్రజ్వల' ఓపెన్ షెల్టర్‌కు తరలించారు. వారి తల్లులుగా చెప్పుకొంటున్న యాచకురాళ్లను ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలిచ్చారు. ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారు. తల్లిదండ్రుల దగ్గర నుంచి తీసుకొస్తే వారి వివరాలు ఇవ్వాలని, మధ్యలో ఏజెన్సీలు ఉంటే వారి గురించి చెప్పాలని అడిగినా వారు నోరు విప్పలేదు. తల్లిదండ్రులు వచ్చే వరకు పిల్లలు తమ సంరక్షణలోనే ఉంటారని చెప్పిన అధికారులు యాచకురాళ్లను కూడా అదుపులోకి తీసుకున్నారు.

చట్టప్రకారం చర్యలు : లత, సోషల్ వర్కర్

ఇద్దరు పిల్లలను ప్రజ్వల ఓపెన్ షెల్టర్‌కు తరలించాం. సోమవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట పిల్లలను, వారి తల్లులుగా చెబుతున్న వారిని హాజరుపరుస్తాం. కమిటీ వారు సదరు పిల్లలు, వారి తలిదండ్రులుగా చెప్పుకొనే వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి బాలల న్యాయ సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు.

క్వారీలపై విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. సంత పరిశీలనకు వెళ్లిన విజిలెన్స్ అధికారులు వీడియోలు తీస్తుంటే ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించారని సమాచారం. ప్రతి శనివారం రూ.లక్ష వరకు ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మార్కెట్ యార్డు సెక్రటరీ నరసింహారావును వివరణ కోరగా, విజిలెన్స్ అధికారులు వచ్చి రశీదు పుస్తకాలు తనిఖీ చేశారని, వాటితో పాటు రశీదులు తీసుకెళ్లారని, అన్ని సక్రమంగానే ఉన్నాయన్నారు.

సర్దుకున్న అక్రమార్కులు

మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న క్వారీల్లో వేద్రాద్రి, జయంతిపురం, తక్కెళ్లపాడు గ్రామాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఇటీవల పల్లగిరిలో ప్రమాదం జరగటంతో అక్రమార్కులు మూడు రోజులుగా తవ్వకాలు నిలిపివేసినట్లు గుర్తించారు. రామచంద్రునిపేట గ్రామ సమీపంలో అధికారికంగా అనుమతులు పొంది, తక్కెళ్లపాడులో గ్రావెల్ తవ్వుతున్నారని, జయంతిపురంలో అనుమతులు తీసుకుని మరో ప్రాంతంలో తవ్వుతున్నారని గుర్తించి వీడియోలు, ఫొటోల ద్వారా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

చిత్ర పరిశ్రమకు.. పెట్టని కోట

చిత్ర పరిశ్రమలో ఒక ధ్రువతారగా.. తెలుగు సినీరంగంలో విలక్షణ నటుడిగా వెలుగొందారు కోట శ్రీనివాసరావు. సినిమాల్లో ఏ పాత్ర ఇచ్చినా అందులో పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకుల హృదయాలను దోచుకునేవారు. చిత్ర పరిశ్రమ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగి పద్మశ్రీ, నంది, జూరీ అవార్డులను సొంతం చేసుకున్నారు. కోట మృతితో ఉమ్మడి కృష్ణా కళారంగం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.



ఇక సెలవు..

» 750 సినిమాల్లో నటించి తనదైన ముద్ర

» తెలుగు సినిమా రంగంలో ఓ ధ్రువతార

» కోట మృతితో విషాదంలో కళాకారులు

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)

1942 జూలై 10న కంకిపాడులో వైద్యుడు సీతారామాంజనేయులు, సుశీల దంపతులకు కోట శ్రీనివాసరావు జన్మించారు. తండ్రి వైద్యుడిని చేద్దామనుకుంటే కోట శ్రీనివాసరావు నటుడయ్యారు. కళాశాల రోజుల్లోనే కోటకు నాటకాలంటే మక్కువ. సినిమాల్లోకి వచ్చేముందు ఆయన స్టేట్‌బ్యాంకులో పనిచేశారు. ఆయన భార్య రుక్మిణి, కుమారుడు కోట వెంకట ఆంజనేయప్రసాద్. ఆంజనేయప్రసాద్ సిద్ధం, గాయం-2 చిత్రాల్లో నటించాడు. 2010జూన్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆంజనేయ ప్రసాద్ మృతి చెందాడు.



చలన చిత్రరంగంలో కోట ప్రస్థానం

750 చిత్రాలలో నటించిన కోట శ్రీనివాసరావు చలన చిత్రరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మళయాళ చిత్రాల్లో ఆయన నటించారు. 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో కోట శ్రీనివాసరావు చలన చిత్ర జీవితాన్ని ప్రారంభించారు. దర్శకుడు రాజమౌళి గౌరవంగా మాస్టర్ అని పిలిచేవారు. ఎక్కువ సినిమాల్లో విలన్ కారెక్టర్ వేసినా.. కమెడియన్‌గా ఆయనకు ఆయనే సాటి. 'అహనా పెళ్లంట' సినిమాలో బ్రహ్మానందంతో కలిసి చేసిన కామెడీ అందరి హృదయాల్లో నిలిచిపోయింది. 2023లో 'మాయాబజార్ ఫర్ సేల్' సినిమా అందరి హృదయాల్లో నిలిచిపోయింది. ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమా ఇంకా రిలీజ్ కాలేదు.

2015లోనే పద్మశ్రీ

కోట శ్రీనివాసరావును భారత ప్రభుత్వం 2015లో ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించింది. 2012లో 'కృష్ణం వందే జగద్గురుం' చిత్రానికి ఈ అవార్డు అందుకున్నారు. మొత్తం తొమ్మిది నంది అవార్డులను ఆయన అందుకున్నారు.

కృష్ణాజిల్లాతో అనుబంధం..

కృష్ణాజిల్లాతో కోట శ్రీనివాసరావుకు విడదీయరాని అనుబంధం. విజయవాడలో సినిమాల్లో వీరు నటించిన సందర్భాల్లో కంకిపాడు వెళ్లి బంధువులు, స్నేహితులను కలిసేవారు. 83 ఏళ్ల కోట శ్రీనివాసరావు తుదిశ్వాస వరకు నటనలో జీవించారు. ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో వంటి అగ్ర నటులతో కలిసి పనిచేశారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు సాయం చేసేవారని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావుకు మచిలీపట్నంలో రచయిత నాదెళ్ల పురుషోత్తమశాస్త్రి, కవి అద్దేపల్లి రామ్మోహనరావు వంటి ప్రముఖులతో పరిచయాలున్నాయి. కోట మృతిపట్ల కృష్ణాజిల్లా రంగస్థల కళాకారుల సంఘం, బ్రాహ్మణ సేవాసంఘాల ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి.

బెజవాడతో అనుబంధం..

» 'తూర్పు' ఎమ్మెల్యేగా ప్రజాసేవ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

విలక్షణ నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న కోట శ్రీనివాసరావు రాజకీయాల్లోను స్వచ్ఛమైన నేతగా ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో కొన్నేళ్లే ఉన్నా.. ఎలాంటి అవినీతి మరకలను ఆయన అంటించుకోలేదు. ప్రజాసేవలో అభివృద్ధిపైనే ఆలోచించారు. ఆ తర్వాత రాజకీయాల్లో తాను సరిపోనని భావించి దూరమయ్యారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే(బీజేపీ)గా కోట శ్రీనివాసరావు 1999 నుంచి 2004 వరకు పనిచేశారు. అప్పటికే చిత్ర రంగంలో శ్రీనివాసరావు అనేక అవార్డులను అందుకున్నారు. విజయవాడ తూర్పు స్థానం నుంచి సినీనటులకు అవకాశం ఇవ్వాలని బీజేపీ భావించింది. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఐలాపురం వెంకయ్యపై 57,047 ఓట్లతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు, ఎంపీగా గద్దె రామ్మోహనరావు ఉన్నారు.

విజయవాడ నగరంలో తొలి ఫ్లైఓవర్ కోట శ్రీనివాసరావు హయాంలోనే వచ్చింది. ప్రస్తుతం ఉన్న అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్‌ను ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నిర్మించారు. నాడు అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం, వాంబేకాలనీ ప్రాంతాలను విజయవాడ నగరంతో అనుసంధానం చేయడానికి ఫ్లైఓవర్ అవసరమని భావించి దానిని పూర్తిచేయించారు. ప్రస్తుతం ఉన్న బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగింది. ఇంతకుముందు ఇక్కడ రైల్వేలైన్ ఉండేది. దానిని తొలగించి బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం చేయించారు. ఈ రెండే కాకుండా కాల్వలపై ఇప్పుడున్న చిన్నచిన్న వంతెనల నిర్మాణానికి కోట శ్రీకారం చుట్టారు.

గద్దెరామ్మోహన్‌తో ఆత్మీయ బంధం

కోట శ్రీనివాసరావు తూర్పు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గద్దె రామ్మోహనరావు విజయవాడ ఎంపీగా ఉన్నారు. గద్దె టీడీపీ తరఫున, కోట బీజేపీ తరఫున పోటీ చేశారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయాలకు ముందే మంచి అనుబంధం ఉంది. గద్దె రామ్మోహనరావును ఆయన తమ్ముడు అని సంభోదిస్తుండేవారు. గద్దె విద్యాభ్యాసం గన్నవరం ప్రభుత్వ కళాశాలలో సాగింది. అదే కళాశాలలో కోట శ్రీనివాసరావు తమ్ముడు కోట శంకర్రావు చదువుకునేవారు. నాటి నుంచే ఇద్దరి మధ్య అనుబంధానికి బీజం పడింది. ఆంధ్రా యూనివర్సిటీ నాటిక పోటీల్లో కళ్లు అనే సాంఘిక నాటకంలో శంకర్రావు కథానాయకుడిగా, రామ్మోహనరావు కథానాయికగా నటించారు. ఈ నాటకానికి కోట శ్రీనివాసరావు దర్శకుడిగా పనిచేశారు. కంకిపాడులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తూ రోజూ సాయంత్రం పూట గన్నవరం వెళ్లేవారు. కళాశాలలో వీరితో రాత్రి పదిగంటల వరకు రిహార్సల్స్ చేయించేవారు. యూనివర్సిటీ స్థాయిలో గద్దెకు ఉత్తమ కథానాయిక అవార్డు దక్కింది. అప్పటి నుంచే తమ మధ్య అనుబంధం ఏర్పడిందని గద్దె రామ్మోహనరావు చెబుతున్నారు. రాజకీయాల నుంచి దూరమైనా తరచుగా ఫోన్‌చేసి యోగక్షేమాలు తెలుసుకునేవారని నాటి జ్ఞాపకాలను గద్దె గుర్తు చేసుకున్నారు.

కోట శ్రీనివాసరావు మృతి దురదృష్టకరం

- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్ : సీనియర్ నటుడు, పద్మశ్రీ కోటా శ్రీనివాసరావు మృతి దురదృష్టకరమని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. చిత్రరంగంలో కోట శ్రీనివాసరావు ఒక ప్రత్యేక తరహా నటుడిగా ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికీ గుర్తుండిపోయే చిరస్మరణీయమైన వ్యక్తి అని పేర్కొన్నారు. సినీరంగంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో 750 సినిమాల్లో నటించి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

చిత్ర కళా శోభితం.. కృష్ణాతీరం

» ఫ్లోర్ పెయింటింగ్ డ్రాయింగ్ పోటీల్లో పెయింటింగ్ వేసిన కలెక్టర్

» ప్రతివారం హరిత బెరంపార్కులో సృజనాత్మక కార్యక్రమాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



బెరంపార్కులో కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న యువత, చిన్నారులు

విద్యాధరపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పున్నమి ఘాట్ వద్ద హరిత బెరం పార్కులో ఆదివారం నిర్వహించిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇదే స్ఫూర్తితో ప్రతివారం బెరంపార్కులో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఫోటోగ్రఫీ, యోగా, స్విమ్మింగ్, కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమాల్లో పర్యాటకులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా అధికార యంత్రాంగం విజయవాడ నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బెరంపార్కులో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలు, ఫ్లోర్ పెయింటింగ్ పోటీలకు 300 మందికి పైగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. స్వర్ణాంధ్ర విజన్-2047, పి-4, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛాంధ్ర, సేవ్ వాటర్, హరితాంధ్ర, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అంశాల ప్రాతిపదికగా వేసిన వర్ణచిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణాతీరం కొత్త శోభను సంతరించుకుంది. స్వయంగా కలెక్టర్ కుటుంబసభ్యులతో పెయింటింగ్ వేసి ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రలు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల ఉత్సాహం మరింత ప్రోత్సాహం ఇచ్చిందని, ప్రతి వారం ఒక ఈవెంట్‌ను కృష్ణాతీరాన నిర్వహిస్తామని తెలిపారు.

ఫ్లోర్ పెయింటింగ్ విజేతలు

ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్-సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ ప్రథమ స్థానంలో నిలిచి రూ.10వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందుకుంది. పి.యామిని విశాల ద్వితీయ బహుమతిగా రూ.7,500 నగదు, వి.జశ్వంతి రూ.5వేలు నగదును తృతీయ బహుమతిగా అందుకున్నారు. ఎం.సురేష్ రూ.3వేల నగదును నాలుగవ బహుమతి, ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హవీలజెన్నీ, బి.రోహితలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

డ్రాయింగ్ పోటీలలో..

ఎం.ఎస్.వైష్ణవ్యకు ప్రథమ బహుమతి, జయాన్‌కు ద్వితీయ, జి.భాష్యశ్రీకు తృతీయ, లక్ష్యజైన్‌కు నాలుగో బహుమతి వచ్చింది. టి.క్రిష్, జి.ఇషికాకృష్ణన్, జి.ఆద్వి, సాక్ష్యంసుతార్, రామిరెడ్డి, జస్విత లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పి.చిందబరేశ్వరరావు, కళాసాగర్ పి.రమేష్, సంతోష్‌కుమార్‌లు వ్యవహరించారు. మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ జి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డాక్టర్ రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

అవినీతి..అరాచకాలు!

వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము వ్యవహారశైలిపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భార్య జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నా అన్నీ తానే అన్నట్టు వ్యవహరించి అనేక అక్రమాలకు తెరతీసినట్టు ఆరోపణలు ఉన్నాయి. జెడ్పీ కారులను సొంత అవసరాలకు యథేచ్ఛగా వినియోగించడంతో పాటు ఆయిల్ దోపిడీకి పాల్పడినట్టు విమర్శలు ఉన్నాయి. తాత్కాలిక ఉద్యోగులు, పనుల్లో కమీషన్, ఉద్యోగుల బదిలీలు వంటి విషయాల్లో అవినీతికి పాల్పడినట్టు సమాచారం. మాజీ మంత్రి పేర్ని నాని డైరెక్షన్‌లో శనివారం గుడివాడలో జరిగిన ఘటన నేపథ్యంలో టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ దూషించడం చర్చనీయాంశంగా మారింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వంలో, కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రాము అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. జెడ్పీ చైర్మన్ తానే అన్నట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్‌కు ప్రోటోకాల్ ప్రకారం కారు సదుపాయం ఉంది. దీన్ని అనధికారికంగా ఉపయోగిస్తున్నట్టు తెలిసింది. కారుకు ఇచ్చిన పరిమితికి మించి ఆయిల్ కొట్టించుకుని సుదూర ప్రాంతాలకు ప్రయాణించేవారని సమాచారం. పెడనలోని ఓ పెట్రోల్ బంకులో ఖాతా ఉందని, ఇక్కడ ఇష్టానుసారం జెడ్పీ కార్లకు ఆయిల్ కొట్టించుకుంటున్నారని తెలిసింది. నెలకు ఇచ్చిన వినియోగ పరిమితి దాటి మరీ ఆయిల్ ఉపయోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌కు తరచూ జెడ్పీ కార్లను వేసుకుని వెళ్లేవారని, జెడ్పీ కారు డ్రైవర్‌ను పక్కన పెట్టి, సొంత డ్రైవర్‌ను తీసుకుని ఒకసారి హైదరాబాద్ వెళ్లారని, ఆ సమయంలో పెద్ద డబ్బాల్లో ఆయిల్ నింపుకుని కారులో తీసుకుని మరీ వెళ్లటం చర్చనీయాంశమైంది. అప్పట్లో జెడ్పీ అధికారులు ఈ వ్యవహారాన్ని గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జెడ్పీ చైర్‌పర్సన్ కారులోనే తెలంగాణ నుంచి మద్యం కేసులను తీసుకువచ్చి బందరులోని తన బార్‌కు తరలించేవారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనం కూడా ప్రచురించింది. జెడ్పీ అధికారులు ఉలిక్కిపడి దీనిపై విచారణ కూడా జరిపారు.

పని చేయకపోయినా జీతాలు ఇప్పిస్తూ..

జెడ్పీలో తాత్కాలిక ఉద్యోగులుగా పలువురిని నియమించుకున్నారు. ఈ ఉద్యోగులు ఎప్పుడూ కనపడేవారు కాదని, కానీ వారికి నెలనెలా జీతాలు డ్రా అయ్యేవని ఆరోపణలు ఉన్నాయి. జెడ్పీ ఉద్యోగుల బదిలీల వ్యవహారాలన్నీ రాము కనుసన్నల్లోనే జరిగేవని సమాచారం. రాము చేస్తున్న అక్రమాలకు సంబంధించిన విషయాలు ఉద్యోగులు పత్రికలకు సమాచారం ఇస్తున్నారన్న అనుమానంతో పలువురిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించినట్టు సమాచారం. జెడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలను సైతం బండ బూతులు తిడుతూ వారిని భయభ్రాంతులకు గురిచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సీఈవో, డిప్యూటీ సీఈవోలను వేధించినట్టు సమాచారం.

పనుల్లో కమీషన్లు

అభివృద్ధి పనుల పేరుతో భారీగా కమీషన్లు దండుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. జెడ్పీకి చెందిన ఖరీదైన ఆస్తులను బడా సంస్థలకు కట్టబెట్టి ప్రయోజనాలు పొందాలన్న స్కెచ్ కూడా వేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో విజయవాడలో కాంప్లెక్స్ పేరుతో బందరు రోడ్డు వెంబడి ఉన్న భవనాలను కూలగొట్టారు. జేసీ బంగళా ఉండటంతో.. అప్పట్లో ఈ స్కెచ్‌ను గమనించిన ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు దీనికి అడ్డుకట్ట వేశారు. పిన్నమనేని కోటేశ్వరరావు, కడియాల రాఘవరావు వంటి మహానుభావులు పనిచేసి జెడ్పీకి పేరు ప్రఖ్యాతలు తెస్తే, రాము తన సతీమణి ఉప్పాల హారికను అడ్డం పెట్టుకుని తీరని అప్రతిష్ఠను తీసుకువచ్చారు. అధికారంలో లేకపోయినా సరే తగ్గేది లేదన్నట్టు.. గుడివాడలో టీడీపీ శ్రేణులను దూషించి మరోమారు వివాదంలో చిక్కుకున్నాడు. ఉప్పాల రాముపై కూడా టీడీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో జెడ్పీ వేదికగా ఆయన సాగించిన అక్రమాల చిట్టా బయటకు తీయాలని భావిస్తున్నారు.



కొత్తపేట సీఐ కొండలరావుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

పేర్ని నానిపై చర్యలు తీసుకోండి

» కొత్తపేట స్టేషన్‌లో టీడీపీ మైనార్టీ నేతల ఫిర్యాదు

చిట్టినగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను, వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న మాజీ మంత్రి పేర్ని నానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం కొత్తపేట స్టేషన్‌లో పలువురు టీడీపీ మైనార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా మాట్లాడుతూ, పేర్ని నాని ఒక సభలో మాట్లాడుతూ ప్రజలను, వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలింగించే విధంగా మాట్లాడారని, పదే పదే కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడన్నారు. ఆయన మాటలు అన్ని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలలో రావడం జరిగిందన్నారు. ఇటువంటి వ్యక్తులు బయట తిరగటం మంచిదికాదని వెంటనే అరెస్టు చేయ్యాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, టీడీపీ మైనార్టీ నాయకులు ఎస్కే ఆషా, జాహెద్, అన్సార్. ఇమ్రాన్, మల్లేశ్వరి, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాయల మంగ

(5వ పేజీ తరువాయి)

పెళ్లిళ్లు చేసుకుంది. ఇందుకోసం మోజ్, ఏలో యాప్‌లను ఉపయోగించినట్టు పోలీసులు గుర్తించారు. సిద్ధిపేటలో ఉన్న భర్తను ఏలో యాప్‌లో ట్రాప్ చేసింది. తానొక అనాథనని అతడి కుటుంబ సభ్యులను నమ్మించింది. ఉపాధి కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. ప్రస్తుతం ఆమెతో సహజీవనం చేస్తున్న ఉపేందర్‌రెడ్డికి మోజ్ యాప్‌లో వల వేసింది. సిద్ధిపేటలో ఉన్న ఆమె భర్తను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఉపేందర్‌రెడ్డితో సహజీవనం చేస్తూనే అప్పుడప్పుడు భర్త వద్దకు వెళ్తుండేది.

క్వికర్ ద్వారా వచ్చిన అనూష

రామారావు తన ఇంట్లోకి కేర్‌టేకర్ కావాలని సుమారు 10-15 రోజుల క్రితం క్వికర్ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. తర్వాత ఒకవ్యక్తి రామారావుకు ఫోన్‌చేసి అనూష నెంబరు ఇచ్చాడు. కేర్‌టేకర్‌గా రావడానికి ఆమె ఆసక్తిగా ఉందని, సంప్రదించాలని చెప్పాడు. వెంటనే రామారావు ఆమె నెంబరుకు ఫోన్ చేశాడు. లొకేషన్ చెప్పగానే వచ్చి విధుల్లో చేరింది. రామారావు హత్యకు 9వ తేదీన స్కెచ్ వేసుకున్నారు. 10వ తేదీ రాత్రి పది గంటలకు అనూష, ఉపేందర్‌రెడ్డికి ఫోన్ చేసింది. వంటగదిలో కారం తీసుకుని ఇద్దరూ రామారావు బెడ్‌రూంలోకి వెళ్లారు. నిద్రపోతున్న రామారావు గుండెపై ఉపేందర్‌రెడ్డి కూర్చున్నాడు. ఆయన ఒక్కసారిగా కళ్లు తెరవడంతో అనూష కారం చల్లింది. ఉపేందర్ ఎక్కువ సేపు గుండెపై కూర్చోగా, అనూష.. కాళ్లు పట్టుకుంది. కొద్ది సేపటికే రామారావు ప్రాణాలు కోల్పోతాడని భావించారు. అయితే, కాళ్ల వద్ద ఉన్న అనూషను రామారావు కడుపులో గట్టిగా తన్నాడు. దీంతో ఆమె ఎగిరి గోడ వద్ద పడింది. ఇలా పని కాదనుకోవడంతో రామారావు కాళ్లను అనూష గట్టిగా పట్టుకుంది. గుండెపై కూర్చున్న ఉపేందర్ దిండును ముఖంపై పెట్టి బలంగా నొక్కాడు. ఊపిరాడకపోవడంతో రామారావు ప్రాణాలు కోల్పోయాడు.

రూ.90 వేలు కాదు.. 40 వేలే..

రామారావును చంపేశాక బీరువాలో ఉన్న రూ.90 వేలు తీసుకుని ఉపేందర్‌రెడ్డి, అనూష పరారయ్యారు. పోలీసు విచారణలో అనూష కొత్త లెక్క చెప్పుకొచ్చింది. తాము రూ.90 వేలు తీయలేదని, బీరువాలో రూ.40 వేలే ఉన్నాయని, వాటిని తీసుకున్నామని చెప్పినట్టు తెలిసింది. లెక్కల్లో కనిపించని రూ.50 వేలు ఏమయ్యాయన్న దానిపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఆయన లైంగికంగా వేధించాడని, అందుకే హత్య చేశానని చెప్పినట్టు తెలిసింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 103,111, 122
చికెన్ విత్ స్కిన్ 196
చికెన్ స్కిన్‌లెస్ 206



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ప్రోత్సాహమే కళాకారులకు అసలైన బహుమతి: హజరత్తయ్య గుప్తా

గాంధీనగర్: కళాకారులు ఆశించే అసలైన బహుమతి ప్రోత్సాహమేనని వ్యాఖ్యాన శిరోమణి డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో రాగాల పల్లకి స.రి.గ.మ.ప కలిసి పాడుదాం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనస్సుకు నచ్చిన పాట వింటూ చేసిన కష్టాన్ని మరిచిపోవచ్చన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్ రాజు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బాధ్యతగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

పూడుకున్న డ్రెయిన్స్‌తో పరేషాన్

● దుర్గంధం తట్టుకోలేకపోతున్నామంటున్న స్థానికులు ● అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు




పూడుకుపోయిన సైడ్ డ్రైయిన్, నివాసాల మధ్యనే దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు

రామలింగేశ్వరనగర్ జూలై 13 (ఆంధ్రజ్యోతి): 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ గులాబీ రోడ్డునందు సైడ్ డ్రెయిన్లు పూడుకుపోయాయని, దీంతో చుట్టుపక్కల నుంచి వచ్చే మురుగునీరు దుర్గంధం వెదజల్లుతూ నివాసాల మధ్యనే నిలిచి ఉంటోంది. మురుగు నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలు వ్యాప్తిచెంది కలరా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఆందోళనలు చెందుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని కాలనీ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడుకుపోయిన సైడ్ డ్రెయిన్లు నిర్మించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

నాగమణి, స్థానికురాలు, గులాబీరోడ్డు



మాట్లాడుతూ సైడ్ డ్రెయిన్లు పూడుకుపోయాయి. చుట్టుపక్కల నుంచి వచ్చే మురుగునీరు దుర్గంధం వెదజల్లుతూ నివాసాల మధ్యనే నిలిచి ఉంటోంది. దీని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాము. సంబంధిత అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు.

వ్యాధులు సోకుతాయేమోనని భయం

ఈశ్వరి, స్థానికురాలు, గులాబీరోడ్డు



మురుగు నీరు దుర్గంధం వెదజల్లుతూ నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి సైడ్‌డ్రైనయన్లు నిర్మించే దిశగా చర్యలు చేపట్టాలి.

ఆర్‌ఆర్ గార్డెన్‌కాలనీలో..

భారతీనగర్: పూడికతో నిండిన సైడు కాలువలతో ఆర్‌ఆర్ గార్డెన్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని గురునానక్ రోడ్డు సమీపంలో ఆర్‌ఆర్ గార్డెన్ ఉంది. కొంతకాలంగా కాలనీలో ప్రధాన సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలకు నిలయంగా మారింది. ప్రధాన, అంతర్గత రోడ్లలో పూడికతో నిండిన డ్రెయినేజీ వ్యవస్థ, పేరుకుపోయిన చెత్త, ఎండిన ఆకులు, ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు వంటి సమస్యలు కాలనీప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని పెద్దలు కోరుతున్నారు.

ప్రైవేట్ బస్సుల నిలిపివేత

పంట కాలువ రోడ్డు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఏర్పాటు చేసిన హైటెన్షన్ రోడ్డు పనులు నిలిచిపోవడంతో రోడ్డు కింద కొందరు ప్రైవేట్ బస్సుల యాజమానులు తమ బస్సులు నిలిపేస్తున్నారు. అంతేకాక మరమ్మతులు కూడా అక్కడే చేయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేకాక కొంతకాలంగా కాలనీలోని సైడ్ కాలువలు మొత్తం పూడికతో నిండిపోవడం, రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా అంతర్గత రోడ్లు, దుర్గ జనరల్ స్టోర్స్ సమీపంలోని రోడ్డు నీటితో మునిగిపోతున్నాయి. పైగా ప్రధాన డ్రెయినేజీలలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. కాలనీలోని మెయిన్ డ్రెయిన్లు పూడికతో నిండటం, నివాసాల మధ్యలోని ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో రాత్రీపగలు తేడా లేకుండా దోమలు దాడి చేస్తున్నాయి.






చిన్నిగారి రోడ్లో చెత్తతో నిండిన డ్రెయిన్, కాలనీలోని టవర్స్ రోడ్డు సమీపంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, హైటెన్షన్‌రోడ్డులో నిలిపిన ప్రైవేట్ బస్సులు, కోనేరు మధుసూదన్ రావు పార్కు సమీపంలో పిచ్చిమొక్కలు




ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో పుల్లేటి కాలువకు ఇనుప రాడ్లు, కనకదుర్గ నగర్ కాలనీ పంటకాలువకు ఇనుప ఫెన్సింగ్

ప్రధాన డ్రెయిన్ల వద్ద రక్షణ చర్యలు

తూర్పు నియోజకవర్గంలోని పలు కాలనీల్లోని ప్రధాన రహదారులు వెంబడి ఉన్న ప్రధాన డ్రెయినేజీల (వెడల్పు, లోతు ఎక్కువగా ఉన్న) నుంచి ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ఉండడంతో పాటు వర్షాకాలం వాన నీరు రోడ్డు మీదకు రాకుండా ఆపేందుకు రక్షణగా సుమారు రూ.1.5 కోట్లతో వీఎంసీ అధికారులు ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుల్లో భాగంగా 3, 4వ డివిజన్‌లోని ప్రధాన అవుట్ పాల్ డ్రెయిన్లు అయిన పుల్లేటికాలువ, పంటకాలువ (మురుగుకాలువ), గుంటతిప్ప డ్రెయిన్‌తో పాటు ప్రధాన డ్రెయినేజీలకు రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తున్నారు.

తాగునీటి కోసం విలవిల!

● సాయి నగర్, శివపార్వతి నగర్ ప్రాంత ప్రజల ఇక్కట్లు

రామలింగేశ్వర్ నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సాయినగర్, శివ పార్వతీ నగర్ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సరఫరాకు రిజర్వాయరు ఉన్నా తాగునీటి సరఫరా అరగంట మాత్రమే కేటాయిస్తున్నారని, కొన్ని రోజులుగా అవి కూడా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మంచినీటి పైపు లైన్లు పగిలిపోయాయని అధికారులు చొరవ తీసుకోనిదే తామేం చేయలేమని స్థానిక సిబ్బంది చెబుతున్నారన్నారు. కొన్నిచోట్ల వచ్చేనీరు సన్నదారగా వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నీరు కూడా పరిశుభ్రంగా ఉండడం లేదంటున్నారు. ట్యాంకును శుభ్రపరచకపోవడం, పైపులైన్లు కలుషితమవ్వడంతో తరచూ మురికి నీరు వస్తుందని ఆ నీటిని తాగలేని దుస్థితి ఏర్పడిందంటున్నారు. దీంతో తప్పక మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సి వస్తుందని, కొనలేని వారు ఆ నీటినే తాగాల్సిన దుస్థితి ఏర్పడిందంటున్నారు. ఇలాంటి నీటితో డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రపరచి, పైపులైన్లను తనిఖీ చేసి, మంచినీటి సరఫరా సమయం పెంచి రెండుపూటలా మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

సుకన్య, స్థానికురాలు, సాయినగర్




తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నాం. సరఫరా సమయం అరగంటే కేటాయిస్తున్నారు. తగినంతగా నీటి సరఫరా లేదు. మంచినీటి సిబ్బందికి చెప్పినా పైపులైన్లు పగిలిపోయాయని, అధికారులు చొరవ తీసుకోవాలని చెప్తున్నారు. అధికారులు స్పం దించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

కలుషిత నీరు ఎలా తాగేది..?

భవానీ, స్థానికురాలు, శివపార్వతి నగర్



ట్యాంకును సరిగా శుభ్రపరచకపోవడం, పైపులైన్లు కలుషితమవడంతో తరచూ మురికి నీరు వస్తుంది. దీంతో ఆ నీటిని తాగలేని పరిస్థితి ఏర్పడింది.



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్న ప్రజలు

● వినియోగదారుల అనుమతి లేకుండా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు
● సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

కృష్ణలంక, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు పెట్టడానికి నిరసనగా స్థానిక 21వ డివిజన్‌లోని కల్పన ప్రింట్స్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ పాల్గొని మాట్లాడుతూ కరెంట్, చార్జీలు, భారాలు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేసి ఏడాదిలో ప్రజలపై రూ.14487 కోట్ల భారాన్ని అదనపు విద్యుత్ చార్జీల పేరుతో మోపిందన్నారు. కరెంటు బిల్లులు పెరిగిపోయి ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. బాగున్న మీటర్లు తీసేసి ఆదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను పెడుతున్నారన్నారు. ఇది ప్రీపెయిడ్ మీటర్. ముందే బిల్లులు చెల్లించాలి. రీచార్జ్ చేసుకోవాలి. స్మార్ట్ మీటర్‌తో పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు విద్యుత్‌కు చెల్లించాలన్నారు.

ఈ విషయాలపై టీడీపీ నేతలు చర్చకు రావాలని సవాల్ చేశారు. కూటమి నేతలు, ఎమ్మెల్యేలు తొలి అడుగు పేరుతో ఇంటింటికీ వస్తున్నారు. వారిని కరెంటు బిల్లులు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని నిలదీయాలని ప్రజలకు కాశీనాథ్, కృష్ణ పిలుపునిచ్చారు. సీపీఎం నేతలు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, కోరాడ రమణ, కే శివాజీ, తాడి రమణ, వీ గోపి, కసర లక్ష్మణ, బీ భారతి పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు పెట్టడానికి నిరసనగా ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నేతలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

కూటమి ప్రభుత్వంలో అద్భుతమైన ఫలితాలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అన్ని రంగాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 12వ డివిజన్‌లోని అయ్యప్పనగర్‌లో 293 బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. రామ్మోహన్, అనురాధ ప్రతి ఇంటికీ వెళ్లి ఏడాది కూటమి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సీఎం చంద్రబాబు సమర్థత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సలహాలు, సూచనలు, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రంలోని అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధించామన్నారు. ఏడాది పాలనలోనే జీడీపీని 8 శాతం నుంచి 12 శాతానికి పెంచగలిగామని, పింఛన్ సొమ్మును ఒక్కసారిగా రూ.వెయ్యి పెంచి ప్రతినెల 1న లబ్ధిదారులకు స్వయంగా అందజేస్తున్నామన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, సాయన సత్యనారాయణ, అబ్దుల్ కరీం, జక్కుల సుబ్బారావు, నారాయణ, కోడే సాంబశివరావు పాల్గొన్నారు.

కోట మృతికి సంతాపం

తన విలక్షణమైన నటనతో 4 దశాబ్దాల పాటు సినీ ప్రేక్షకులను కోట శ్రీనివాసరావు ఆకట్టుకున్నారని, తాను ఎంపీగా ఉన్నప్పుడు బీజేపీ విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావుతో కలిసి పనిచేశానని, నగర వాసుల నుంచి ఎమ్మెల్యేగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు అన్నారు. కోట మృతిపై ఆయన కుటుంబ సభ్యులకు ఆయన ఆదివారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాసరావుతో తనకున్న పరిచయాన్ని గద్దె గుర్తు చేసుకున్నారు. తమిళ, హిందీ, కన్నడ, తెలుగు భాషల్లో 750కిపైగా చిత్రాల్లో శ్రీనివాసరావు నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారన్నారు. ఆయన మృతి చిత్రపరిశ్రమకు తీరనిలోటన్నారు.

కమ్మ సేవా సంఘం సేవలు విస్తృతం చేయాలి



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పటమట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కమ్మవారి సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు ప్రతి ఒక్క కమ్మ సామాజిక మేధావులు, పెద్దలు ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన ఏపీ కమ్మవారి సేవా సమాఖ్య రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన, అనంతరం మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి ప్రతినిధులు నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చాలావరకు ఐక్యత లేక అనేక కార్యక్రమాలు సాధ్యపడటం లేదని, పెద్దలు, సభ్యుల సహకారంతో ఆర్థికంగా నిధిసేకరణ చేసి మరిన్ని సేవా కార్యక్రమాలకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మండల రమ, డాక్టర్ గన్ని భాస్కరరావు, గూడురు సత్యనారాయణ, సూరపనేని స్వరూపరాణి, జగదీష్, రామకృష్ణ, శ్రీనివాస చక్రవర్తి, బొర్రా గాంధీ, రాయుడు, కోటేశ్వరరావు, చలపతిరావు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు

746 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

భారతీనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేక కేటగిరి కౌన్సెలింగ్ ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎన్‌సీసీ విభాగంలో 260 మందికి, ఆర్మీ విభాగంలో 383 మందికి స్పోర్ట్సు అండ్ గేమ్సు విభాగంలో 103 మందికి మొత్తం 746 మందికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతృప్తి

● టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల



సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రాణిగారితోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలెంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాణిగారితోటలోని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాలతో డివిజన్‌లోని 176, 198, 203, 197 బూత్‌ల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రోల్‌బాల్ స్టేట్‌మీట్‌కు క్రీడాకారుల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19, 20న కాకినాడలో జరిగే రోల్‌బాల్ స్టేట్ మీట్‌లో పాల్గొనే అండర్ -11, 14, 17 జట్ల ఎంపికలు ఆదివారం తాడిగడపలోని శ్రీ హరీష్ నందన్ స్పోర్ట్స్ అండ్ ఫన్ క్లబ్‌లో నిర్వహించినట్లు రోల్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ టీ లలితప్రియ తెలిపారు. ఈ ఎంపికలు అసోసియేషన్ ఆధ్వర్యంలోని అడ్‌హక్ కమిటీ నిర్వహించిందని, ఎంపికైన క్రీడాకారులు స్టేట్‌మీట్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



స్టేట్‌మీట్‌కి ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-209454

BUILDING FOR SALE

» ప్రసాదంపాడులో 55 చ.గ. గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్స్ గల బిల్డింగ్ అమ్మకము. గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు అద్దె Per Month, 27,000/-. రేటు 55 లక్షలు. సంప్ర. 76720 94576
AJB - 131

PLOTS FOR SALE

» విజయవాడ, అమరావతి రాజధాని, కంచికచర్ల, ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో CRDA, DTCP ఇళ్ళ మధ్యలో ప్లాట్స్ చ.గ. 1,975/- నుండి 6,900/- ప్లాట్స్. సెల్ : 72078 15189.
AJB-57

» కంకిపాడు ఓపెన్ ప్లాట్స్ & విల్లాస్, బందరు రోడ్డుకి 1/2 KM కంకిపాడు to ప్రొద్దుటూరు మెయిన్‌రోడ్‌లో 15 ఎకరాల CRDA 50% బ్యాంక్ లోన్, Sq. Yards 19000/- Hyma Prasad ✆ 99596 45468
AJB - 161

» ఎనికేపాడు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కాంపౌండుకు ఆనుకొని వెంటనే ఇల్లు కట్టుకొనుటకు CC రోడ్డు, అండర్ గ్రౌండ్, డ్రైనేజి, కాంపౌండువాలు, 200 గజాలు ప్లాటు గజం 33,000/- 50% బ్యాంకు లోన్ Hyma Prasad ✆ 99596 45468
AJB - 160

పొలము అమ్మకము

» నూజివీడు రెవిన్యూ మండలం, రావిచర్ల గ్రామము నందు గల మూడు (3) యకరాల తొమ్మిది (9) సెంట్లు భూమిలో మామిడితోట, బోరు మరియు పంపుశెట్టు గల పొలము అమ్మకమునకు కలదు. కొనదలచినవారు సంప్రదించగలరు. 77023 96675
AJB-235375

WANTED

» ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు రిటైర్డ్ / వీఆర్ఎస్ ప్రభుత్వ / ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు విద్యావంతులైన గృహిణులకు Fixed Income / PF / ESIC / Pension Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికి. సంప్ర. సెల్ : 77203 96675
AJB-235374

» టీచర్స్ కావలెను : జై కిసాన్ స్టీల్ కంపెనీ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు, మెయిన్ బజార్, విజయవాడ-1 లో HINDI B.Ed., మరియు PET టీచర్స్ Full Time కావలెను. సంప్రదించండి ✆ 95057 31014, 79819 94744
AJB-3181

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, బట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ॥ 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



దిక్సూచి

ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగాలు

దేశ వ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ స్టాఫ్, లోడర్ ఖాళీల భర్తీకి ఐజీఐ ఏవియేషన్ సర్వీసెస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతోంది. పది, ఇంటర్ అర్హత ఉన్నవారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేయవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేస్తారు.

పోస్టులు:
- ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్: **1017**
- లోడర్(పురుషులు మాత్రమే): **429**

అర్హత: ఎయిర్ పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్‌కి ఇంటర్ పాసై ఉండాలి. పురుషులు, మహిళలు ఇద్దరు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీఐ విద్యార్థులు కూడా పోటీ పడవచ్చు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. జీతం 25 వేల నుంచి 35 వేల వరకు ఉంటుంది.
- లోడర్ పోస్టుకి పది పాసైన పురుషులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. రెండు ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలంటే విడివిడిగా దరఖాస్తు పంపాలి. వయస్సు 20 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలి. జీతం 15 వేల నుంచి 25 వేల వరకు ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 21
వెబ్‌సైట్: igiaviationdelhi.com/

ఇండియన్ కోస్ట్ గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ రిక్రూట్‌మెంట్

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్ జనరల్ డ్యూటీ(జీడీ), టెక్నికల్ (ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) విభాగాల్లో 2027 బ్యాచ్‌కు సంబంధించిన అసిస్టెంట్ కమాండెంట్ గ్రూప్ 'ఏ' గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- అసిస్టెంట్ కమాండెంట్(జనరల్ డ్యూటీ-జీడీ) - **140 పోస్టులు**
- అసిస్టెంట్ కమాండెంట్(టెక్నికల్ - ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) - **30 పోస్టులు**

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు జీడీ డ్యూటీ కోసం అర్హులు. అయితే ఇంటర్ లేదా డిప్లొమాలో ఫిజిక్స్, మేథ్స్ చదివి ఉండాలి. అలాగే టెక్నికల్ బ్రాంచ్ కోసం సంబంధిత ఇంజనీరింగ్ శాఖ డిగ్రీ ఉండాలి.
వయస్సు: 21 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2001 జూలై 1 నుంచి 2005 జూన్ 30 తేదీలోపు జన్మించి ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జూలై 23
వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 17 బ్రాంచ్‌లకు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ అడ్మిషన్ 2025-26 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఐదు సంవత్సరాల సీయూఈటీ (యూజీ) 2025 ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.
ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, అప్లైడ్ జియాలజీ, సైకాలజీల్లో ఈ కోర్సులను అందిస్తున్నారు. ఇందులో మేథ్స్, ఫిజిక్స్‌లో 40 సీట్లు, బయాలజీలో 60 సీట్లు, సైకాలజీ, కెమిస్ట్రీల్లో 20 సీట్లు, అప్లైడ్ జియాలజీలో 18 సీట్లు ఉన్నాయి.
మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ: ఇందులో 28 సీట్లు ఉన్నాయి.
బీఎస్ ఆనర్స్: నాలుగు సంవత్సరాల బీఎస్ ఆనర్స్ కోర్సు ఉంది. ఇందులో 20 సీట్లు ఉన్నాయి.
ఇంటిగ్రేటెడ్ ఎంఏ: తెలుగు, హిందీ, లాంగ్వేజ్ సైన్సెస్, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంథ్రో పాలజీల్లో ఎంఏ కోర్సులను అందిస్తున్నారు. ఇందులో తెలుగు, లాంగ్వేజ్ సైన్సెస్‌లో 19 సీట్లు, హిందీ, ఆంథ్రోపాలజీల్లో 20 సీట్లు, ఉర్దూలో 14 సీట్లు, ఎకనామిక్స్‌లో 17 సీట్లు, హిస్టరీలో 35 సీట్లు, పొలిటికల్ సైన్స్‌లో 50 సీట్లు, సోషియాలజీలో 25 సీట్లు ఉన్నాయి.
దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూలై 30
వెబ్‌సైట్: http://acad.uohyd.ac.in/

టీజీ సీపీజీఈటీ

'తెలంగాణ స్టేట్ లెవెల్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్'(టీజీ సీపీజీఈటీ-2025) నోటిఫికేషన్ వెలువడింది. తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులతోపాటు, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ డిప్లొమాలో అడ్మిషన్ కోసం ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన వర్సిటీలతోపాటు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూలోని 45 కోర్సుల్లోని సీట్లను భర్తీ చేస్తారు. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ 2025 జూలై 17. ఆలస్య రుసుము రూ.500/-తో జూలై 24, ఆలస్య రుసుము రూ.2000/-తో జూలై 28 వరకు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు.
- 2025 ఆగస్ట్4వ తేదీ నుంచి ఎంట్రెన్స్‌లు ప్రారంభం అవుతాయి. ఇది పూర్తిగా కంప్యూటర్ బేస్ట్ టెస్ట్(సీబీటీ). పూర్తి వివరాలు త్వరలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 సంవత్సరం ప్రవేశాల దరఖాస్తు స్వీకరణ గడువు 2025 జూలై 29. దేశ వ్యాప్తంగా 654 జేఎన్‌వీల్లో ప్రవేశాలు నిర్వహిస్తుండగా తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ లో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఉన్నాయి. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉంటాయి. ఇందులో 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయిచారు. మిగిలిన 25 సీట్లకు ఎవరైన పోటీ పడవచ్చు. గ్రామీణ ప్రాంతాల సీటు కావాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతులు పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో చదివి ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 29 **వెబ్‌సైట్:** cbseitms.rcil.gov.in/nvs/?Aspx

అన్నా యూనివర్సిటీలో ఎంటెక్, ఎంఈ

తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ 2025-26 సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ), మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్), మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(ఎంఆర్క్), మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(ఎంప్లానింగ్) కోర్సుల్లో అడ్మిషన్స్ ప్రారంభించింది. వీటిలో 2023, 2024, 2025 గేట్ స్కోరు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 20వ తేదీలోపు ceap.annauniv.edu పోర్టల్‌లోకి లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు.

హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్‌లో అప్రెంటిస్‌షిప్

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు.
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **129**
- డిప్లొమా అప్రెంటిస్: **76**
- ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: **156**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకామ్, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, డిప్లొమా, ఐటీఐ, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంబీఏ, పీజీ డిప్లొమా పాసై ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్ట్ 11
వెబ్‌సైట్: www.nhpcindia.com/welcome/job

కాలేజ్, యూనివర్సిటీ విద్యార్థులకు సెంట్రల్ స్కాలర్‌షిప్స్

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన(పీఎం యూఎస్‌పీ యోజన) కింద సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్కీమ్‌ను ప్రకటించింది. ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉద్దేశించిన స్కీమ్ ఇది. దీని కింద పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మూడు సంవత్సరాలపాటు రూ. 12000/- చొప్పున, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ.20000/- చొప్పున ప్రోత్సాహకంగా ఇస్తారు. ప్రతీ సంవత్సరం 82000 కొత్త ఉపకార వేతనాలను అందిస్తారు. మొత్తం స్కాలర్‌షిప్‌లో 50 శాతం మహిళలకు కేటాయించారు.
అర్హత: ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. కోర్సులు రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం 4.5 లక్షలకు మించ కూడదు.
వయస్సు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. **చివరి తేదీ:** 2025 అక్టోబర్ 31
దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో చేయాలి.
అసరమైన ధ్రువపత్రాలు: ఇంటర్ మార్కుల మెమో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, కాలేజీ/యూనివర్సిటీలో అడ్మిషన్ రుజువు, సంస్థ కోడ్
వెబ్‌సైట్: https://scholarships.gov.in/

SCHOLARSHIP ALERT

Infosys Foundation STEM Stars

Description: An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.

Eligibility:
- The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS3

Raman Kant Munjal




Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility:
- Students enrolled in the BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RMKSP5

చిత్రజ్యోతి
SINCE 1965

విలక్షణ నటనకు వినమ్ర నివాళి



తన విలక్షణ నటనతో తెలుగు సినీరంగంపై చెరగని ముద్రవేసిన దిగ్గజ నటుడు కోట శ్రీనివాసరావు మృతితో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. వృత్తిపరమైన, వ్యక్తిగత అనుబంధం కలిగిన పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నటులు రాజేంద్రప్రసాద్, మురళీ మోహన్, ప్రకాశ్‌రాజ్, తనికెళ్ల భరణి, నిర్మాత సురేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ తదితరులు కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కోట శ్రీనివాసరావుగారు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా జీవితంలోనూ మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు.
- నందమూరి బాలకృష్ణ

నాకెంతో ఇష్టమైన వ్యక్తి కోట శ్రీనివాసరావు గారు. ఆయన ప్రతిభ, ఉనికి, మంచి మనసును ఎప్పటికీ మర్చిపోలేం. మాటల్లో చెప్పలేని దుఃఖం కలుగుతోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.
- మోహన్‌బాబు

తన విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. తన నటనతో ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.
- మహేశ్‌బాబు

కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు పరిశ్రమతో పాటు వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. ఆయనతో గడిపిన క్షణాలు మరువలేనివి. గొప్ప నటుడు, మంచి మనిషిని కోల్పోయాం.
- నాగార్జున

కోట శ్రీనివాసరావు గారు ఇక లేరనే వార్త కలచివేసింది. పోషించిన ప్రతి పాత్రకు తన ప్రతిభతో ప్రాణం పోశారు. ఆయన స్థానాన్ని భర్తీ చేయగల నటులు లేరు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.
- రాజమౌళి

మద్రాస్‌లో ఉన్నప్పటి నుంచే మా కుటుంబానికి కోట గారితో అనుబంధం ఉంది. మా నాన్నగారికి ఆయనంటే చాలా ఇష్టం. వారితో ఉన్నప్పుడు సమయమే తెలిసేది కాదు. వారి వ్యక్తిత్వం మర్చిపోలేం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి
- అల్లు అరవింద్

ఎనలేని నటనా చాతుర్యంతో ప్రతి పాత్రకూ తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు గారు. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా
- ఎన్టీఆర్

సినీ పరిశ్రమ కోట శ్రీనివాసరావు గారి లాంటి విలక్షణ నటుణ్ణి కోల్పోయింది. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు. ఆయన చేసిన అద్భుతమైన పాత్రలు మనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కోట శ్రీనివాసరావు గారి ఆత్మకు శాంతి చేకూర్చి, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.
- రామ్‌చరణ్

నటనకు పరిపూర్ణ రూపం




కోట శ్రీనివాసరావుగారు ఇకలేరనే వార్త వారి కుటుంబానికే కాదు, పరిశ్రమకూ తీరని లోటు. అలాంటి వైవిధ్యమైన పాత్రలు పోషించే నటుడు మళ్లీ వస్తారని నేను అనుకోవడం లేదు. మా ఇద్దరి నట ప్రస్థానం 'ప్రాణం ఖరీదు' సినిమాతో ప్రారంభమైంది. సుదీర్ఘమైన నట ప్రస్థానంలో మా అనుబంధం ఎంతగానో పెనవేసుకుంది. తెరమీద ఆయన నటన అద్భుతం. బయట ఆయన హాస్యచమత్కారం కూడా అంతే అద్భుతం.
- చిరంజీవి

ఆయన మాట నన్ను కదిలించింది



బాబూమోహన్, కోటగారి కాంబినేషన్‌ను మేం విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్లం. నా తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'తో మొదలై 'అత్తారింటికి దారేది' వరకూ ఆయనతో కలసి నటించా. నా మనసుకు దగ్గరైన వ్యక్తి. నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను నాతో పంచుకునేవారు. కోట గారి మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు. పదిమంది బాగుకోరే వ్యక్తి. అత్తారింటికి దారేది చిత్రంలో నటించేటప్పుడు ఆయన్ను ఈ వయసులో నటిస్తూ ఇబ్బంది పడడం ఎందుకు అని అడిగితే 'నా బాధను మరిచిపోవడానికి నటనే నాకు మందు' అన్నారు. అది నన్ను బాగా కదిలించింది.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వ్యక్తిగతంగా తీరని లోటు



నా తొలి చిత్రం నుంచి కోట శ్రీనివాసరావుతో దగ్గరి అనుబంధం ఉంది. సురేశ్ ప్రొడక్షన్స్ ప్రతి సినిమాలో కోట గారు నటించారు.
ఇద్దరం కలసి 'శత్రువు, గణేశ్, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' లాంటి ఎన్నో మంచి చిత్రాలు చేశాం. వారి మృతి నాకు వ్యక్తిగతంగా తీరని లోటు.
- వెంకటేశ్

సొంత అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం

రెండు రోజుల కిందటే ఇద్దరం మాట్లాడుకున్నాం, ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి ఆయన లేడు. నా కోటన్న వెళ్లిపోయాడు. ఇంటికొచ్చినప్పుడు ఎంతో సంతోషంగా అప్యాయంగా మాట్లాడేవారు. ఆయనకు అన్నదమ్ములున్నా, నన్నే తన సొంత తమ్ముడిగా భావించేవాడు. షూటింగ్‌కు సమయం తక్కువగా ఉన్నప్పుడు అన్నం కలిపి పెట్టేవాడు. ఏ ఊరికి షూటింగ్‌కు వెళ్లినా, పక్కపక్క గదుల్లోనే ఉండేవాళ్లం. ఇలా మా జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి.
- బాబూమోహన్

కోట మహానటుడు

ఒక దశకంలో నేను, కోట శ్రీనివాసరావు, బాబూమోహన్... మేం ముగ్గురం ప్రతి సినిమాలో ఉండేవాళ్లం. ఆయన మహానటుడు. రోజుకి 18, 20 గంటలు పనిచేసేవాళ్లం. 'అరేయ్ ఒరేయ్' అని పిలుచుకునే వాళ్లం. కోట లేడని అంటే నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత వరకు కోట మన హృదయాల్లో జీవించే ఉంటారు.
- బ్రహ్మానందం

కామెడీ త్రయం



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్, బ్రహ్మానందం ముగ్గురూ కలసి అనేక చిత్రాల్లో నటించారు. కామెడీ త్రయంగా వీరు పంచిన వినోదం ఆల్‌టైమ్ సూపర్ హిట్. వీరి ముగ్గురిని కలిపి సినిమా చేసేందుకు నిర్మాతలకు డేట్స్ దొరకడం కష్టమయ్యేది. చాలా సినిమాల్లో కోట శ్రీనివాసరావు విలన్‌గా నటించగా... బాబూ మోహన్, బ్రహ్మానందం హాస్యనటులుగా, సహాయకులుగా రక్తి కట్టించారు. వెండి తెరపై వీరు ముగ్గురు కలసి చేసిన కామెడీ సన్నివేశాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఒక రకంగా చెప్పాలంటే వీరిది ఎవర్‌గ్రీన్ కాంబినేషన్. 'అల్లరి మొగుడు', 'గ్యాంగ్ లీడర్', 'అందాల రాక్షసి', 'అల్లరి ప్రియుడు', 'సమరసింహారెడ్డి' వంటివి వీరు నటించిన పలు విజయవంతమైన చిత్రాలు. కాగా, కోట శ్రీనివాసరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బాబూ మోహన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'కోటన్న లేడంటే నమ్మలేకపోతున్నా..' అంటూ భోరున విలపించారు.

ఇద్దరూ కలసి వందకు పైగా



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్ కలసి వందకు పైగా సినిమాల్లో నటించారు. 'మామగారు' సినిమాలో బాబూ మోహన్‌ను కోట శ్రీనివాసరావు వెనుక నుంచి తన్నే సన్నివేశాలు ప్రేక్షకుల మదిలో చిరకాలం గుర్తుండిపోతాయి. తన చేతుల్లో బాబూ మోహన్ ఎక్కువ దెబ్బలు తినేవాడని అందరూ అనుకుంటారని కానీ, తాను అలా టచ్ చేస్తే వెళ్లిపడిపోయేవాడని కోట ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కోట- బాబూ మోహన్ కాంబినేషన్ తమ చిత్రాల్లో ఉండాలని హీరోలు డిమాండ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి.

ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ సినిమా.. వివాదం



ఎన్నో సినిమాల్లో విలక్షణ పాత్రలతో ఆకట్టుకున్నారు కోట శ్రీనివాసరావు. అయితే ఓ సినిమాలోని పాత్రతో ఆయనను వివాదాలు చుట్టుముట్టాయి. అది ఆయన కెరీర్ తొలినాళ్లలో చేసిన 'మండలాధీశుడు'. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమా సమయంలో జరిగిన పరిణామాలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు కోట శ్రీనివాసరావు. 'నా పిలుపే ప్రభంజనం' అనే సినిమాలో నేను ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ చెప్పాను. అది ప్రేక్షకులకు నచ్చింది. ఈ సినిమా చూసి నాకు 'మండలాధీశుడు'లో అవకాశం ఇచ్చారు దర్శకుడు ప్రభాకర్ రెడ్డి. అది ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ చేసే పాత్ర. మొదట నేను చేయననే చెప్పాను. రామారావు అప్పటి ముఖ్యమంత్రి కాబట్టి ఒకవేళ పాత్ర క్లిక్ అయితే మంచి అవకాశాలొస్తాయి అనే ఉద్దేశంతో అంగీకరించాను. ఆ సినిమా చూస్తే ఎక్కడా ఎన్టీఆర్‌ను విమర్శించినట్లు ఉండదు. ఎన్టీఆర్‌కు జీవితంలో ఎదురైన సంఘటనలు, ఇతరులతో ఆయన వ్యవహరించే తీరు మాత్రమే ఇందులో ఉంటుంది. కానీ ఈ సినిమా విడుదలయ్యాక ఓ ఏడాది పాటు కష్టాలు నన్ను వెంటాడాయి. విజయవాడలో ఎన్టీఆర్ అభిమానులు నాపై దాడి చేయడం ఎంతో బాధించింది. ఆ తర్వాత కొన్నాళ్లకు 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమా సమయంలో డబ్బింగ్ కోసం ఎన్టీఆర్ చెన్నై వచ్చారు. అప్పుడు ఆయన్ను కలవొద్దని చాలా మంది హెచ్చరించారు. కానీ నేను వెళ్లి ఆయన్ని పలకరించా. ఆయన నన్ను చూసి 'మీరు గొప్ప నటుడని విన్నా బ్రదర్. మీరెన్నో గొప్ప పాత్రలు చేయాలి' అని ప్రోత్సహించారు. వెంటనే ఆయన కాళ్లపై పడిపోయా. ఆ తర్వాత బాలకృష్ణతో 'రౌడీ ఇన్‌స్పెక్టర్' సినిమాలో అవకాశం దక్కింది. నేను నటించడానికి బాలకృష్ణ కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దాంతో 'మండలాధీశుడు'తో ఏర్పడిన వివాదం సమసిపోయింది' అని తెలిపారు.

విజయం | భారత్ లక్ష్యం 193 | ప్రస్తుతం 58/4

అటూ.. ఇటూ

లార్డ్స్ మైదానంలో ఉత్కంఠ పతాక స్థాయికి చేరింది. ఒక్కో బంతికి ఏం జరుగుతుందోనని ఊపిరి బిగపట్టి చూడాల్సిన పరిస్థితి.. భారత బౌలర్ల ప్రతాపానికి ఆతిథ్య ఇంగ్లండ్‌ను 200లోపే కట్టడి చేశామనే ఆనందం క్రమేపీ ఆవిరవుతోంది. ఎందుకంటే.. ఛేదనలో గిల్ సేన కనీసం 60 పరుగులైనా చేయకముందే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇక చివరి రోజు సాధించాల్సిన 135 పరుగులే ఇప్పుడు కొండంత లక్ష్యంగా కనిపిస్తోంది. ఇక భారమంతా రాహుల్, పంత్‌లపైనే..

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 192
- స్పిన్నర్ సుందర్‌కు నాలుగు వికెట్లు


వాషింగ్టన్ సుందర్ (4/ 22)

లండన్: లార్డ్స్ మైదానంలో బ్యాటింగ్ అంత సులువు కాదని నాలుగో రోజూ నిరూపితమైంది. ఇంగ్లండ్ బ్యాటర్లు తడబడిన మాదిరే.. టీమిండియా కూడా అదే బాటన నడుస్తోంది. పరుగులు సాధించడం కష్టంగా మారిన ఈ పిచ్‌పై భారత్ 193 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ పేసర్ కార్స్ (2/11) ధాటికి ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ 17.4 ఓవర్లలో 4 వికెట్లకు 58 పరుగులు చేసింది. రాహుల్ (33 బ్యాటింగ్) క్రీజులో ఉండగా.. జట్టు ఇంకా 135 పరుగులు వెనుకంజలో ఉంది. దీంతో చివరి రోజు పంత్, నితీశ్, జడేజాల ఆటపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. స్టోక్స్, ఆర్చర్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులకు ఆలౌటైంది. రూట్ (40), స్టోక్స్ (33) రాణించారు. స్పిన్నర్ సుందర్‌కు నాలుగు.. బుమ్రా, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

పేసర్ల తడాఖా: 2 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు భారత పేసర్లు పరీక్ష పెట్టారు. పిచ్‌పై అనూహ్య బౌన్స్‌ను ఉపయోగించుకుంటూ కట్టడి చేశారు. దీంతో తొలి గంటలోనే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా నర్సరీ ఎండ్ నుంచి పేసర్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి డకెట్ (12), పోప్ (4)ల పనిబట్టాడు. సెషన్ ఐదో ఓవర్‌లోనే తను డకెట్‌ను అవుట్ చేయగా.. కాసేపటికి పోప్‌ను ఎల్బీగా వెనక్కిపంపాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. సిరాజ్ ఒత్తిడి మేరకు గిల్ రివ్యూ కోరాడు. రీప్లే పరిశీలించిన థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రటించాడు. ఇక చక్కగా కుదురుకున్న ఓపెనర్ క్రాలే (22)ను నితీశ్ వెనక్కిపంపాడు. అయితే 50/3 స్కోరుతో కష్టాల్లో పడిన వేళ రూట్‌కు జత కలిసిన బ్రూక్ ఎదురుదాడికి దిగాడు. ఆకాశ్ ఓవర్‌లో తను 4,4,6తో 15 రన్స్ రాబట్టాడు. అయితే ఆకాశ్ ఫుల్ లెంగ్త్ డెలివరీని స్వీప్ షాట్ ఆడి బ్రూక్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత మూడు ఓవర్లకే జట్టు 98/4 స్కోరుతో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

సుందర్ మ్యాజిక్: రెండో సెషన్‌లో రూట్-స్టోక్స్ జోడీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. పేసర్లు ఒత్తిడి పెంచినా వికెట్ తీయలేకపోయారు. దీంతో ఇద్దరూ క్రీజులో కుదురుకున్నారు. కెప్టెన్ గిల్ ఎట్టకేలకు 37వ ఓవర్ నుంచి స్పిన్నర్లను బరిలోకి దించాడు. సుందర్ పాత బంతితో మ్యాజిక్ చేస్తూ అత్యంత కీలకంగా మారిన ఈ జోడీకి బ్రేక్ వేశాడు. రూట్ స్వీప్ షాట్ ప్రయత్నంలో బౌల్డ్ కావడంతో ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. కాసేపటికే స్మిత్ (8)ను సైతం సుందర్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ ఈ సెషన్‌లో 77 పరుగులు చేయగలిగింది. ఇక ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ ఒక్కసారిగా తడబడింది. సుందర్ ఓవర్‌లో స్వీప్‌కు వెళ్లి స్టోక్స్ వెనుదిరిగాడు. ఇక బుమ్రా తన వరుస ఓవర్లలో కార్స్ (1), వోక్స్ (10)లను బౌల్డ్ చేయగా.. సుందర్ ఆఖరి వికెట్‌ను తీసి ప్రత్యర్థిని 200లోపే కట్టడి చేశాడు.

తడబాటుతో ఆరంభం: లక్ష్య ఛేదనలో భారత్ ఇన్నింగ్స్ సాఫీగా ఏమీ సాగలేదు. రెండో ఓవర్‌లోనే జైస్వాల్‌ను పేసర్ ఆర్చర్ డకౌట్ చేశాడు. ఈ దశలో రాహుల్‌కు జతగా కరుణ్ కాసేపు క్రీజులో నిలిచాడు. అటు రాహుల్ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరు పెంచాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం సాగింది. పేసర్ కార్స్ తన వరుస ఓవర్లలో కరుణ్, గిల్ (6) వికెట్లను తీసి భారత్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. ఇక సెషన్ ఆఖరి ఓవర్‌లో ఆకాశ్ (1)ను బౌల్డ్ చేసిన స్టోక్స్ గట్టి ఝలకే ఇచ్చాడు.



సిరాజ్‌కు జరిమానా తప్పదా?

ఆదివారం తొలి సెషన్ ఆరంభంలో పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో ఇంగ్లండ్ ఓపెనర్ డకెట్ వెనుదిరిగాడు. అయితే ఈ వికెట్ తీసిన ఆనందంలో పేసర్ సిరాజ్ దూకుడుగా వ్యవహరించాడు. గట్టిగా అరుచుకుంటూ డకెట్ మొహం దగ్గరి దాకా వచ్చి మరీ ఆగ్రహంగా చూస్తూ.. అతడి భుజాన్ని ఢీకొడుతూ వెళ్లాడు. అయితే ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధన 2.5 ప్రకారం.. సిరాజ్ ప్రవర్తన రెచ్చగొట్టే విధంగా ఉండడంతో మ్యాచ్ ఫీజులో కోత విధించే అవకాశం ఉంది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387;
భారత్ తొలి ఇన్నింగ్స్: 387;
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) జైస్వాల్ (బి) నితీశ్ 22; డకెట్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 12; పోప్ (ఎల్బీ) సిరాజ్ 4; రూట్ (బి) సుందర్ 40; బ్రూక్ (బి) ఆకాశ్ 23; స్టోక్స్ (బి) సుందర్ 33; స్మిత్ (బి) సుందర్ 8; వోక్స్ (బి) బుమ్రా 10; కార్స్ (బి) బుమ్రా 1; ఆర్చర్ (నాటౌట్) 5; బషీర్ (బి) సుందర్ 2; **ఎక్స్‌ట్రాలు: 32; మొత్తం: 62.1 ఓవర్లలో 192 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-22, 2-42, 3-50, 4-87, 5-154, 6-164, 7-181, 8-182, 9-185, 10-192; **బౌలింగ్:** బుమ్రా 16-3-38-2; సిరాజ్ 13-2-31-2; నితీశ్ 5-1-20-1; ఆకాశ్ 8-2-30-1; జడేజా 8-1-20-0; సుందర్ 12.1-2-22-4.
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (బ్యాటింగ్) 33; కరుణ్ (ఎల్బీ) కార్స్ 14; గిల్ (ఎల్బీ) కార్స్ 6; ఆకాశ్ (బి) స్టోక్స్ 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.4 ఓవర్లలో 58/4. వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58; **బౌలింగ్:** వోక్స్ 5-2-11-0; ఆర్చర్ 4-0-18-1; స్టోక్స్ 4.4-0-15-1; కార్స్ 4-1-11-2.

సినర్ కొత్త చరిత్ర

- వింబుల్డన్ నెగ్గిన తొలి ఇటాలియన్
- ఫైనల్లో అల్కారజ్ జోరుకు బ్రేక్





లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్‌ను ఓడించిన టాప్ సీడ్ యానిక్ సినర్.. తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినర్ 4-6, 6-4, 6-4, 6-4తో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్)పై సునాయాసంగా నెగ్గాడు. దీంతో హ్యాట్రిక్ టైటిల్ నెగ్గాలన్న అల్కారజ్ స్వప్నం చెదరగా.. 148 ఏళ్ల టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన తొలి ఇటాలియన్‌గా సినర్ రికార్డు సృష్టించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కారజ్ చేతిలో ఓడిన సినర్.. గ్రాస్ కోర్ట్‌లో గట్టిగా బదులు తీర్చుకొన్నాడు. మూడు గంటలకుపైగా సాగిన పోరులో అల్కారజ్ తొలి సెట్‌లో నెగ్గినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లు గెలిచిన సినర్ టైటిల్‌ను దక్కించుకొన్నాడు. మొదటి సెట్ ఐదో గేమ్‌లోనే అల్కారజ్ సర్వీస్‌ని బ్రేక్ చేసిన సినర్ 4-2తో ముందంజ వేశాడు. అయితే, ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన అల్కారజ్ 4-4తో సమం చేశాడు. ఇదే జోరులో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. అయితే, రెండో సెట్‌లో పుంజుకొన్న సినర్ 2-0తో పైచేయి సాధించాడు. మరోవైపు పట్టువదలకుండా పోరాడిన అల్కారజ్ 4-5తో నిలిచాడు. కానీ, చివరి గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న సినర్..సెట్ నెగ్గి1-1తో స్కోరు సమం చేశాడు. ఇక్కడి నుంచి కార్లోస్ ఆట గతితప్పింది. మూడో సెట్‌లో ఇద్దరూ తమతమ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ సాగడంతో 4-4తో సమంగా నిలిచారు. అయితే, 9వ గేమ్‌లో అల్కారజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్ 6-4తో మూడో సెట్ గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఇక, నాలుగో సెట్ మూడో గేమ్‌లోనే బ్రేక్ పాయింట్ సాధించిన సినర్ 2-1తో పైచేయిగా నిలిచాడు. కానీ, 8వ గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశాన్ని అల్కారజ్ చేజార్చుకోవడంతో.. సినర్ 5-3తో టైటిల్‌కు చేరువయ్యాడు. 10వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొన్న యానిక్ విజేతగా నిలిచాడు. దీంతో వరుసగా 24 మ్యాచ్‌లు గెలిచిన అల్కారజ్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది.

విడిపోయిన సైనా, కశ్యప్

సోషల్ మీడియాలో నెహ్వాల్ ప్రకటన

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. తన భర్త పారుపల్లి కశ్యప్ నుంచి విడిపోయినట్టు ప్రకటించింది. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'జీవితం ఒక్కోసారి మనల్ని భిన్నమైన మార్గాల వైపు నడిపిస్తుంటుంది. ఎంతో ఆలోచించి, చర్చించుకొన్న తర్వాత ఇద్దరం కలసి ఉండలేమని నిర్ణయించుకొన్నట్టు' సైనా రాసింది. పరస్పర అంగీకారంతోనే విడిపోయామని.. తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని కోరింది. షట్లర్లయిన సైనా, కశ్యప్‌లు 2018లో ప్రేమ వివాహం చేసుకొన్నారు. గోపీచంద్ అకాడమీలోనే వీరిద్దరూ శిక్షణ పొందారు. నెహ్వాల్ ఒలింపిక్ పతకంతో పాటు టాప్ ర్యాంక్‌కు చేరుకోగా.. కశ్యప్ 2014లో కామన్వెల్త్ స్వర్ణం సాధించాడు.



1

టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడుగురిని బౌల్డ్ చేయడం.. అలాగే ఓ టెస్టు మ్యాచ్‌లో ఎక్కువ మంది (12) బ్యాటర్లను బౌల్డ్ చేయడం కూడా భారత్‌కిదే తొలిసారి.

ఇంగ్లండ్‌లో జరిగిన టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (607) సాధించిన బ్యాటర్‌గా గిల్. ద్రవిడ్ (2002లో 602 రన్స్)ను అధిగమించాడు.

ఆస్ట్రేలియా 225 ఆలౌట్

కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో శనివారం ప్రారంభమైన మూడో టెస్ట్ (డే/నైట్) తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 225 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా ఓ దశలో 157/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో వెస్టిండీస్ బౌలర్లు విజృంభించడంతో మిగిలిన ఏడు వికెట్లను కేవలం 68 పరుగులకే కోల్పోయింది. స్టీవెన్ స్మిత్ (48), గ్రీన్ (46) మాత్రమే రాణించారు. షామర్ జోసెఫ్ నాలుగు, జస్టిన్ గ్రీవ్స్, జేడెన్ సీల్స్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య జట్టు తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. 100వ టెస్ట్ ఆడుతున్న ఆసీస్ పేసర్ స్టార్క్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

ఇంగ్లండ్ ఉత్కంఠ విజయం

- ఐదో టీ20లో గెలుపు
- సిరీస్ 3-2తో భారత్ కైవసం



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌పై తొలిసారి టీ20 సిరీస్‌లో విజయం సాధించిన భారత మహిళల జట్టు.. ఆఖరి మ్యాచ్‌లో పోరాడి ఓడింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఐదో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. కానీ, 3-2తో టీ20 సిరీస్‌ను భారత్ సొంతం చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (75) మినహా అంతా విఫలమయ్యారు. చార్లీ డీన్ 3, ఎకెల్‌స్టోన్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ ఓవర్లన్నీ ఆడి 168/5 స్కోరు చేసి గెలిచింది. దీప్తి శర్మ, అరుంధతి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరి 3 బంతుల్లో 5 పరుగులు అవసరమవగా.. ఎకెల్‌స్టోన్ (4 నాటౌట్) జట్టును గెలిపించింది. తెలుగమ్మాయి **శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'**గా నిలిచింది.

బిజినెస్

25400 పైన బుల్లిష్

(జూలై 14-18 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25150 (-311)

నిఫ్టీ గత వారం 25489-25129 పాయింట్ల మధ్యన కదలాడి 311 పాయింట్ల నష్టంతో 25150 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25361, 25416, 25412, 25152 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25400
బ్రేక్‌డౌన్ స్థాయి: 24800
నిరోధ స్థాయిలు: 25250, 25350, 25450 (25150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24950, 24850, 24750 (25050 దిగువన బేరిష్)

ఆస్ట్రో ట్రెండ్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	493
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	88	విజయవాడ	97
వరంగల్	88	గుంటూరు	102
కరీంనగర్	88	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	88	చిత్తూరు	100
కర్నూలు	88	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	97		

జీతాల పెంపుపై టీసీఎస్‌లో అనిశ్చితి

లాభదాయకతే ముఖ్యమన్న సీఎఫ్‌ఓ



ముంబై: జీతాల పెంపుపై ఐటీ దిగ్గజం టీసీఎస్ నోరు మెదపడం లేదు. జీతాల పెంపు ముఖ్యమైన విషయమే అయినా, లాభాలతో కూడిన అభివృద్ధి అంతకంటే ముఖ్యమని కంపెనీ సీఎఫ్ఓ సమీర్ సెక్సారియా తేల్చి చెప్పారు. దీంతో టీసీఎస్‌లో జీతాల పెంపు ఎప్పుడు జరుగుతుందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సాధారణంగా టీసీఎస్‌తో సహా ప్రధాన ఐటీ కంపెనీలు ఏటా ఏప్రిల్ నుంచి జీతాల పెంపు అమలు చేస్తాయి. అయితే ఈ సంవత్సరం ఏ ప్రధాన ఐటీ కంపెనీ కూడా జీతాల పెంపు గురించి ప్రకటించలేదు.

ఎందుకంటే?

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో టీసీఎస్ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కేవలం ఆరు శాతం పెరిగింది. మార్చి త్రైమాసికం సైతం కంపెనీకి పెద్దగా కలిసి రాలేదు. దీంతో ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సిన వార్షిక జీతాల పెంపు పక్కన పడింది. 'టీసీఎస్‌లో జీతాలు పెంపు అరుదుగా మాత్రమే వాయిదా పడుతుంది, తిరిగి జీతాల పెంపునకు వెళ్లడమే నా ప్రాధాన్యత' అని సీఎఫ్ఓ చెప్పడం విశేషం. దీంతో టీసీఎస్‌లో జీతాల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

లాభాలకూ గండి: ప్రస్తుతం దేశీయ ఐటీ కంపెనీలు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలకు తోడు, ట్రంప్ సుంకాల పోటు పరిశ్రమను భయపెడుతోంది. ప్రధాన మార్కెట్లయిన అమెరికా, ఐరోపా నుంచి కొత్త ప్రాజెక్టులు పెద్దగా రావడం లేదు. వచ్చినా అరకొర ప్రాజెక్టులే. దీనికి తోడు చాలినంత ఏఐ నైపుణ్యాలున్న నిపుణులు దొరక్క, అనేక కంపెనీలు ఉన్న ప్రాజెక్టులనే సక్రమంగా పూర్తి చేయలేకపోతున్నాయి. టీసీఎస్‌ని కూడా ఇవే సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో జూన్ త్రైమాసికంలో 24.5 శాతానికి పడిపోయిన స్థూల లాభాన్ని మళ్లీ 26 నుంచి 28 శాతానికి పెంచడమే తమ ముందున్న ప్రాధాన్యత అని సెక్సారియా స్పష్టం చేశారు.

డిమాండ్‌ను బట్టే నియామకాలు

డిమాండ్ పెరిగితే తప్ప నియామకాలు పెంచే యోచన లేదని కూడా టీసీఎస్ సీఎఫ్ఓ స్పష్టం చేశారు. లేకపోతే కంపెనీ లాభాలు మరింతగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. కొత్త ప్రాజెక్టులు పెద్దగా లేకపోవడంతో ఉన్న ఉద్యోగులనే సరిగా ఉపయోగించుకోలేకపోతున్నట్టు చెప్పారు. ఉద్యోగుల వినియోగం తమ చేతుల్లో ఉన్నా, డిమాండ్ మాత్రం తమ చేతుల్లో లేదన్నారు. ఉన్న ఉద్యోగులను సక్రమంగా వినియోగించుకోవడం, డిమాండ్ పుంజుకోవడం రెండూ తమకు ముఖ్యమేనని సెక్సారియా స్పష్టం చేశారు.

2030 నాటికి రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు

- పునరుత్పాదక, హరిత ఇంధనంపై దృష్టి
- ఎన్ఎల్‌సీ ఇండియా సీఎండీ



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎల్‌సీ ఇండియా పెద్ద ఎత్తున వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందుకోసం 2030 నాటికి రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. కంపెనీ ఎండీ, సీఈఓ మోటుపల్లి ప్రసన్న కుమార్ పీటీఐ వీడియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. దీంతో తమ స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుత 6,700 మెగావాట్ల నుంచి 2030 నాటికి 20,000 మెగావాట్లకు చేరుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కంపెనీ ఖర్చు చేసే రూ.1.25 లక్షల కోట్లలో రూ.65,000 కోట్లు పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై ఖర్చు చేస్తామన్నారు. మిగతా రూ.60,000 కోట్లలో రూ.45,000 కోట్లు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం, మిగతా రూ.15,000 కోట్లు గనుల అభివృద్ధి కోసం ఖర్చు చేయబోతున్నట్టు ఆయన చెప్పారు. పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై చేసే రూ.65,000 కోట్ల ఖర్చులో రూ.15,000 కోట్లు బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

ఇతర ముఖ్యాంశాలు

- తెలంగాణకు 200 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా ఒప్పందంపై సంతకాలు.
- అంతర్గత వనరులు, దేశ, విదేశీ రుణాలు, ఐపీఓ ద్వారా విస్తరణ ప్రాజెక్టులకు నిధుల సమీకరణ.
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే అనుబధ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యూవబుల్స్ లిమిటెడ్ (ఎన్ఐఆర్ఎల్) ఐపీఓ.
- ఎన్ఐఆర్ఎల్ ప్రాజెక్టుల్లో రూ.3,720 కోట్ల పెట్టుబడులకు సూత్రప్రాయ ఆమోదం
- మాలిలో లిథియం ఖనిజ ప్రాజెక్టు కోసం రష్యా కంపెనీలో ఈక్విటీ వాటా
- కాంగోలో కాపర్, కోబాల్ట్ ఖనిజ గనుల కోసం చర్చలు

భారత్-రష్యా చమురు వాణిజ్యంలో భారీ పెరుగుదల

11 నెలల గరిష్ఠ స్థాయికి దిగుమతులు

న్యూఢిల్లీ: భారత రిఫైనరీలు పశ్చిమాసియాపై ఆధారనీయతను తగ్గించుకుంటూ రష్యా నుంచి ముడిచమురు దిగుమతులను మరింత పెంచుతున్నాయి. చమురు నిల్వలను పెంచేందుకు అవి చురుగ్గా కొనుగోళ్లకు దిగిన నేపథ్యంలో జూన్ నెలలో రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు గత 11 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. రోజుకు 20.8 లక్షల బ్యారెళ్ల సరఫరాతో రష్యా మళ్లీ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. అంతర్జాతీయ కమోడిటీ సంస్థ కెప్లర్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్‌లో దేశానికి మొత్తం ముడిచమురు దిగుమతులు 6 శాతం తగ్గినప్పటికీ, రష్యా నుంచి వచ్చే చమురు పరిమాణం మాత్రం నెలవారీగా 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2024 జూలై తర్వాత అత్యధిక స్థాయి కావడం గమనార్హం.

థర్మల్ ప్లాంట్లకు ఊరట

న్యూఢిల్లీ: బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ స్వల్ప ఊరట ఇచ్చింది. ఈ ప్లాంట్ల నుంచి వెలువడే వాయువుల్లో గంధకం (సల్ఫర్) శాతాన్ని నియంత్రించేందుకు ఉద్దేశించిన ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) యంత్ర పరికరాల ఏర్పాటు నుంచి కొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు మినహాయింపు ఇచ్చింది. పది లక్షలకు మించి జనాభా ఉన్న నగరాలకు 10 కిలోమీటర్ల పరిధిలోని థర్మల్ ప్లాంట్లకు మాత్రమే ఈ నిబంధనను పరిమితం చేసింది. దీని వల్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు 25 పైసల నుంచి 30 పైసల వరకు తగ్గుతాయని తెలిపింది. దీనికి సంబంధించి ఆదివారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.

25000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌లో కొనసాగుతూ వారం మొత్తానికి 300 పాయింట్ల పైగా నష్టంతో 25,150 వద్ద ముగిసింది. ముందువారంలో 25,000 వద్ద ఏర్పడిన బ్రేకౌట్‌కు ఇది పుల్‌బ్యాక్ రియాక్షన్‌గా భావించాలి. ఫలితంగా మరోసారి 25,000 సమీపంలోకి వచ్చింది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్ క్యాప్-100 సూచీలు కూడా గరిష్ఠ స్థాయిల నుంచి రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉన్నప్పటికీ భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధ స్థాయి 25,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,550. ఇదే స్వల్పకాలిక నిరోధ స్థాయి కావడం వల్ల స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: గత రెండు వారాల్లో మైనర్ కరెక్షన్ సాధిస్తూ వచ్చిన ఈ సూచీ గత వారం 277 పాయింట్ల నష్టంతో 56,750 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 57,300. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 57,650. బలహీనపడినా ప్రస్తుత మద్దతు స్థాయి 56,600 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 56,000.

పాటర్న్: నిఫ్టీకి 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మార్కెట్ 25 డీఎంఏ కన్నా దిగువకు వచ్చి 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, గురువారాల్లో మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25230, 25300
మద్దతు	25000, 24940

పసిడి ధర మరింత ముందుకే

త్వరలోనే మళ్లీ రూ.లక్షకు

ముంబై: పసిడి ధర ఈ వారం మరింత ముందుకు కదిలే సూచనలు కనిపిస్తున్నట్టు విశ్లేషకుల అంచనా. గత వారం ప్రారంభంలో ఎంసీఎక్స్‌లో రూ.94,951 వద్ద ప్రారంభమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర, వారాంతానికి రూ.97,830 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 2.8 శాతం పెరిగింది. గత వారం అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఆగస్టులో డెలివరీ ఇచ్చే ఔన్స్ బంగారం ధర ఒక దశలో 3,364 డాలర్లకు చేరింది. ప్రస్తుతం స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర 3,356.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇది త్వరలోనే 3,500 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఏంజెల్ వన్ బ్రోకరేజి సంస్థ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ప్రతమేస్ మాల్యా అంచనా. ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల పసిడి ధర వచ్చే కొద్ది రోజుల్లో రూ.లక్షకు చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

మెర్సిడెస్ కార్ల ధర మరోసారి పెంపు

న్యూఢిల్లీ: మెర్సిడెస్ బెంజ్ ఇండియా మరోసారి కార్ల ధరలు పెంచనుంది. సెప్టెంబర్‌లో తమ కార్ల ధరలను 1 నుంచి 1.5 శాతం వరకు పెంచే యోచనలో ఉన్నట్టు కంపెనీ తెలిపింది. యూరోతో పోలిస్తే రూపాయి బలహీనత నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు.

11 సంవత్సరాల్లో 474% పెరిగిన ఐటీ రిఫండ్లు

న్యూఢిల్లీ: గతంతో పోల్చితే ఆదాయపు పన్ను రిఫండ్లలో వేగం పెరిగింది. గత 11 సంవత్సరాల కాలంలో ఐటీ రిఫండ్లు 474% పెరిగి 2024-25 సంవత్సరం నాటికి రూ.4.77 లక్షల కోట్లకు చేరాయి. ఇదే కాలంలో పన్ను వసూళ్లలో ఏర్పడిన వృద్ధి 274 శాతంతో పోల్చితే రిఫండ్లలో వృద్ధి గణనీయంగా ఉంది. ఐటీ రిఫండ్ల కాల వ్యవధి 2013 సంవత్సరంలో 93 రోజులుండగా 2024 నాటికి 17 రోజులకు తగ్గింది. పన్ను యంత్రాంగంలో సమర్థత పెరగడంతో పాటు రిటర్న్‌ల ఫైలింగ్ నుంచి ఐటీఆర్‌ల ప్రాసెసింగ్ వరకు డిజిటల్ మౌలిక వసతుల వినియోగం పెరగడం రిఫండ్లలో గణనీయమైన వృద్ధికి కారణమని ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా ముందుగానే నింపిన రిటర్న్‌లు అందుబాటులోకి తేవడం, రిఫండ్ ప్రాసెసింగ్‌లో ఆటోమేషన్, రియల్ టైమ్ టీడీఎస్ సర్దుబాట్లు ఈ మెరుగుదలకు దోహదపడ్డాయి.





కోట శ్రీనివాసరావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

కోట తెరాభినిష్క్రమణం

(మొదటిపేజీ తరువాయి)

పరిమితమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున.. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు! కోట శ్రీనివాసరావుకు భార్య రుక్మిణి, కుమార్తెలు పావని, పల్లవి ఉన్నారు. ఆయన కుమారుడు కోట వెంకట ఆంజనేయ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో.. పెద్ద మనవడు శ్రీనివాస్.. అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫిలింనగర్‌లోని కోట నివాసం నుంచి అభిమానులు, కుటుంబసభ్యుల కన్నీటి వీడ్కోలు నడుమ అంతిమ యాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4.30 గంటల సమయంలో జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో సినీనటులు అలీ, కోట శంకరరావు, మాదాల రవితో పాటు సినీ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఒడిలో పెరిగి.. కళామతల్లి సేవలో ఎదిగి

కోట శ్రీనివాసరావు 1942 జూలై 10వ తేదీన.. కృష్ణా జిల్లా కంకిపాడులో సీతారామాంజనేయులు, సుశీల దంపతులకు జన్మించారు. కంకిపాడు పరిసర ప్రాంతాల ప్రజలకు సీతారామాంజనేయులు ఓ గొప్ప వైద్యుడిగా తెలుసు. ఆయనకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండవ కుమారుడు కోట శ్రీనివాసరావు. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో కోట చదువుకున్నారు. కళాశాలలో చదుకునే రోజుల్లోనే నాటకాలు వేసేవారు. అనంతరం కంకిపాడు బస్టాండ్ సమీపంలోని స్టేట్ బ్యాంకులో చేరి కొన్నాళ్లు ఉద్యోగం కూడా చేశారు. బ్యాంకు ఉద్యోగం చేస్తున్నా.. నటనపై ఆసక్తితో నాటకాలలో వేషాలు వేస్తూ ఉండేవారు. నిజానికి తాను కూడా తన తండ్రిలాగానే వైద్యుణ్ని కావాలనుకున్నానని.. కానీ, ప్రవేశ పరీక్షలో రెండు శాతం మార్కులు తక్కువగా రావడంతో ఆ అవకాశాన్ని కోల్పోయి, మామూలు గ్రాడ్యుయేట్‌ని అయ్యానని చెప్పేవారాయన. ఈ క్రమంలోనే.. ఒకసారి హైదరాబాద్‌లో ఆయన తన బృందంతో 'ప్రాణం ఖరీదు' నాటిక వేస్తే.. ప్రముఖ దర్శకుడు క్రాంతి కుమార్ చూసి దాన్ని సినిమాగా తీయాలనుకున్నారు. ఆ సినిమాలో రావుగోపాలరావు వేసిన పాత్ర.. స్టేజీ మీద కోట శ్రీనివాసరావే వేసేవారు. ఆ నాటిక స్ఫూర్తితో తీస్తున్న సినిమా కాబట్టి అందులోని పాత్రధారులందరికీ సినిమాలో కూడా చిన్నచిన్న పాత్రలు ఇవ్వాలని క్రాంతి కుమార్ అనుకున్నారు. అలా కోట ఆ సినిమాలో నాలుగైదు సీన్లున్న చిన్న పాత్ర చేశారు. ఆ తర్వాత.. తెలంగాణ ప్రాంతంలో బడుగుల జీవితాలపై యండమూరి వీరేంద్రనాథ్ రాసిన 'కుక్క' అనే నాటికను నటుడు నారాయణరావు సినిమాగా తీశారు. అందులో కోట 'దొర' పాత్ర వేశారు. 1982లో.. 'మీరైతే ఏం చేస్తారు?' అనే నాటికలో కోట నటన చూసిన దర్శకుడు టి.కృష్ణ ఆయనకు 'వందేమాతరం' సినిమాలో ఒక పాత్ర ఇచ్చారు. అలా చిన్నా చితకా వేషాలు వేస్తున్న కోట శ్రీనివాసరావు సిసలైన సత్తాను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది.. 'ప్రతిఘటన' సినిమా. అందులో మినిస్టర్ కాశయ్యగా తెలంగాణ యాసలో అదరగొట్టిన కోట బలమైన ముద్ర వేశారు. కైకాల సత్యనారాయణ, రావుగోపాలరావు, గిరిబాబు, గొల్లపూడి వంటి మేటి విలన్లు ఉన్న రోజులు కావడంతో ఆయనకు పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు దొరికేవి కావు. అలా సాగిపోతున్న ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా వచ్చింది.. 'అహ నా పెళ్లంట' సినిమా. అందులో పిసినారి లక్ష్మీపతి పాత్రకు కోట శ్రీనివాసరావును దర్శకుడు జంధ్యాల ఏరికోరి ఎంచుకున్నారు. క్రమంగా.. అటు విలనీ, ఇటు కామెడీ.. మధ్యమధ్యలో కామెడీవిలనీ చేస్తూ కోట శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. ఒకటా రెండా.. వందలాది చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. ప్రతిఘటన హిందీ రీమేక్‌లో, సర్కార్ సినిమాలో అమితాబ్ బచ్చన్‌తో నటించి.. హిందీ ప్రేక్షకులకు కూడా ఆయన పరిచయమయ్యారు. 1999లో అనూహ్యంగా రాజకీయ రంగప్రవేశం చేసిన కోట.. బీజేపీ తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ప్రత్యర్థి ఐలాపురం వెంకయ్యపై 57వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. విజయవాడకు మొదటి ఫ్లైఓవర్‌గా నిలిచే అజిత్‌సింగ్ ఫ్లైఓవర్ నిర్మాణం ఆయన హయాంలోనే జరిగింది. 2004 తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చిరంజీవితోపాటే మొదలైన కోట సినీ కెరీర్.. ఆయన సోదరుడైన పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు'తో ముగియడం గమనార్హం.

తరలి వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు..

కోట శ్రీనివాస్ మరణంతో తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన్ను చివరిసారి చూసి నివాళులర్పించేందుకు తారాలోకమంతా ఆయన ఇంటికి తరలివచ్చింది. పలువురు రాజకీయ ప్రముఖులు కూడా ఆయన ఇంటికి చేరుకుని పుష్పాంజలి ఘటించారు. ప్రధాని నరేంద్ర మోదీ.. కోట శ్రీనివాసరావు మృతి పట్ల 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపారు. ఆయన తన అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని.. సామాజిక సేవలో కూడా ముందుండే వారని, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు కోట ఇంటికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. కోట మృతి పట్ల.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. కోట శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని.. ఎమ్మెల్యేగా ఆయన గొప్పగా ప్రజాసేవ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నటుడిగా, ఎమ్మెల్యేగా కోట తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్నారని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. కోట ఇక లేరన్న వార్త విని చాలా బాధపడ్డానని.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్.. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.



కోట శ్రీనివాసరావు అంతిమయాత్ర



పుత్రశోకం..

అలా చేస్తే దిష్టి పోయేదేమో!

వందలాది సినిమాల్లో నటించి ఎంతో ఖ్యాతి ఆర్జించిన కోట శ్రీనివాసరావును కొన్ని విషాదాలు వెంటాడాయి. ముఖ్యంగా కుమారుడు ప్రసాద్ మరణం ఆయన్ను బాగా కుంగదీసింది. కుమారుడి మృతిపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కోట భావోద్వేగానికి గురయ్యారు. "గాయం-2 సినిమాలో నేను, ప్రసాద్ కలిసి పనిచేశాం. ప్రసాద్‌కు అదే తొలి సినిమా. అందులో ప్రసాద్ చనిపోయే సన్నివేశం ఉంది. ఆ సీన్ తీయొద్దని, అది చూడడం నావల్ల కాదని చిత్ర బృందానికి చెప్పా. అది జగపతిబాబు అర్థం చేసుకుని నా డూప్‌తో ఆ సన్నివేశం తీయించారు. ఆ సన్నివేశం చిత్రీకరించిన నాలుగు రోజులకే ప్రసాద్ బైక్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆ సన్నివేశంలో నేనే నటించి ఉంటే దిష్టి పోయేదేమో. కళ్లముందు వాడే మెదులుతుంటాడు. నా రెండో కూతురికి ప్రమాదంలో కాలు పోయిందనే బాధ కూడా వెంటాడుతుంటుంది" అని కోట బాధపడ్డారు.

'కోట' జీవితంలో విశిష్ట ఘట్టం

కోట శ్రీనివాసరావు జీవితంలో విశిష్ట ఘట్టం 1994లో జరిగింది. దక్షిణ భారత చలనచిత్ర సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర సమాఖ్య మధ్య ఏర్పడిన వివాదంతో యావత్ సినీ పరిశ్రమ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో రెండు వర్గాల కార్మికుల సంక్షేమం కోసం కోట శ్రీనివాసరావు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ప్రముఖులంతా మద్దతు ఇచ్చారు. దీక్ష విరమణ రోజు చిరంజీవి శిబిరానికి రాగా.. ఆయన ఇచ్చిన నిమ్మరసం తాగేందుకు కోట ఒప్పుకోలేదు. రాజేంద్రప్రసాద్‌కు చెప్పి దీక్ష మొదలుపెట్టానని, ఆయన నిమ్మరసం ఇస్తే తాగి విరమిస్తానని చెప్పారు. చివరకు హీరోలంతా వచ్చి నిమ్మరసం తాగించి కోట దీక్ష విరమింపజేశారు. ఆ ఏడాది నవంబరు 30న హైదరాబాద్‌లో మొక్కుబడిగానైనా షూటింగ్‌లు ప్రారంభమయ్యాయంటే అందుకు కోట చేపట్టిన దీక్షే కారణం.

నందులు నడిచొచ్చాయి

కోట శ్రీనివాసరావు తన నట జీవితంలో తొమ్మిది సార్లు నంది అవార్డులు అందుకున్నారు. ప్రతిఘటన చిత్రంలోని కాశయ్య పాత్రకు తొలిసారిగా కోట స్పెషల్ జ్యూరీ నంది అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత గాయం(1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్(1996), గణేశ్(1998), చిన్న (2000), ఆ నలుగురు(2004), పృథ్వీనారాయణ(2002), పెళ్లయిన కొత్తలో(2006) చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలకు నందులు వరించాయి. ఇక, 2015లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం పొందారు.



నవ్వులు పూయించే హాస్యపు ఊట..

విలనిజానికి కేరాఫ్.. కోట



విషం చిమ్మే విలన్‌గా.. నవ్వులు పూయించే కమెడియన్‌గా.. ప్రధాన ప్రతినాయకుడి పక్కన ఉంటూనే గోతులు తవ్వే కామెడీ విలన్‌గా.. మంచి తండ్రిగా, తాతగా.. ఇలా ఎన్నో పాత్రలు చేశారు కోట! దాదాపు నాలుగున్నర దశాబ్దాల సినీ ప్రస్థానంలో.. 750 సినిమాల్లో నటించిన ఆయన కీర్తికిరీటంలో కలికితురాయిల్లాంటి పాత్రలు లెక్కకు మిక్కిలిగానే ఉన్నాయి. వాటిలోంచి కొన్ని మేలిముత్యాలను ఏరితే..

మంత్రి కాశయ్య (ప్రతిఘటన)

'ప్రాణం ఖరీదు' సినిమాతో 1978లోనే తెరంగేట్రం చేసినా.. చిన్నాచితకా పాత్రలతోనే నెట్టుకొస్తున్న కోట శ్రీనివాసరావును 'ప్రతిఘటన' సినిమా.. అందులో 'గుడిసెల కాశయ్య' వేషం.. ఓవర్‌నైట్ స్టార్‌ని చేసేశాయి! 'నమస్తే తమ్మీ.. దావత్‌కు సిద్ధం జెయ్'... 'మీ అమ్మలకి మీ అక్కలకి మీ నాన్నలకి అందరికీ పెడ్తాండా.. దండం'.. 'గీ దేశంలో దరిద్రమనేది పోయేటంతవరకూ ఈ నెత్తి మీద బొచ్చు మొల్చేటందుకు ఈల్లేదని పద్దినాలకొక్కసారి యాదగిరి గుట్ట పోతాండ.. గుండు కొట్టించుకుంటాండ..' అంటూ తెలంగాణ యాసలో చెప్పిన డైలాగులతో కోట తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశారు.

మినిస్టర్ సాంబశివుడు (గణేశ్)

విలనీలో కోట శ్రీనివాసరావు పతాకస్థాయి నటనను చూడాలంటే.. 'గణేశ్' సినిమా చూడాల్సిందే! హెల్త్ మినిస్టర్ సాంబశివుడుగా ఆ సినిమాలో ఆయన చేసిన నటన నభూతో. "తమ్మీ.. నేను 50 కోట్ల కుంబకోణం జేసిన. కాదంటలే. మరి నాకైతే చార్మినార్‌కున్నంత హిస్టరీ ఉంది. ఒక ముష్టోనికి కుప్పతొట్లో దొరికినానంట. గప్పటి సంది ముష్టోళ్లతో ముష్టెత్తిన. కుష్టోళ్లతో దుప్పట్లో పండిన. నా పెహలీ మర్డర్ ఎప్పుడు జేసినాననకున్నవ్? పద్నాలుగేళ్లకే.. బచ్చాగాణ్ని. అంటే చెడ్డీ మీద మర్డరన్నట్టు" అంటూ కోట చెప్పిన డైలాగులు ఇప్పటికీ చాలామందికి గుర్తే!

సెల్వర్ మణి (సర్కార్)

అప్పటిదాకా తెలుగువారికి మాత్రమే తెలిసిన కోట శ్రీనివాసరావు విలనీ విశ్వరూపం.. 2005లో వచ్చిన 'సర్కార్' సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులకూ బాగా పరిచయమైంది. 'సెల్వర్ మణి లైట్ మ్యాటర్స్ మే కామెడీ కర్తేహై.. సీరియస్ మ్యాటర్స్ మే మర్డర్' అంటూ తనదైన శైలిలో నవ్వుతూ హిందీ ప్రేక్షకులను అబ్బురపరిచారు. అంతే కాదు.. ఆ సినిమాలో తన సొంత గొంతుతో హిందీలో ఏకబిగిన డైలాగులు చెప్పి సత్తా చాటారు కోట.

కాంట్రాక్టర్ వెంకటరత్నం (శత్రువు)

'నెక్స్ట్ ట్రిప్పు మన్దేరా బాబూ'.. 'సెప్పవయ్యా బాబూ'.. 'ఫోన్ మోగుతోందిరా బాబూ'... 'ఇది కల కదరా బాబూ'.. అంటూ ఒక టిపికల్ సాగదీతతో మాట్లాడుతూ 'శత్రువు' సినిమాలో కాంట్రాక్టర్ వెంకటరత్నం పాత్రలో కోట పండించిన విలనీ విలక్షణం. ఈ సినిమాలో కోటకున్న మరో ఊత పదం.. 'థ్యాంక్స్'! అప్పట్లో అది చాలామందికి ఊతపదంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

గురునారాయణ (గాయం)

కోట శ్రీనివాసరావు పేరు చెప్పగానే చాలామందికి గుర్తొచ్చే పాత్రల్లో ఒకటి.. 'గాయం' సినిమాలో మంత్రి గురునారాయణ పాత్ర. ముఠా తగాదాలు, హత్యల గురించి ఒక జర్నలిస్టు ప్రశ్నిస్తే.. 'గద్దైతే నేను ఖండిస్తన్న.. ఏం యాక్షన్ తీసుకుంటం? పోలీసోళ్లకు జెప్పినం.. ఏంరా నువ్వే గద డీఎస్పీతో ఫోన్ల మాట్లాడినవ్..' అంటూ ఆయన చెప్పిన డైలాగ్ ఇప్పటికీ పాపులర్.

అక్క (రెండిళ్ల పూజారి)

'గా పాటేందిరా.. ఆ.. చందమామ రావే జాబిల్లి రావే.. కత్తి పట్కరావే.. ఖతం జేసి పోవే' అంటూ హిజ్రా పాత్రలో 'రెండిళ్ల పూజారి' సినిమాలో కోట మెత్తటి కత్తిలా కనిస్తారు! పైకి సుకుమారంగా కనిపిస్తూనే.. కళ్లల్లో మాత్రం క్రౌర్యాన్ని చూపించిన తీరు అద్భుతం.

మాచిరాజు (శివ)

ఎలాంటి కామెడీ లేకుండా.. పూర్తిస్థాయిలో సీరియస్ విలన్‌గా కోట నటించిన సినిమాల్లో ప్రముఖమైనది.. 'శివ'. అందులో 'మాచిరాజు' పాత్రలో ఆయన కళ్లతోనే కపటత్వాన్ని పలికించిన తీరు ఔత్సాహిక నటీనటులకో పాఠంలాంటిది.





జంబలకిడి పంబ:

కోట శ్రీనివాసరావు కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో ఒకటి.. 'జంబ లకిడి పంబ' సినిమాలో ఆయన చేసిన హీరోయిన్ తండ్రి పాత్ర. అణిగిమణిగి ఉండే భార్యను, కొడుకును అదిలిస్తూ బెదిరించే పాత్రలో తొలి సగంలోనూ.. మహిళలా మారి, భర్తగా మారిన భార్యకు అణిగిమణిగి ఉండే భార్య లాంటి భర్త పాత్రలో మలిసగంలోనూ.. కోట చెలరేగిపోయారు. 'ఒత్తిలో పత్తి.. గిలకలో చిలక' అంటూ ఆ పాత్రకు ఈవీవీ ఒక టిపికల్ మేనరిజాన్ని పెట్టారు.

బంగారం.. సింగారం (వినోదం)

ద్విపాత్రాభినయం సినిమాల్లో కొత్త కాన్సెప్ట్ కాదుగానీ.. లేని సోదరుడి పాత్రను ఉన్నట్టుగా 'కల'గంటూ.. ఆ పాత్రలో కూడా తనే జీవించే ఓ అమాయక/అహంభావి తండ్రి పాత్ర మాత్రం కొత్తే. 'వినోదం' సినిమాలో కోట ఆ పాత్రలో నటించారనడం కంటే జీవించారనడం కరెక్ట్. ధనవంతుడైన బంగారం పాత్రలో.. కార్మిక నాయకుడు సింగారం పాత్రలో విజృంభించారాయన.

లక్ష్మీపతి (అహ నా పెళ్లంట):

తెలుగు సినిమా చరిత్ర మొదలైనప్పటి నుంచీ వెండితెరపై ఎన్నో పిసినారి పాత్రలు ఉన్నాయి గానీ.. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పీనాసి పాత్రలు మాత్రం రెండే! వాటిలో ఒకటి.. 'అహనా పెళ్లంట' సినిమాలో 'లక్ష్మీపతి' పాత్ర. రెండోది 'ఆమె' సినిమాలో పిసినారి శ్రీనివాసరావు పాత్ర. రెండూ కోట పండించిన నవ్వుల తోటలే!! మరీ ముఖ్యంగా 'అహ నా పెళ్లంట' సినిమాలో నూతన్ ప్రసాద్ పాత్ర.. 'లక్ష్మీపతా? వాడా.. ఆ మలపత్రాష్టుడా' అనగానే.. 'అవున్నేనే' అనే డైలాగ్‌తో కనిపించే కోట ఆ సినిమాని ఒంటి చేత్తో విజయతీరాలవైపు నడిపించారంటే అందులో ఇసుమంత కూడా అబద్ధం లేదు. 'నాకేంటి.. అహ నాకేంటి' అని డబ్బులు అడగకుండానే అడగడం.. కోడిని తాడుతో కట్టి దాన్ని చూస్తూ భోంచేస్తూ చికెన్ తిన్నంత తృప్తిగా ఉందనడం.. బస్టాండ్‌లో టీ అమ్ముకుంటూ బావమరిది కంటపడినప్పుడు కనుగుడ్లు పూర్తిగా పైకి ఎత్తేసి, తెల్ల గుడ్డు మాత్రమే కనిపించేలా చేసి, కుంటుకుంటూ నడుస్తూ 'చాయ్ పీహేజీ.. అచ్చా చాయ్ పీహేజీ' అంటూ కోట చేసే యాక్టింగ్‌ని వర్ణించడానికి మాటల్లేవంతే!

తాడి మట్టయ్య (హలో బ్రదర్)

కోట శ్రీనివాసరావు తన కెరీర్‌లో హాస్యనటుడిగా పండించిన పాత్రల్లో అందరికీ గుర్తుండిపోయేది.. 'హలో బ్రదర్' సినిమాలో 'తాడి మట్టయ్య' అనే పోలీసు పాత్ర. మరో ప్రముఖ హాస్యనటుడు మల్లికార్జునరావుతో కలిసి చేసే అల్లరి అంతా ఇంతా కాదు. నవ్వించడమే కాదు.. సినిమా చివర్లో మల్లికార్జునరావు పాత్ర చనిపోయినప్పుడు.. 'రేయ్, చిట్టీ లేవరా.. నా మీద రివెంజ్ తీర్చుకోరా..' అంటూ తన నటనతో కన్నీళ్లు పెట్టించేస్తారు కోట.

అల్లావుద్దీన్ (మనీ)

'భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరూ.. భర్తగా మారకు బ్యాచిలరూ' అంటూ.. పెళ్లొద్దని భయపెట్టే పాత్రలో కోట పండించిన హాస్యం దశాబ్దాలు గడిచిపోతున్నా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ఇంకా ఫ్రెష్‌గానే ఉంది.

పోతురాజు (మామగారు)

పనీపాటా లేకుండా వీధి అరుగు మీద కూర్చుని.. పేక ముక్కలు చేతుల్లో పట్టుకుని.. వచ్చేపోయే వాళ్లందరినీ ఆపి 'ఒక దెబ్బేసుకుందామా?' అని అడిగే క్యారెక్టర్‌లో కోట చెలరేగిపోయారీ సినిమాలో. 'పోతురాజు' పాత్రలో బాబూమోహన్‌తో కలిసి ఆయన చేసిన అల్లరి కామెడీ అదుర్స్.

గారపాటి బుల్లబ్బాయ్ (సీతారత్నంగారి అబ్బాయి)

'జల్లింది జీలకర్ర.. మొలిసింది తోటకూర.. పూసింది మల్లెపువ్వు.. ఏసింది అరటిగెల'.. 'కొబ్బరితోటలో జీడిపిక్కలేరుతున్నాను.. వంగతోటలో పనసగింజలేరుతున్నాను' అంటూ కామెడీ డైలాగ్స్‌తో 'సీతారత్నంగారి అబ్బాయి' సినిమాలో కోట శ్రీనివాసరావు చేసిన 'గారపాటి బుల్లబ్బాయ్' పాత్ర కూడా ఆయన కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర.



విశాఖలోని కేఆర్ఎం కాలనీ జలమయమై ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోతున్న దృశ్యం

విశాఖలో కుంభవృష్టి

ఆకస్మికంగా ముంచెత్తిన వాన.. ఉరుములు, పిడుగులతో భారీ వర్షం

నీటి ప్రవాహానికి కొట్టుకు పోయిన వాహనాలు

విశాఖపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): విశాఖనగరాన్ని వర్షం ముంచెత్తింది. ఆదివారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు జోరున కురిసిన వర్షానికి కాలువలు, డ్రెయినేజీలు నిండిపోయి వరదలా పారింది. పలుప్రాంతాల్లో వాహనాలు సైతం కొట్టుకుపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం 2గంటలకు ఒక్కసారిగా మేఘాలు కమ్మేసి ఉరుములు, పిడుగులతో భారీవర్షం కురిసింది. రోడ్లపై పార్కుచేసిన ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. సీతమ్మధారలో 34.0, ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నేడు రెండు అల్పపీడనాలు

పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశాకు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. ఇంకా ఆదివారం మధ్యప్రదేశ్‌లోని మధ్య, ఉత్తర ప్రాంతంలో మరో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో సోమవారం మధ్యప్రదేశ్‌లోని వాయువ్య భాగంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ రెండు అల్పపీడనాల ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్‌లో పలుచోట్ల భారీ నుంచి కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. దీంతో ఈనెల 17వ తేదీ నుంచి ఉత్తరకోస్తాలో వర్షాలు పెరగనున్నాయి. ఈ నెల 18, 19న కోస్తాలో అనేక చోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం కోస్తా, రాయలసీమలో అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం నెలకొంది.

స్వల్పంగా తగ్గిన గోదావరి

- పోలవరం నుంచి 7 లక్షల క్యూసెక్కులు విడుదల

పోలవరం, ధవళేశ్వరం, యలమంచిలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి వరద శాంతించింది. దీంతో పునరావాస కేంద్రాలకు చేరుకున్న ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద ఆదివారం ఉదయం 41.30 అడుగులు నమోదవగా, సాయంత్రానికి 30.60 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 7,29,590 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద చుట్టుముట్టింది. లంక భూములు నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు మూసివేయడంతో వరద స్లూయిజ్ గేట్లను ముంచెత్తింది. ధవళేశ్వరం వద్ద ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని కనకాయలంక కాజ్ వేపై అడుగు మేర వరదనీరు ప్రవహిస్తోంది.

భాయ్.. బచ్చా ఆగయా..!

- గంజాయి స్మగ్లర్ల కోడ్ భాష.. గచ్చిబౌలిలో ఈగల్ స్కెచ్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): "భాయ్.. బచ్చా ఆగయా..!" అంటూ కోడ్ భాషలో గంజాయి విక్రయించే మహారాష్ట్ర వాసి సందీప్, మరో 14 మంది వినియోగదారుల ఆటను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్ - ఈగల్ కట్టించింది. పట్టుబడ్డ గంజాయి కొనుగోలుదారుల్లో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులే కావడం గమనార్హం..! ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సందీప్ ప్రతీవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి గంజాయితో వస్తుంటాడు. తన వినియోగదారులకు "భాయ్.. బచ్చా ఆగయా" అంటూ కోడ్ భాషలో సందేశాలు పంపి.. గంజాయి సరుకు వచ్చిందనే సమాచారం ఇస్తాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో అడ్డాను ఏర్పాటు చేసుకుని, 100 మంది రెగ్యులర్ కస్టమర్లకు ఒక్కో ప్యాకెట్‌లో 50 గ్రాముల గంజాయిని పెట్టి, విక్రయిస్తుంటాడు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.3 వేలు వసూలు చేస్తుంటాడు. శనివారం కూడా సందీప్ 100 గంజాయి ప్యాకెట్లతో గచ్చిబౌలికి వచ్చాడు. ఉప్పందుకున్న ఈగల్ బృందాలు.. కాపుకాచి, అతణ్ని అరెస్టు చేశాయి. అతని ఫోన్‌లో 100 మంది కస్టమర్ల డేటాను ఈగల్ బృందాలు సేకరించాయి. సందీప్ ఇచ్చిన సమాచారం మేరకు.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు వచ్చే వినియోగదారుల కోసం వలపన్నాయి.



ఇంజనీరింగ్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం

జీవోలు విడుదల చేయకముందే ప్రక్రియ

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. నిబంధనల ప్రకారం అడ్మిషన్ల భర్తీకి అనుమతిస్తూ జీవోలు విడుదల చేసిన తర్వాతే ప్రక్రియ ప్రారంభం కావాలి. కానీ జీవోలు ఇవ్వకముందే సాంకేతిక విద్యా శాఖ ఆప్షన్లు ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించింది. అప్పటికే జీవోలు విడుదల చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నా.. అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రం రాత్రి వరకూ జీవోలు కనిపించలేదు. కాగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆప్షన్ల ఎంపిక ప్రారంభమైంది. మొత్తం 251 కాలేజీలు జాబితాలో కనిపిస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ యూనివర్సిటీల కాలేజీలు, ప్రైవేటు కాలేజీలు, ప్రైవేటు యూనివర్సిటీలు ఉన్నాయి. అమరావతిలో ఎస్ఆర్ఎం, మదనపల్లెలోని మిట్స్ కాలేజీలు జాబితాలో కనిపించకపోవడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు విద్యా సంస్థలకు త్వరలో డీమ్డ్ యూనివర్సిటీ హోదా లభించే అవకాశం ఉండటం వల్లే ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో పెట్టలేదని తెలిసింది. అయితే ఇది నిబంధనలకు విరుద్ధమనే వాదన వినిపిస్తోంది. డీమ్డ్ హోదా లభించే వరకూ అవి ప్రైవేటు విద్యా సంస్థలేనని, అప్పటి వరకూ కన్వీనర్ కోటా కింద సీట్లు ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నాయని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

'రియల్'కు నూతనోత్తేజం!

- భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పథకం
- నూతన మార్గదర్శకాలు జారీ చేసిన పట్టణాభివృద్ధి శాఖ
- నిర్మాణ కార్యకలాపాలు సులభతరం, వేగవంతానికి దోహదం
- అనుమతులు రాగానే భవన నిర్మాణం ప్రారంభించే అవకాశం
- స్వీయ ధ్రువీకరణ పొందితే టౌన్‌ప్లానింగ్ తనిఖీలు ఉండవు
- ఆమోదించిన ప్లాన్‌కు కట్టుబడాల్సిన బాధ్యత యజమానిదే
- తప్పుడు సమాచారం ఇస్తే ఎల్‌టీపీల లైసెన్స్ ఐదేళ్లు రద్దు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం కానుంది. ఈ విధానాన్ని సమూలంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వీయ ధ్రువీకరణ పథకాన్ని (సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం)ను తీసుకొచ్చింది. ఈ పథకానికి సంబంధించి సవరించిన మార్గదర్శకాలను విడుదల చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. నిర్మాణ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి ఈ పథకం దోహదపడనుంది. అభివృద్ధిలో భాగస్వామ్య విధానాన్ని ప్రోత్సహించడం రియల్ ఎస్టేట్ రంగంతో పాటు నిర్మాణ రంగానికి ప్రయోజనకంగా ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా సవరణల ద్వారా భవన నిర్మాణ వాతావరణాన్ని సురక్షితంగా, సమ్మిళితంగా, పర్యావరణపరంగా స్థిరంగా మార్చడంతో పాటు వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించుకునే అవకాశాలున్నాయి. త్వరితగతిన అనుమతులు ఇవ్వడంతో పాటు లైసెన్స్ పొందిన సాంకేతిక సిబ్బందిని జవాబుదారీగా చేశారు. ప్రజలకు నమ్మకం కలిగించే రీతిలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో చార్జీల చెల్లింపుల తర్వాత దరఖాస్తులను పరిశీలించి తక్షణమే భవన నిర్మాణ అనుమతి పత్రాలు జారీ చేయడం ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహణ వేగవంతం కానుంది. ఈ విధానంలో అనుమతి పొందిన వెంటనే దరఖాస్తుదారులకు వెంటనే భవన నిర్మాణాన్ని ప్రారంభించుకోవడానికి అధికారం లభిస్తుంది. భవన నిర్మాణ ప్రణాళిక దరఖాస్తులు, ఇతర ముఖ్యమైన పత్రాలు, తనఖా వివరాలు ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టం(ఓబీఎం)లో లైసెన్స్ పొందిన సాంకేతిక నిపుణుల (ఎల్‌టీపీ) ద్వారా సమర్పించాలి. దరఖాస్తుదారు, ఎల్‌టీపీ ఇద్దరూ సంతకం చేసిన స్వీయ ధ్రువీకరణ ప్రొఫార్మాను సమర్పించడం ఈ ప్రక్రియలో అదనపు అంశం. ఇలా సమర్పించిన సమాచారం పత్రాల ప్రామాణికతను, కచ్చితత్వాన్ని ధ్రువీకరిస్తుంది. స్వీయ ధ్రువీకరణ పొందిన భవనాలకు టౌన్‌ప్లానింగ్ అధికారుల తనిఖీలు ఉండవు. మొత్తం దస్త్రాల్లో 10 నుంచి 15శాతం వరకు తనిఖీల కోసం ఎంపిక చేస్తారు. ఇది ప్రజలు, డెవలపర్లపై నిర్వహణ భారాన్ని తగ్గించనుంది.

ఈ ప్రాజెక్టులకు వర్తింపు

స్వీయ ధ్రువీకరణ పథకం-2025 కొన్ని రకాల నిర్మాణ ప్రాజెక్టులకు వర్తిస్తుంది. 4వేల చ.మీ. విస్తీర్ణంలో ఉన్న నాన్ హైరైజ్ నివాస భవన ప్రణాళిక అనుమతులకు ఇది వర్తిస్తుంది. ఇందులో ఆమోదించిన లేఅవుట్లు, ఎల్ఆర్ఎస్-2008, ఎల్ఆర్ఎస్-2020 కింద క్రమబద్ధీకరించిన లేఅవుట్లు, విలేజ్ సైట్లు, గ్రామకంఠాలు, ఆమోదించిన సర్క్యులేషన్ ప్యాటర్న్లు ఉన్న ప్రాంతాలు, రాజధాని నగరం మినహా సీఆర్‌డీఏ పరిధిలోని 300 చ.మీ. లేదా అంతకంటే పెద్ద ప్లాట్లు, గతంలో ఆమోదించిన ప్రణాళికలతో ఉన్న లేదా 1985కి ముందు ఉన్న భవనాలను మళ్లీ అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయి. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం 500 చ.మీ. లేదా అంతకంటే తక్కువ విస్తీర్ణం కలిగిన వైట్ కేటగిరీ పరిశ్రమల స్థాపనకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ మార్గదర్శకాలు రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలకు, పట్టణాభివృద్ధి అథారిటీల పరిధిలోని గ్రామ పంచాయతీలకు వర్తిస్తాయి.

యజమానిదే ప్రాథమిక బాధ్యత

నిర్మాణ ప్రక్రియ మొత్తం ఆమోదించిన ప్లాన్‌కు కట్టుబడి ఉండేలా చూడాల్సిన బాధ్యత భవన యజమానిదే. అదేవిధంగా ఎల్‌టీపీల పాత్ర కూడా కీలకం. దరఖాస్తులో తప్పుడు సమాచారం లేకుండా, అన్ని ప్లాన్‌లు మాస్టర్‌ప్లాన్, జోనింగ్ నిబంధనలు, ఏపీ భవన నిర్మాణ నిబంధనలు 2017కు అనుగుణంగా ఉన్నాయని వారు నిర్ధారించుకోవాలి. ప్లింత్ బీమ్ పూర్తిచేసిన ఏడు రోజుల్లోపు ప్లింత్ లెవల్ తనిఖీ నివేదికను సమర్పించాలి. సైట్ సెట్‌బాక్ నిర్వహణను ధ్రువీకరించాలి. నిర్ణీత గడువులోగా ఈ నివేదికను అప్‌లోడ్ చేయడంలో విఫలమైతే తనిఖీ పూర్తయిందని, నిర్మాణం ఆమోదించిన ప్లాన్ ప్రకారమే ఉందని ఎల్‌టీపీ ధ్రువీకరించినట్లుగా పరిగణిస్తారు. ఏదైనా తప్పుడు సమాచారం ఇస్తే ఎల్‌టీపీలు బాధ్యత వహించాలి. ఇటువంటి వారి ఓబీపీఎస్ లైసెన్స్ ఐదేళ్ల పాటు రద్దు చేస్తారు. ఆక్యుపెన్సీ దశలో ఎల్‌టీపీ ద్వారా అనుమతించదగిన పరిమితుల్లో ఏవైనా తేడాలు గుర్తిస్తే, వారు ఆన్‌లైన్‌లో చెల్లింపు చలానా పెంచి, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసేముందు చెల్లింపులను నిర్ధారించుకోవాలి. అంతేకాకుండా ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా భవన నిర్మాణం జరుగుతోందని గమనిస్తే, సంబంధిత అధికారికి ఎల్‌టీపీలు సమాచారం ఇచ్చి, ఆ తర్వాత పర్యవేక్షణను నిలిపేయాలి. అక్రమాలకు యజమాని పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

మల్లన్న వర్సెస్ కవిత

తెలంగాణలో రాజకీయ దుమారం

- మల్లన్న ఆఫీసుపై జాగృతి కార్యకర్తల దాడి!
- గన్‌మెన్ కాల్పులు.. రక్తసిక్తంగా కార్యాలయం



హైదరాబాద్ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించి దాడికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 30 మంది జాగృతి కార్యకర్తలు బోడుప్పల్‌లోని తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చారు. 'జై కవితక్క' అంటూ నినాదాలు చేస్తూ మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆఫీసులోని అద్దాలు, కుర్చీలను ధ్వంసం చేశారు. వారిని అడ్డుకునేందుకు క్యూన్యూస్ సిబ్బంది, మల్లన్న గన్‌మెన్ ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర తోపులాట జరుగగా.. పలువురికి గాయాలయ్యాయి. కార్యాలయంలో మల్లన్న కూర్చున్న చాంబర్‌లోకి చొచ్చుకెళ్లేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా.. గన్‌మెన్ అడ్డుకున్నారు. అయినా వారు వెనక్కి తగ్గకపోవడంతో కాల్పులు జరిపారు. ఈ దాడికి సంబంధించిన వీడియోల్లో క్యూన్యూస్ కార్యాలయ ప్రాంగణం రక్తసిక్తంగా మారినట్టు కనిపించింది. దాడిలో తీన్మార్ మల్లన్న చేతి వేలికి గాయమైంది. ఎమ్మెల్సీ కవిత తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. వారి దాడిలో తనకు గాయమైందని తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్‌లో ఇటీవల బీసీ సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న.. ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలే వివాదానికి దారితీశాయి. మల్లన్న మాట్లాడుతూ, "బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాగానే కవిత రంగులు, గులాల్ చల్లుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వస్తే నీకేం సంబంధం? నువ్వు బీసీవా? నీకు, మాకు కంచం పొత్తు ఉందా?" అంటూ మరో అనుచిత వ్యాఖ్య చేశారు. ఇవి వైరల్ కావడంతో జాగృతి కార్యకర్తలు ఆగ్రహానికి గురయ్యారు.

బీటెక్‌లో సీఎస్ఈ జోరు

- ఇతర ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు బేజారు
- కంప్యూటర్ సైన్స్ గ్రూపుల్లోనే 55% సీట్లు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై మక్కువే కారణం
- ఈసీఈకి కూడా పెరిగిన డిమాండ్
- సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్ బ్రాంచ్‌ల్లో క్రమంగా తగ్గుతున్న సీట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య స్వరూపం మారుతోంది. ఒకప్పుడు ఇంజనీరింగ్ అంటే కోర్ గ్రూపులకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) తప్ప మరో బ్రాంచ్ లేదన్నట్టుగా ఇంజనీరింగ్ విద్య మారిపోయింది. 2025-26 విద్యా సంవత్సరంలోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. కాలేజీ యాజమాన్యాలు సీఎస్ఈ సీట్లను ఏటా పెంచుకుంటూ వెళ్తున్నాయి. విద్యార్థులు సీఎస్ఈ సీట్లే కావాలని కోరుకుంటున్నందున ప్రైవేటు కాలేజీలు అందుకు అనుగుణంగా ఆ బ్రాంచ్‌లలో సీట్లు పెంచుకుంటున్నాయి. ఫలితంగా కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో సీట్లు తగ్గిపోతున్నాయి. ఆయా బ్రాంచ్‌ల్లో ఉన్నవే తక్కువ సీట్లు అయినా.. అవి కూడా పూర్తిగా భర్తీ కావట్లేదు. అయితే ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ప్రతి కాలేజీలో మూడు కోర్ బ్రాంచ్‌లు తప్పనిసరిగా ఉండాలి. అందువల్ల కాలేజీలు కోర్ బ్రాంచ్‌ల్లో సీట్లను కనీస సంఖ్యకు కుదించుకుంటున్నాయి. మరోవైపు సీఎస్ఈ బ్రాంచ్‌లను పెంచుకుంటున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రానికి ఏఐసీటీఈ మంజూరు చేసిన సీట్లలో 55.24 శాతం సీట్లు ఒక్క సీఎస్ఈలోనే ఉన్నాయి. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, ఇతర బ్రాంచ్‌ల్లో అన్నిట్లో కలిపినా 45 శాతం సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ సంవత్సరం ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీలకు ఏఐసీటీఈ 1,85,734 సీట్లు మంజూరు చేసింది. అందులో 1,02,614 సీట్లు ఒక్క కంప్యూటర్ సైన్స్‌లోనే ఉన్నాయి.

రెండేళ్లలో సీట్ల సంఖ్యలో వ్యత్యాసం ఇలా..

బ్రాంచ్	2024-25	2025-26	పెరుగుదల /తగ్గుదల
సీఎస్ఈ	99,494	1,02,614	+3,120
ఐటీ	6,390	6,360	-30
సివిల్	8,930	8,180	-750
మెకానికల్	10,415	9,815	-600
ఈఈఈ	11,420	10,895	-525
ఈసీఈ	31,310	32,330	+1,020

అనుబంధ బ్రాంచ్‌లే అయినా.. వేర్వేరుగా!

సీఎస్ఈలోనూ అనేక బ్రాంచ్‌లు వచ్చాయి. సీఎస్ఈ కోర్ బ్రాంచ్ ఒకటి అయితే... సీఎస్ఈ- డేటాసైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ-మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లతో పాటు బ్లాక్‌చైన్, ఇతరత్రా కొత్త బ్రాంచ్‌లు సీఎస్ఈలో అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఇవన్నీ సీఎస్ఈ అనుబంధ బ్రాంచ్‌లే అయినా ఏఐసీటీఈ మాత్రం వాటిని వేర్వేరుగా పరిగణిస్తుంది. అందువల్ల బ్రాంచ్‌లను వేరుగా చూపిస్తూ కాలేజీలు సీట్లు పెంచుకుంటున్నాయి. ఈ సంవత్సరం కొత్తగా క్వాంటం కంప్యూటింగ్ బ్రాంచ్ కూడా వచ్చింది. ఇవి కాకుండా ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీల్లోనూ భారీగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని నాలుగు డీమ్డ్ యూనివర్సిటీల్లో దాదాపు 10 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఐదు వేలకు పైగా సీఎస్ఈ సీట్లు ఉన్నాయి. 11 ప్రైవేటు యూనివర్సిటీల్లో 11,500 సీట్లు ఉండగా.. వాటిల్లోనూ సగానికి పైగా సీఎస్ఈ సీట్లు ఉంటాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే కావాలి

సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ కోర్సులు చదివితే నిర్మాణ రంగం, ఉత్పత్తి రంగంలో ఉద్యోగావకాశాలు ఉంటాయి. సీఎస్ఈ, ఐటీ బ్రాంచ్‌లు చదివిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే మంచి ప్యాకేజీలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వస్తున్నాయి. దీంతో 80 శాతం మంది విద్యార్థులు సీఎస్ఈకే మొగ్గు చూపుతున్నారు. సీఎస్ఈ సీటు రాకపోతే డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ)లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. పేరున్న కాలేజీల్లో చదివిన వారికే క్యాంపస్ ఉద్యోగాలు లభిస్తున్నాయి.

కోర్టు ఉత్తర్వులకూ జగన్ మీడియా వక్రీకరణ

- 'ఆంధ్రజ్యోతి' ఎండీకి కోర్టు సమన్లంటూ తప్పుడు కథనం

హిందూపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులనూ జగన్ మీడియా వక్రీకరించింది. 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణకు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సమన్లు జారీ చేసినట్లు 'సాక్షి' దినపత్రిక, 'సాక్షి' చానల్‌లో ఆదివారం తప్పుడు కథనాలు ప్రచురించి, ప్రసారం చేశారని, అవి పూర్తిగా అవాస్తవాలని న్యాయవాది శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... 2024 జూన్ మొదటి వారంలో హిందూపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న రియాజ్ అహ్మద్‌ను అర్ధరాత్రి వీఆర్‌కు పంపారు. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. 'ఏబీఎన్' చానల్‌లో కూడా కథనం ప్రసారమైంది. దీంతో ఆయన.. 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్'పై హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఇందులో డీ1గా 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డీ2గా శ్రీనివాస్ (సీఈవో, 'ఆంధ్రజ్యోతి'), డీ3గా స్వప్నిల్ చటర్జీ (ఎడిటర్ ఇన్ చీఫ్, 'ఆంధ్రజ్యోతి'), డీ4గా బాలు ('ఆంధ్రజ్యోతి' రిపోర్టర్, హిందూపురం), డీ5గా శంకర్ ('ఆంధ్రజ్యోతి' శ్రీసత్యసాయి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) పేర్లు చేర్చారు. హిందూపురం కోర్టులో కేసు (ఓఎస్ 41/2024) నమోదైంది. దీనిపై న్యాయవాదులు శివశంకర్, రకీబ్ 2025 జూన్ 9న డీ1 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డీ4 బాలు, డీ5 శంకర్ తరఫున వకాల్తా వేసి, అడాప్షన్ మెమోతో పాటు డీ4 తరఫున స్టేట్‌మెంట్ వేసి కోర్టులో వాదనలు వినిపించారు. డీ2 శ్రీనివాస్, డీ3 స్వప్నిల్ చటర్జీ పేరిట ఈ ఏడాది ఏప్రిల్ 10న కోర్టు సమన్లు జారీ చేసింది. కానీ ఆ పేర్లు, హోదాలతో 'ఆంధ్రజ్యోతి' సంస్థల్లో ఎవరూ లేకపోవడంతో ఆ సమన్లు ఎవరికీ చేరలేదు. ఈ నేపథ్యంలో డీ2, డీ3లకు సంబంధించి 'సాక్షి' దినపత్రికలో ప్రకటన ఇచ్చుకోవడానికి అనుమతివ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో కోర్టు సమ్మతించిందని శివశంకర్ వివరించారు. అయితే కోర్టు ఉత్తర్వులను రోతపత్రిక వక్రీకరించింది. 'ఆధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణకు, స్థానిక 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్‌కు ఆగస్టు 18న హాజరుకావాలంటూ కోర్టు సమన్లు జారీ చేసినట్లు తప్పుడు కథనం ప్రచురించింది. కోర్టు ఉత్తర్వులను వక్రీకరించడంపై చట్టపరంగా ముందుకెళ్తామని న్యాయవాది శివశంకర్ తెలిపారు.

కట్టల గుట్టలు!

(మొదటి పేజీ తరువాయి)



దొరుకుతాడు అన్నట్టు.. లిక్కర్ స్కామ్ నిందితులు ఆధారాలు లభించకుండా ధ్వంసం చేసినా తప్పించుకోలేకపోయారు. సిట్ బృందంలో టెక్నాలజీపై బాగా పట్టున్న అధికారులు రికవరీకి మార్గం వెతికారు. కసిరెడ్డి టీమ్ నుంచి సెల్‌ఫోన్లు దొరక్కపోయినా, వారు వీడియోలు పంపిన కొందరు నిందితుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారు కూడా ఆ వీడియోలను డిలీట్ చేసేశారు. అయితే అధికారులు ఏపీఎఫ్ఎస్ఎల్ వద్ద ఎలాంటి రిట్రీవల్ పరికరాలు ఉన్నాయో తెలుసుకుని.. 'డిలీట్ డేటా రిట్రీవల్' కోసం తాము స్వాధీనం చేసుకున్న నిందితుల ఫోన్లు పంపారు. దీంతో ఎన్నో రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. వీడియోలతో పాటు చాటింగ్‌లు, సందేశాలు, ఫొటోలు సైతం బయట పడ్డాయి. అధికారులు రెండు కీలక వీడియోలు చూసి ఆశ్చర్యపోయారు. రెండు వేలు, ఐదు వందల నోట్ల కట్టలతో కూడిన డెన్‌లు చూసి.. 'సినిమాల్లోనే ఇలాంటి దృశ్యాలు చూశాం' అంటూ విస్తుపోయారు. సిట్ అధికారులు త్వరలో దాఖలు చేయనున్న చార్జిషీట్‌లో ఈ ఆధారాలను పొందపరచనున్నారు. అవన్నీ బయటకు వస్తే సంచలనాలు జరిగే అవకాశముంది.

వీడియోల్లో ఏముందంటే...

- ఓ వీడియోలో నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి నోట్ల కట్టల మధ్యలో నిల్చున్నాడు. 'ఈ ఐదు కోట్లు అక్కడికి.. ఈ ఏడు కోట్లు ఇక్కడికి.. ఆ రెండు వేల నోట్ల కట్టల బాక్సు ఫలానా చోటుకు.. ఈ ఐదొందల బండిల్స్ బ్యాగు ఆ కార్లోకి..' అంటూ ఎదురుగా ఉన్న వ్యక్తులకు చెప్పాడు. రాయలసీమలో వైసీపీలో కీలక నాయకుల్లో ఒకరికి ఆ వ్యక్తి అత్యంత సన్నిహితుడిగా సిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఆ డబ్బు ఎవరెవరికి చేర్చాడు? అలా ఎన్నిసార్లు తరలించాడు? ఆ సమయంలో అక్కడున్న వ్యక్తులెవరు? అనే విషయాలపై కూపీ లాగినట్టు తెలుస్తోంది.
- మరో వీడియోలో వ్యక్తులు ఎవరూ కనిపించలేదు. అయితే పుస్తకాల షాపులో బుక్కులు పేర్చినట్లు భారీగా నోట్ల కట్టలు కనిపించాయి. అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ఒక కీలక నిందితుడి సెల్‌ఫోన్ నుంచి ఈ వీడియోను రిట్రీవల్ చేసినట్లు తెలుస్తోంది.

ఈ నెల 17న చార్జిషీట్

మద్యం కుంభకోణంలో ఏడు దశల్లో ప్రణాళికా బద్ధంగా దోపిడీ జరిగింది. సిట్ ఇప్పటి వరకూ 40 మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికి పైగా విదేశాలకు పారిపోయారు. ఈ కేసు విచారణలో మూడు నెలలకు పైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈ నెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి. మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, కీలక వ్యక్తులకు పంపడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేయడం, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలించడం తదితర విషయాలపై చార్జిషీట్ దాఖలు చేయబోతున్నారు. పది రోజులకు పైగా ఇదే పనిలో నిమగ్నమైన సిట్ అధికారులు న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులతో చర్చిస్తున్నారు. ఎవరెవరు సూత్రధారులు, పాత్రధారులు అనే దానిపై పక్కా ఆధారాలతో పాటు టెక్నికల్ సాక్ష్యాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నాయకుల పాత్రపై కూడా ఇప్పటి వరకూ లభించిన ఆధారాలు సమర్పించబోతున్నట్లు తెలిసింది. ఈ నెల 21 నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డికి 90 రోజులు పూర్తి అవుతుంది. ఈ లోపు చార్జిషీట్ దాఖలు చేయకపోతే డిఫాల్ట్ బెయిల్ వస్తుంది. దీంతో అభియోగ పత్రాన్ని సిద్ధం చేసిన సిట్.. సోమవారం నాటికి ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకురానుంది. మంగళవారం న్యాయ నిపుణుల పరిశీలనకు పంపి మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసి గురువారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

అమ్మకానికి వైద్యుల పోస్టులు!

కాంట్రాక్టు పద్ధతిలో బోధనాసుపత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీ

- డీఎంఈ కీలక అధికారి భారీ 'మనీ స్కెచ్'
- ఒక్కో పోస్టుకు రూ.20-25 లక్షల ధర నిర్ణయం
- ఇప్పటికే 15 మందితో బేరాలు.. ఒప్పందాలు
- పేరుకు 17న ఇంటర్వ్యూలు.. అక్కడే పోస్టింగ్ ఆర్డర్లు
- కాంట్రాక్టు భర్తీని వ్యతిరేకిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- నోటిఫికేషన్ రద్దుకు వైద్యులు, జీడీపీ డిమాండ్

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కౌన్సిల్ బూచి చూపించి.. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీ పేరుతో 'అమ్మకానికి' భారీ స్కెచ్ నడుస్తోంది! ఒక్కో పోస్టును రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ధర నిర్ణయించారని, ఇప్పటికే బేరసారాలు, ఒప్పందాలు జరిగినట్లు తెలిసింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని బోధనాసుపత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. డీఎంఈ చరిత్రలోనే తొలిసారిగా కాంట్రాక్టు పద్ధతిలో 77 మంది వైద్యుల పోస్టులు భర్తీకి సిద్ధమయ్యారు. ఈ నోటిఫికేషన్ వెనుక ఓ కీలక అధికారి 'మనీ ప్లాన్' ఉన్నట్లు తెలుస్తోంది. డీఎంఈ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మాత్రమే అవకాశం ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరి మూడు వేల మందికి పైగా వైద్యులు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వీరందరికీ పదోన్నతులు కాదని ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ క్యాడర్‌లో కాంట్రాక్టు వైద్యులను తీసుకువస్తున్నారు.

ఒక్కో విభాగం పోస్టుకు ఒక్కో రేటు!

77 పోస్టుల్లో సగానికిపైగా అమ్మకానికి పెట్టేశారు. డీఎంఈలో విధులు నిర్వహిస్తున్న ఓ కీలక అధికారి ఇప్పటికే 15 మంది వైద్యులతో బేరాలు జరిపి, ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. క్లినికల్ విభాగాలకు ఒక రేటు, నాన్ క్లినికల్ విభాగాలకు మరో రేటు నిర్ణయించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న మరో ఇద్దరు వైద్యులు ఈ బేరాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరు ప్రైవేటు వైద్యులను సంప్రదించడం, ఆ తర్వాత వారిని డీఎంఈ కార్యాలయానికి తీసుకువచ్చి ఆ కీలక అధికారితో మాట్లాడించడం జరుగుతోంది. ఇప్పటికే 15 మంది నుంచి భారీగా వసూళ్లు చేసినట్లు సమాచారం. ఎన్ఎంసీ మార్గదర్శకాలను చూపిస్తూ.. 17న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు అంటూ.. తెరవెనుక జరగాల్సిన తతంగాన్ని మాత్రం పూర్తి చేస్తున్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపిక చేసినట్లు చూపించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

'కాంట్రాక్ట్' భర్తీతో తీవ్ర నష్టం

కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడం వల్ల జరిగే నష్టం అంతాఇంతా కాదు. భవిష్యత్తులో కోర్టు కేసులు పడి, కొన్నేళ్ల పాటు వైద్యులు పదోన్నతులు లేకుండా ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో వైఎస్ఆర్ సమయంలో రిమ్స్‌లు ఏర్పాటు చేసి, ఇలానే కాంట్రాక్ట్ పద్ధతిన వైద్యులను నియమించారు. అప్పటి నుంచి డీఎంఈలో వైద్యుల సర్వీసులు, పదోన్నతుల సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొవాల్సి వచ్చింది. ఇప్పుడు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేపడితే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ నియామకాలను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం నియామకాలు చేపట్టే వారు జేబులు నింపుకొని 2-3 ఏళ్లలో రిటైరై వెళ్లిపోతారని, భవిష్యత్తులో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోగ్య మంత్రికి ప్రభుత్వ వైద్యుల సంఘం లేఖ

కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీని తక్షణమే నిలుపుదల చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీపీ) విన్నవించింది. ఈ మేరకు ఆదివారం మంత్రికి లేఖ అందించింది. కాంట్రాక్ట్ నియామకాల వల్ల రెగ్యులర్ వైద్యులు ఇబ్బందులు పడతారని సంఘం నేతలు వివరించారు. ఇప్పటికే వైద్యులకు పదోన్నతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైద్యులందరికీ ముందుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రస్తుతం డీఎంఈ సిద్ధం చేసిన సీనియార్టీ జాబితాల్లో బోధనాసుపత్రుల్లో ఉన్న ఖాళీల కంటే ఎక్కువ మంది పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.



తస్సాదియ్య.. 'లాబ్ స్టార్' రొయ్య!

మాంసాహార ప్రియులకు చేపల్లో 'పులస' ఎలా నోరూరిస్తుందో రొయ్యల్లో లాబ్‌స్టార్ కూడా అంతే!. ఎప్పుడో ఒక్కసారి మాత్రమే లభించే ఈ రొయ్యను ఆస్వాదించేందుకు పోటీ పడతారు. దీంతో ఈ రొయ్యకు భారీ డిమాండ్ ఉంది. తాజాగా విశాఖకు చెందిన ఓ మత్స్యకారుడి వలకు రెండు లాబ్‌స్టార్ రొయ్యలు చిక్కాయి. వీటిని ఆదివారం ఫిషింగ్ హార్బర్‌కు తెచ్చి విక్రయించగా ఒక్కొక్కటీ రూ.2,500 చొప్పున ధర పలికింది. ఒక్కొక్క రొయ్య కిలోన్నర ఉంటుందని మత్స్యకారుడు తెలిపారు. ఈ రొయ్య రుచిగా ఉండడంతోపాటు ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. -విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి.



ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో వేసిన ముళ్లకంప

దళితులపై వైసీపీ దాష్టీకం.. ఎస్సీ కాలనీకి అడ్డుగా ముళ్లకంప

ధర్మవరం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో పీర్లపండుగలోకి దళితులు రాకూడదంటూ వైసీపీ వర్గీయులు రెచ్చిపోయారు. ఆ కాలనీకి వెళ్లే దారికి అడ్డంగా ముళ్లకంపలు వేశారు. పీర్లపండుగలో భాగంగా గ్రామంలో శనివారం రాత్రి పెద్దసరిగెత్తు జరిగింది. అక్కడ డప్పు కొట్టేందుకు ఎస్సీ కాలనీ నుంచి పెద్దగంగప్ప, చిన్నగంగప్ప, వెంకటేశ్, నారాయణస్వామి వెళ్లారు. ఆ సమయంలో వైసీపీ వర్గీయులైన బాలు, కోన.. చిన్నగంగప్పను ఆటోతో ఢీకొట్టడమే కాకుండా వారిపై బూతులతో రెచ్చిపోయారు. దీంతో డప్పు కొడుతున్న దళితులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం వైసీపీ వర్గీయులు పీర్ల పండగలోకి దళితులు రాకూడదంటూ ఎస్సీ కాలనీకి దారికి అడ్డుగా ముళ్లకంప వేశారు.

అడ్డగోలుగా తవ్వేస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం విధించింది. అయితే నీటి లభ్యత తక్కువగా ఉన్న 350 మండలాల్లోని 745 ప్రాంతాల్లో మనుషులను పెట్టి తవ్వుకునే వెసులుబాటు ఇచ్చింది. వీటిలో భారీ, మధ్యరకం యంత్రాలను ఉపయోగించడానికి వీల్లేదు. ఇవి కాకుండా మరో 54 డీసిల్టేషన్ పాయింట్స్‌లో తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే మైనింగ్ నిలిపివేసిన రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, కర్నూలు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో కొందరు నేతలు.. వారి కనుసన్నల్లోని కంపెనీల ద్వారా భారీగా మైనింగ్ నిర్వహిస్తున్నారని అధికారులు సీఎంకు నివేదిక సమర్పించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఐదుగురు నేతలు పోటాపోటీగా తవ్వకాలు కొనసాగిస్తున్నారని తెలిసింది. ఇందులో వేమూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నేరుగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరు మంత్రులు, మరో ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల పేరుచెప్పి తవ్వకాలు జరుపుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తెనాలి నియోజకవర్గం పరిధిలోని కొల్లిపర రీచ్ చాలా పెద్దది. దీనితోపాటు మంగళగిరి నియోజకవర్గంలోని గుండిమెడ, రాయపూడి, లింగాయపాలెం-1, లింగాయపాలెం-2, ఇతర రీచ్‌ల్లో భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. కొల్లిపర, గుండిమెడ రీచ్‌ల్లో ప్రజాప్రతినిధుల పేరు చెప్పి వేమూరు ప్రాంత వ్యక్తి ఇసుక దందా నిర్వహిస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. కొల్లిపరలో వేమూరు వ్యక్తి తవ్వకాలు నిర్వహించడాన్ని టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కీలకమైన గుండిమెడ రీచ్‌లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. వేమూరు వ్యక్తే ఇక్కడా రాత్రింబవళ్లూ తవ్వుతున్నట్లు గుర్తించారు. రోజుకు సగటున 400 లారీల్లో ఇసుకను తరలిస్తున్నారని అంచనా. కొల్లిపరలో 270 లారీల్లో తరలిస్తున్నారని తేలింది. వేమూరు వ్యక్తి పెద్ద నేతల పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఓ నేత పేషీ నుంచి గనుల అధికారులకు ఫోన్‌చేసి ఇసుక లారీల తనిఖీలు చేపట్టవద్దని పదేపదే చెప్పిస్తున్నట్లు సమాచారం. నిజానికి గుండిమెడ, కొల్లిపర రీచ్‌ల్లో అక్రమ ఇసుక మైనింగ్‌పై గతంలో జగన్ హయాంలోనే ఎన్‌జీటీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఆ కేసులు ట్రిబ్యునల్‌ను దాటి సుప్రీంకోర్టు ముందుకు వెళ్లాయి. అక్రమ మైనింగ్ జరుగడం లేదని అప్పటి గుంటూరు కలెక్టర్ ఇచ్చిన రిపోర్టులపై ట్రిబ్యునల్, సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేశాయి కూడా. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఇదే రీచ్‌ల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ ఇద్దరు వ్యక్తులు ట్రిబ్యునల్‌కు తాజాగా ఫిర్యాదు చేశారు. వీటిపై త్వరలో విచారణ జరిగే అవకాశముంది.

ఆ జిల్లాల్లో అంతా ఒక్కటయ్యారు..

కర్నూలు, నంద్యాల, గోదావరి జిల్లాల పరిధిలోని మైనింగ్‌లో నేతలంతా ఒక్కటై తవ్వకాలు చేస్తున్నారు. విభేదాలకు తావులేకుండా నదులను విడతలవారీగా తోడేస్తున్నారు. తాజాగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగాయి. దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈలోపే అందినకాడికి ఇసుకను తవ్వి తరలించుకుపోయేందుకు రాత్రింబవళ్లూ రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని అధికారులు సీఎంకు తెలియజేశారు. నేతలను నియంత్రించకపోతే అక్రమ మైనింగ్ ఆగదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని నివేదికలో కోరినట్టు తెలిసింది.

గుడివాడ ఘటనంతా.. పేర్ని నాని

మైండ్ గేమే!



వెలుగులోకి వచ్చిన వీడియో

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వెనుక మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని హస్తం బట్టబయలైంది. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేందుకు, గొడవలు సృష్టించడానికి ముందస్తు ప్రణాళికతోనే బీసీ మహిళ అయిన కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త ఉప్పాల రామును ఆయన అక్కడకు పంపినట్లు తెలుస్తోంది. 'రప్పా రప్పా అని నరుకుతామంటూ అరవడం కాదురా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి. మీకు చేతనైతే రేపు మన ప్రభుత్వం వచ్చాక.. ఎవడెవడు తప్పులు చేశాడో వాళ్లను నరికెయ్యండి! చెప్పి నరకడం కాదు, చెప్పకుండా నరికెయ్యాలి. ఆ తర్వాత ఎలా జరిగిందంటూ మీరంతా వెళ్లి పలకరించాలి. అయినా చీకట్లో చేయాల్సిన పనులు పట్టపగలు చెప్పడమేంటి అసహ్యంగా' అంటూ గత గురు, శుక్రవారాల్లో కృష్ణా జిల్లా పామర్రు, అవనిగడ్డ వైసీపీ కార్యకర్తలను పేర్ని నాని రెచ్చగొట్టేలా మాట్లాడడంతో.. వైసీపీ శ్రేణులను ఉన్మాదుల మాదిరిగా రెచ్చగొడుతున్న మాజీ మంత్రి గుడివాడ వస్తే దేహశుద్ధి చేస్తామని టీడీపీ కార్యకర్తలు హెచ్చరించారు. ఆయన అక్కడకు వస్తారన్న సమాచారంతో శనివారం మధ్యాహ్నం నుంచే ఎదురుచూశారు. అయితే గుడివాడలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు మచిలీపట్నంలో పేర్ని నానిని ఇంటి నుంచి బయటకు కదలనివ్వలేదు. దీంతో ఆయన మైండ్‌గేమ్‌కు తెరలేపారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి.. వారు దాడిచేస్తే.. ప్రజల నుంచి సానుభూతి పొందాలని ఎత్తువేశారు. ఆయన పథకం ప్రకారం జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త ఉప్పాల రాము సాయంత్రం ఒకే కారులో కలిసి వచ్చారు. దానిని పేర్ని నాని వాహనంగా భావించిన టీడీపీ కార్యకర్తలు కారు వద్ద గుమిగూడారు. అయితే



పోలీసులను హెచ్చరిస్తున్న కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము (ఫైల్)

అందులో హారిక, రాము ఉండడంతో వారినేమీ అనలేదు. వాళ్లు వెళ్లిపోవడానికి దారి కూడా ఇచ్చారు. ఈ లోపు పోలీసులు సైతం వచ్చారు. కానీ రాము కారు అద్దం దించి వారితో ఆవేశంగా మాట్లాడారు. టీడీపీ శ్రేణులను లం.కొ.లు అంటూ.. బూతులు తిడుతూ ఓవరాక్షన్ చేశారు. అయినా పోలీసులు సంయమనంతో కారు పోనివ్వాలని సూచించారు. కానీ కారు ఆపేయాలని రాము ఆదేశించారు.స్థానిక ఎస్‌ఐ వచ్చి ముందుకు వెళ్లిపోవాలని అభ్యర్థించినా వినిపించుకోలేదు. ఈ దశలో టీడీపీ శ్రేణులు కూడా ప్రతిఘటనకు దిగాయి. కారు వెనుక అద్దంపై రాయి విసరడంతో అది పగిలింది. తాము అనుకున్నట్లే జరగడంతో రాము, హారిక రోడ్డు మధ్యలో కారు ఆపారు. చేయాల్సిన గొడవంతా చేశాకే ముందుకెళ్లారు. వెళ్లినట్టే వెళ్లి మళ్లీ వ్యతిరేక దిశలో కారును తీసుకొచ్చి అక్కడ పెట్టారు. ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాక.. హారికను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. ఇది కూడా పేర్ని నాని డైరెక్షన్‌తోనే చేసినట్లు సమాచారం. స్టేషన్‌లో హారిక కారణం లేకుండానే ఏడుస్తూ హైడ్రామా చేశారు.

వైసీపీ పెద్దలకు ఫోను..


ఇంకోవైపు.. ఈ ఘటనను రాష్ట్రవ్యాప్త అంశంగా మార్చేందుకు పేర్ని నాని ప్రయత్నించారు. వైసీపీ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడుతూ.. బీసీ మహిళపై దాడిచేయాలని లోకేశ్ ఆదేశిస్తేనే.. గుడివాడ టీడీపీ శ్రేణులు చేశాయని, బీసీ మహిళపై జరిగిన దాడిని ఖండిస్తూ పార్టీ తరఫున పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టాల్సిందిగా అధినేత(జగన్) చెప్పాలని సూచించారు. ఈ వీడియో బయటకు రావడంతో పేర్ని నాని కుట్ర బయట పడింది. గుడివాడ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు ఆదివారం వెలుగుచూశాయి. అవి వైరల్‌గా మారాయి. పేర్ని నాని ఫోన్ కాల్ దరిమిలా ఆదివారం వైసీపీ శ్రేణుల ఆందోళనలతో ఈ ఉదంతం వెనుక ఆయనే ఉన్నట్లు వెల్లడైందని.. బీసీ కులాల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి టీడీపీ కూటమికి దూరం చేసేందుకు కుట్ర పన్నారని టీడీపీ శ్రేణులు అంటున్నాయి.

బీసీ మహిళను అడ్డం పెట్టుకొని: కొల్లు

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీ మహిళను అడ్డం పెట్టుకొని, కుట్రలు, కుతంత్రాలతో అరాచకం సృష్టించాలని వైసీపీ నాయకులు ప్రయత్నించడం వారి నీచ రాజకీయానికి పరాకాష్ఠ అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ కారును పోలీసులు వదిలేసినా.. ఆమె కావాలని వచ్చి పోలీసుల్ని, టీడీపీ నాయకుల్ని దుర్భాషలాడారని, ఆ సమయంలో టీడీపీ నాయకులు తిరగబడితే దాన్ని టీడీపీ నాయకత్వానికి అంటగట్టాలని పేర్ని నాని ప్రయత్నించారని అన్నారు. జగన్ డైరెక్షన్‌లో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాక్షస మూకలకు రాక్షస ఆలోచనలే వస్తాయని పేర్ని నాని మరోసారి నిరూపించారని అన్నారు.

26న సింగపూర్‌కు చంద్రబాబు

» సీఎం నేతృత్వంలో 8 మంది బృందం పర్యటన



అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 8 మంది మంత్రులు, అధికారుల బృందం ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళ్లనుంది. ఈనెల 30వ తేదీ వరకు ఈ బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఐఏఎస్ అధికారులు కాటంనేని భాస్కర్, ఎస్.యువరాజ్, కార్తికేయ మిశ్రా, కె.కన్నబాబు, సాయికాంత్ వర్మ ఈ బృందంలో ఉంటారు. పర్యటన ప్రధాన అజెండా రాజధాని నిర్మాణానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేయడమేనని సమాచారం. సింగపూర్ నగర ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యానవనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పన, భవిష్యత్తు సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి విషయాలను బృందం అధ్యయనం చేయనుంది.

విద్యుత్ చార్జీలు పెంచం: మంత్రి గొట్టిపాటి



బద్వేలు/టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని, ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆదివారం కడప జిల్లా బద్వేలులో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. కడప జిల్లా పోరుమామిళ్ల పరిధిలోని 600 ఎకరాల్లో సోలార్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేశ్‌రెడ్డి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ.. సోలార్ విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు రాయలసీమ అనుకూల ప్రాంతమని, త్వరలో ఆ దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం జరిగిన విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశంలోనూ.. విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

అమరావతిలో బిట్స్ క్యాంపస్

» బిర్లా గ్రూప్ చైర్‌పర్సన్ కుమార్ మంగళం బిర్లా

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్‌ను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా తెలిపారు. రూ.1,000 కోట్ల పెట్టుబడితో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆదివారం ఆయన రాజస్థాన్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో విద్యార్థులు, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లస్ (ఏఐ ప్లస్) క్యాంపస్‌ను రెండు దశల్లో దాదాపు 7వేల మంది విద్యార్థుల విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా నిర్మించనున్నామని తెలిపారు. 2027 నాటికి ఇది పనిచేయడం ప్రారంభిస్తుందని చెప్పారు. 35 ఎకరాల్లో నిర్మించనున్న ఈ కొత్త క్యాంపస్ ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ బ్రాంచ్‌ల్లో అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తుందని వివరించారు. దీనితో పాటు బిట్స్ సామర్థ్యం పెంచడం, ఏఐని అందిపుచ్చుకోవడంలో భాగంగా వచ్చే ఐదేళ్లలో మూడు ముఖ్యమైన ప్రణాళికలను ఆయన ప్రకటించారు. భారత్‌లోని క్యాంపస్‌ల విస్తరణకు 'బిట్స్ విస్తార్' ప్రాజెక్టును ప్రారంభిస్తామని తెలిపారు. బిట్స్‌లో విద్యార్థుల సంఖ్యను 18,700 నుంచి 26 వేలకు పెంచడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు.

ఎం.ఎస్ స్వామినాథన్ శత జయంతికి రూ. 100 నాణెం

న్యూఢిల్లీ, జూలై 13: ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూ. 100 విలువ గల నాణెం విడుదల చేస్తూ కేంద్రం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. స్వామినాథన్‌ను భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశ పెట్టడంలో ఆయన చేసిన కృషి కారణంగా దేశం ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించగలిగింది. ఈ ప్రత్యేక నాణెం 44 మిల్లీ మీటర్ల చుట్టు కొలతతో, 35 గ్రాముల బరువుతో ఉంటుంది. ఇది 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమాలతో తయారయింది.

పగలే చంపండని చెబుతా!

» బాబూ.. 76 ఏళ్లు వచ్చాయి.. ఇంకా ఎంత కాలం ఉంటావ్

» ఏరా పీకే.. సిగ్గుపెట్టలేదా దేవుడు..

» సీఎం, డిప్యూటీ సీఎంపై పేర్ని నాని అసభ్య వ్యాఖ్యలు

విజయవాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): 'నరకండి అని చెబితే చీకట్లో ఎందుకు చెయ్యమని చెబుతాను.. పగలే చెయ్యమని చెబుతా..' అంటూ మాజీ మంత్రి పేర్ని నాని మరోసారి పేట్రేగిపోయారు. ఆదివారం పెడనలో వైసీపీ నిర్వహించిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' సమావేశంలో ఆయన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో పవన్, లోకేశ్ ఆయా సభల్లో ప్రసంగించిన వీడియోలను ప్రదర్శించి.. కూటమి నేతలనుద్దేశించి అరేయ్.. ఒరేయ్ అంటూ అనుచితంగా మాట్లాడారు. 'నీకు 76 ఏళ్లు వచ్చాయి.. ఇంకెంతకాలం ఉంటావు చంద్రబాబూ! జగన్‌ను, వైసీపీని భూస్థాపితం చేస్తాడంట! ఏరా పీకే (పవన్ కల్యాణ్..) నిన్నే రా.. సిగ్గుపెట్టలేదా దేవుడు మీకు? మాట మీద నిలబడవా లోకేశ్! ఐదు నెలలు జైలులో వంశీ ఉన్నాడుగా.. జైలుకి వెళ్లి ఉచ్చ పోయించావా? ఎవడొస్తాడో రండిరా.. మూడు నెలల్లో ఆరోగ్యం బాగు చేసుకుని మా వాడు (కొడాలి నాని) వస్తున్నాడు. మిమ్మల్ని కట్‌డ్రాయర్ మీద నిలబెట్టి ఉరికిచ్చి కొడతాడు. అరేయ్.. నేను చంపేయండని అనలేదురా. అనాలనుకుంటే పట్టపగలే అంటాను. చంద్రబాబు రోజులు లెక్కపెట్టుకోమని చెప్పాడు కదా! జగన్ అంతు చూడడం నీ తరమా, నీ కొడుకు తరమా? బందరులో ఒక మంత్రి ఉన్నాడు. బెజవాడ వెళ్లి ఇష్టారాజ్యంగా నన్ను తిడతాడు. దిక్కుమాలిన నీ మంత్రి పదవిని కాపాడుకోవడం కోసం.. ఆడపిల్ల(జడ్పీ చైర్‌పర్సన్ హారిక)ను కూడా తిడుతున్నావ్. సొల్లు రవీంద్రా.. నువ్వు అన్నం తినడం లేదు. బ్రాందీ షాపులో రూపాయి తింటున్నావ్. చేపల మార్కెట్‌లో సొంత అన్న కొడుకుల్ని మోసం చేసి స్థలం దొబ్బేశావు. 2024 మేలో ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో నీ ఆస్తి కోటి రూపాయలు కూడా లేదు. మరి రెండు కోట్లు ఎక్కడివి? అన్నం తింటున్నావా డబ్బు తింటున్నావా? అధికారంలోకి వచ్చాక అతడి సంగతి ప్రత్యేకంగా చూస్తాం' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రవీంద్ర బందరులో స్థలాలు ఆక్రమించుకుని పెద్ద భవంతి కడుతున్నాడని.. మద్యం దుకాణాలు, ఇసుక రేవుల నుంచి ముడుపులు తింటున్నాడని.. బందరు కోటలో 9 ఎకరాలు ఆక్రమించుకుని ఐస్‌ఫ్యాక్టరీ కడుతున్నాడని.. కృత్తివెన్నులో 45 ఎకరాలు భూమిని ఆక్రమించేశాడని ఆరోపించారు. స్పీకర్ పదవికి కూడా విలువ ఇవ్వకుండా అయ్యన్నపాత్రుడిని 'ముసలి నాయాలు' అని పేర్ని దూషించారు.

నీతో ఊచలు లెక్కపెట్టిస్తా

» అమలాపురం రూరల్ సీఐకి వైసీపీ నేత విశ్వరూప్ వార్నింగ్



అమలాపురంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విశ్వరూప్

అమలాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు పోలీసులను, అధికారులను బెదిరించడం మానుకోవడం లేదు. అమలాపురం లోక్‌సభ వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్.. తాజాగా ఓ పోలీసు అధికారిపై బెదిరింపులకు పాల్పడ్డారు. 'రానున్నది వైసీపీ ప్రభుత్వమే.. నేను ఎక్కడున్నా నిన్ను మాత్రం వదలను. నీ అంతు చూస్తా.. నీతో జైలు ఊచలు లెక్కపెట్టిస్తా.. వీఆర్‌కు పంపిస్తా..' అని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశంలో.. అమలాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రశాంతకుమార్‌ను ఉద్దేశించి ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వైసీపీ అల్లవరం మండలం అధ్యక్షుడు బాపూజీ కుమారుడిపై అకారణంగా కేసు పెట్టి చిత్రహింసలకు గురిచేయడంతో పాటు కొత్తపేట సబ్‌జైలుకు రిమాండ్‌కు పంపించారని విశ్వరూప్ ఆరోపించారు. "ఈ ఐదేళ్ల కాలంలో మంత్రి కోసమో, ఎమ్మెల్యే కోసమో పనిచేసుకో.. కానీ అకారణంగా వైసీపీ కార్యకర్తలపై వేధింపులకు దిగి కేసులు పెడితే నీతో ఊచలు లెక్కపెట్టిస్తా.." అని హెచ్చరించారు. ఒక పక్షానికి అనుకూలంగా పనిచేసి తమ కార్యకర్తలను వేధింపులకు గురిచేయవద్దని, పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగే పరిస్థితులు తేవద్దని హితవు పలికారు. సీఐపై విశ్వరూప్ చేసిన వ్యాఖ్యలు అటు వైసీపీ, ఇటు పోలీసు వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడవి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.





బోల్తా పడ్డ మామిడికాయల లారీ, ప్రమాదంలో మృతి చెందిన కూలీలు

మామిడి లారీ బోల్తా

» అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

» 9 మంది మృతి.. 9 మందికి గాయాలు

పుల్లంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం కడప- చెన్నై రహదారి పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మామిడికాయల లోడుతో వెళుతున్న లారీ చెరువు కట్టపై ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందగా మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులంతా మామిడికాయలు కోసే కూలీలు. రాజంపేట మండలంలోని మదనగోపాలపురం గ్రామంలోని ఓ తోటలో మామిడికాయలు కోసి వాటిని లారీలో వేసుకుని రైల్వేకోడూరులోని మార్కెట్‌యార్డుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. మృతులంతా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన వారిగా గుర్తించారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంతరిక్ష రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహం

» శ్రీసత్యసాయి, తిరుపతిలో స్పేస్ సిటీలు ఏర్పాటు

» 2033 నాటికి రూ.3.77 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహ ప్రయోగాలకు అద్భుతమైన వాతావరణం ఉందని పరిశ్రమల శాఖ తెలిపింది. ప్రధాన రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలు అందిస్తూ పాలసీని రూపొందిస్తున్న పరిశ్రమల శాఖ.. తాజాగా అంతరిక్ష రంగంలోనూ భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా విధాన పత్రాన్ని విడుదల చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రపంచ అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ వాటా రెండు శాతమే. అయితే.. ఇస్రో, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సహకారంతో చేపడుతున్న పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ), స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ), నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్జీఎల్వీ) వంటి ప్రయోగాలతో అంతర్జాతీయ వేదికపై ఇప్పుడిప్పుడే భారత్ పేరు మార్మోగుతోంది. ఈ క్రమంలో అంతరిక్ష పరిశోధనా రంగాల్లో ఏపీని ఉన్నత స్థానంలో నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం విద్యార్థులు, ఔత్సాహికుల సృజనాత్మకతను గుర్తించి వారికి అంతరిక్ష రంగంలో ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. అంతరిక్షం రంగంలో 2033 నాటికి రూ3.77 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించేలా కార్యాచరణకు సిద్ధమైంది. ముఖ్యంగా ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేలా పరిశ్రమల శాఖ నూతన విధానాన్ని రూపొందించింది. శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో స్పేస్ సిటీలు స్థాపించడం ద్వారా అంతరిక్ష పరిశోధనా రంగంలో పెట్టుబడులు సాధించాలని భావిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఆధారంగా చేసుకుని ఇస్రో సహకారంతో, తిరుపతిలో షార్ సమన్వయంతో స్పేస్ సిటీలు స్థాపించాలని నిర్ణయించింది. స్పేస్ టెక్నాలజీ తయారీ సంస్థలతో ఒప్పందాలు చేసుకునే దిశగా కార్యాచరణకు సిద్ధమైంది.

స్టార్టప్‌లకు 15 లక్షల వరకూ ప్రోత్సాహం

స్పేస్ సిటీ రంగంలో స్టార్టప్‌లకు పరిశ్రమల శాఖ ప్రాథమికంగా రూ.2 లక్షలు, క్రమంగా రూ.15 లక్షల వరకూ ప్రోత్సాహం అందిస్తుంది. స్టార్టప్‌లు స్థాపించే మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రూ.20 లక్షల దాకా ప్రోత్సాహం అందించనుంది. రెండేళ్లపాటు స్టార్టప్‌లు నిర్వహిస్తే చిన్న సూక్ష్మ వ్యాపారంగానూ, రూ.125 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకూ టర్నోవర్ ఉంటే భారీ వ్యాపారంగానూ, రూ.500 కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టిన సంస్థలను మెగా వ్యాపార సంస్థలుగానూ గుర్తిస్తుంది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.